
www.visalaandhra.com Dwaraka
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2015-17
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66 సంచిక : 214 | గురువారం 25-01-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

ఖాకీల దమననీతి

వామపక్ష నేతల నిర్బంధం

- ప్రత్తిపాడులో రామకృష్ణ, కుంచనపల్లిలో మధు అరెస్టు
- దళిత నేతలపై జులుం
- పోలీసు ముట్టడిలో గ్రామం
- చలో పెదగొట్టిపాడుకు అడుగడుగునా ఆటంకాలు
- వామపక్ష, దళిత నేతలతో నిండిన పోలీసుస్టేషన్లు



నిర్మానుష్యంగా ఉన్న గొట్టిపాడు గ్రామం. (ఇన్‌సెట్) సీపీఐ కార్యదర్శి రామకృష్ణ, సీపీఎం కార్యదర్శి మధును అరెస్టు చేసిన పోలీసులు

విశాలాంధ్రబ్యూరో-గుంటూరు/ప్రత్తిపాడు : చలో పెదగొట్టిపాడును అడ్డుకునేందుకు పోలీసులు దమనకాండ ప్రదర్శించారు. గొట్టిపాడు వెళ్లే రహదారులను మూసివేసి, అడుగడుగునా తనిఖీలు నిర్వహిస్తూ ప్రత్తిపాడులో కర్ఫ్యూ వాతావరణం సృష్టించారు. వామపక్ష, దళిత నేతలను అడ్డుకుని అరెస్టులకు పాల్పడ్డారు. దీంతో గొట్టిపాడులో మహిళలు ప్రజాసంఘాలను కలవాలని రోడ్డుపైకి వచ్చి ఎండలో కూర్చున్నారు.

గొట్టిపాడు వెళుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణను ప్రత్తిపాడులో పోలీసులు అడ్డుకున్నారు. బలవంతంగా అరెస్ట్ చేసి గుంటూరులో పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తర్వాత అక్కడ నుంచి నగరంపాలెం పోలీసు స్టేషన్‌కు తరలించారు. విజయవాడ నుంచి గొట్టిపాడు బయలుదేరిన సీపీఎం రాష్ట్రకార్యదర్శి పి.మధును కుంచనపల్లి అండర్ బ్రిడ్జి వద్ద మంగళగిరి పోలీసులు మంగళవారం అరెస్ట్‌చేశారు. అనంతరం గుంటూరు నల్లపాడు పోలీసుస్టేషన్‌కు తరలించారు. దాదాపు రెండురోజులపాటు స్టేషన్‌లో నిర్బంధించి బుధవారం సాయంత్రం 6గంటలకు - మిగతా 2 లో

పెట్రోల్లా.. లిక్కర్



విశాలాంధ్రబ్యూరో - అమరావతి : మరో రెండు నెలల్లో 2017-18 ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఈ ఏడాది మద్యం అమ్మకాల ద్వారా రికార్డుస్థాయిలో ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతోంది. గత

- పది నెలల్లో రూ.13,915.18 కోట్లు
- గతేడాది కంటే రూ.2,500 కోట్లు అధికం
- మద్యం ఆదాయం లక్ష్యం రూ.16 వేల కోట్లు
- ఫిబ్రవరి, మార్చిలో మరో రూ.3 వేల కోట్ల అంచనా

ఆర్థిక సంవత్సరంతో పోల్చితే అబ్కారీశాఖకు సుమారు రూ.2,500 కోట్ల నుంచి రూ.3 వేల కోట్ల అదనపు ఆదాయం సమకూరే అవకాశం ఉందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. గత సంవత్సరం జూలై నుంచి దేశవ్యాప్తంగా జీఎస్‌టీ విధానం అమలులోకి వచ్చింది. మద్యంపై జీఎస్‌టీ విధించటం వల్ల నెలకు రూ.100 కోట్లమేర అదనపు ఆదాయం సమకూరుతోంది. రాష్ట్రంలో సగటున ప్రతి నెలా రూ.1,200 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. జీఎస్‌టీ విధానం అమలులోకి వచ్చిన తర్వాత అది రూ.1,350 కోట్ల నుంచి రూ.1,400 కోట్లగా ఉంటోందని ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.15 వేల కోట్ల ఆదాయాన్ని ఆర్జించాలని ప్రభుత్వం ఎక్సైజ్‌శాఖకు లక్ష్యాన్ని నిర్దేశించగా, ఇప్పటి వరకు సుమారు రూ.14 వేల కోట్ల ఆదాయం లభించింది. మిగిలిన రెండు నెలల్లో మరో రూ.3 వేల - మిగతా 11 లో

2017-18 ఆర్థిక సంవత్సరంలో మద్యం ఆదాయం

నెల	ఐఎంఎల్ (లక్షల్లో)	బీరు (లక్షల్లో)	అమ్మకం విలువ (రూ.కోట్లలో)
ఏప్రిల్	29.78	29.78	1,395.63
మే	29.68	26.59	1,349.49
జూన్	23.99	15.02	1,011.76
జూలై	32.65	16.75	1,574.93
ఆగస్టు	31.14	16.62	1,488.15
సెప్టెంబరు	30.54	16.72	1,476.07
అక్టోబరు	28.91	15.99	1,424.54
నవంబరు	28.56	14.22	1,355.51
డిసెంబరు	32.71	14.81	1,586.64
జనవరి 23 వరకు	25.96	13.60	1,252.46
మొత్తం	**293.92**	**180.10**	**13,915.18**



పవన్ కాన్వాయ్‌పై విసిరిన గుర్తు తెలియని వ్యక్తి చెప్పు

ఓటు బ్యాంకు రాజకీయాలు చేయను

- జనం కోసమే జనసేన
- ప్రేమించేవారు చాలు.. ద్వేషించే వారక్కర్లేదు
- నా జీవితం కార్యకర్తలకే అంకితం
- ఖమ్మం జిల్లా పర్యటనలో పవన్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్/ ఖమ్మం : జనసేన ఓటు బ్యాంకు రాజకీయాలు చేయదని పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రకటించారు. 2019 ఎన్నికల్లో అద్భుతాలు చేస్తామని చెప్పనన్నారు. తన జీవితం జనసేన కార్యకర్తలకు అంకితమని, తాను పదవులు కాదు..సామాజిక మార్పు కోరుకుంటున్నానన్నారు. ప్రేమించేవాళ్లకు తప్ప, ద్వేషించేవాళ్లకు సమయం ఇవ్వనని పవన్ తెలిపారు. తనకు కులం, మతం లేదని; మానవత్వం, జాతీయతను గౌరవిస్తానని అన్నారు. మన సమాజం కులవ్యవస్థతో ముడిపడి ఉందని, కులవ్యవస్థను కాదని రాజకీయాలను చేయలేమన్నారు. మెత్తగా మాట్లాడతానని కొందరు అనుకోవచ్చని, కానీ వ్యూహంలో భాగంగానే కొద్దిగా తగ్గుతానన్నారు. ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా ఖమ్మం ఎంబీ గార్డెన్స్‌లో ఉమ్మడి - మిగతా 2 లో

లాలూకు మరో ఐదేళ్ల జైలు...!



రాంచీ : దాణా కుంభకోణం మూడో కేసులోనూ ఆర్జేడీ అధినేత, బీహార్ మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్‌ను దోషిగా సీబీఐ ప్రత్యేక కోర్టు నిర్ధారించింది. ఈ కేసులో లాలూ, జగన్నాథ మిశ్రా సహా 48 మందిని దోషులుగా ప్రకటించిన సీబీఐ కోర్టు... లాలూ ప్రసాద్ యాదవ్‌కు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. రాంచీలోని సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి ఎస్ఎస్.ప్రసాద్ బుధవారం ఈ తీర్పు చెప్పారు. ఇప్పటికే లాలూ దాణా కుంభకోణం రెండో కేసులో మూడున్నరేళ్ల జైలు శిక్ష అనుభవిస్తున్నారు. ప్రస్తుతం ఆయన బిర్సా ముండా కేంద్ర కారాగారంలో ఉన్నారు. మూడో దాణా - మిగతా 2 లో

ఎన్‌కౌంటర్‌లో నలుగురు పోలీసులు మృతి



రాయ్‌పూర్ : చత్తీస్‌ఘడ్ నారాయణపూర్ జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. నక్సల్స్‌తో జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు సబ్ ఇన్స్‌పెక్టర్లతో సహా నలుగురు పోలీసులు మృతిచెందారని పోలీసులు తెలిపారు. పోలీసు బృందం నక్సలైట్ వ్యతిరేక ఆపరేషన్ నిర్వహిస్తుండగా అబూజ్‌మడ్ ప్రాంతంలోని ఇర్పానర్ గ్రామంలోని అడవుల్లో ఈ ఎన్‌కౌంటర్ జరిగిందని పోలీసు ప్రత్యేక డైరెక్టర్ జనరల్ (యాంటీ నక్సల్స్ ఆపరేషన్) డీఎం అవస్తి పీటీఐకి తెలిపారు. "ఇద్దరు సబ్‌ఇన్స్‌పెక్టర్లు, అంతే సంఖ్యలో డీఆర్‌జీ (డిస్ట్రిక్టు రిజర్వు గార్డు ఆఫ్ పోలీసు)కి చెందిన కానిస్టేబుళ్లు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో మరో ఏడుగురికి గాయాలయ్యాయి" అని ఆయన - మిగతా 2 లో



సర్కార్ల పహారాలో... కర్ణిసేన విధ్వంసం...!

- థియేటర్లు, వాహనాల దగ్ధం
- బీజేపీపాలిత రాష్ట్రాల్లోనే ఆగడాలు
- పద్మావత్ విడుదలపై బలప్రయోగం

9లో

సాగునీటి వాడకంలో

సరికొత్త ప్రయోగం

- కరువు నియంత్రణ, ఎరువుల ఆదా ఉత్పత్తులపై దృష్టి
- యూపీఎల్ గ్లోబల్ సీఈవోతో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : సాగునీటి వినియోగంలో సరికొత్త ప్రయోగం చేపట్టనున్నారు. భూమిలో నీటిని గ్రహించి వాటిని కరవు సమయంలో తిరిగి విడుదల చేసే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రాష్ట్రానికి పరిచయం చేసేందుకు ముఖ్యమంత్రి ప్రయత్నిస్తున్నారు. దీనిలో భాగంగా రైతన్నకు ఉపకరించే ఉత్పత్తులు, ఉపకరణాల తయారీ సంస్థలపై ముఖ్యమంత్రి చంద్రబాబు తన దావోస్ పర్యటనలో దృష్టిపెట్టారు. ఎకరం విస్తీర్ణంలో 2 వేల లీటర్ల నీటిని గ్రహించే సామర్థ్యం గల ఈ తరహా ఉత్పత్తులను యూపీఎల్ లిమిటెడ్ సంస్థ తయారు చేస్తోంది. ఇది కరవును నియంత్రించేందుకు దోహదం చేయడమే కాకుండా - మిగతా 2 లో

అందాలనటి కృష్ణకుమారి ఇకలేరు...!



11లో

ప్రభుత్వ బ్యాంకులకు మూలధన సాయం రూ.88 వేల కోట్లు

11లో

ఇదీ లోకం!



టెన్త్‌కు 'ప్రీ' ముప్పు

- ఫిబ్రవరి 26 నుంచి మార్చి 10 వరకూ ప్రీ-పబ్లిక్
- మార్చి 15 నుంచి పబ్లిక్ పరీక్షలు
- విద్యార్థుల ప్రిపరేషన్‌కు ఆటంకం
- ప్రభుత్వ వైఖరిపై తల్లిదండ్రుల ఆగ్రహం..



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ముందస్తుగా అతి స్వల్ప వ్యవధితో ప్రీ పబ్లిక్ (సమ్మేటివ్ అసైన్‌మెంటు-2) షెడ్యూలును రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది.దీనిపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.2017-18 విద్యా సంవత్సరానికిగాను మార్చి 15 నుంచి 29 వరకూ పదో తరగతి పబ్లిక్ - మిగతా 2 లో

29లోగా ఢిల్లీలో ఉప ఎన్నికల ప్రకటన వద్దు

- లాభదాయక పదవుల కేసులో ఢిల్లీ హైకోర్టు
- ఆప్ ఎమ్మెల్యేల అనర్హత వేటుపై స్టేకు నిరాకరణ

న్యూఢిల్లీ : లాభదాయక పదవుల అభియోగాలపై ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) 20 మంది ఎమ్మెల్యేల అనర్హత వేటు కేసులో తదుపరి విచారణ జరిపే వరకు ఢిల్లీలో ఉప ఎన్నికల ప్రకటన వద్దని ఢిల్లీ హైకోర్టు బుధవారం ఆదేశించింది. ఈ మేరకు ఎన్నికల సంఘం, కేంద్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. అయితే ఎమ్మెల్యేలు 20 మందిని లాభదాయక పదవుల అభియోగంపై అనర్హులుగా ప్రకటిస్తూ కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్ చెల్లుబాటు నిలిపివేతపై స్టే విధించేందుకు న్యాయస్థానం నిరాకరించింది. 29వ తేదీ సోమవారం తదుపరి విచారణ జరిపే వరకు అనర్హతకు గురయిన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహించే నియోజకవర్గాల్లో ఉప ఎన్నికల ప్రకటన జారీ చేయరాదని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

లాభదాయక పదవులున్నాయన్న అభియోగంపై ఆప్ ఎమ్మెల్యేలు 20 మందిని అనర్హులుగా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ విషయంలో తమకు అన్యాయం జరిగిందంటూ అనర్హత వేటుకు గురయిన ఎమ్మెల్యేలు న్యాయపోరాటానికిగాను కోర్టులో పిటిషను దాఖలు చేశారు.

అగ్రిగోల్డ్ బాధితులకు బడ్జెట్‌లో

రూ.4 వేల కోట్లు కేటాయించాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ముప్పాళ్ల. పక్కన తిరుపతిరావు, విశ్వనాథరెడ్డి తదితరులు

- 10 నెలలుగా ప్రభుత్వం కాలయాపన
- మరో పోరాటానికి కార్యాచరణ సిద్ధం
- ఫిబ్రవరి 1 నుంచి కార్యక్రమాలు
- ముప్పాళ్ల, తిరుపతిరావు, విశ్వనాథరెడ్డి వెల్లడి

3లో

ఎఫ్‌టీఏకు శ్రీలంక ఆమోదం



కొలంబో : స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ)పైన శ్రీలంక, సింగపూర్‌లు మంగళ వారం సంతకం చేసి తమ ఆమోదాన్ని తెలియ జేశాయి. రెండు దేశాలలో వాణిజ్యం, పెట్టుబడులను పెంపొందించుకునేందుకు సంతకాలు చేస్తున్నట్టు ఆ దేశాలు ప్రకటించాయి. సింగపూర్ ప్రధానమంత్రి లిహిసిన్‌లూంగ్ ప్రస్తుతం కొలంబోలో పర్యటిస్తున్న సందర్భంగా ద్వైపాక్షిక చర్చల అనంతరం ఎఫ్‌టిఎపైన శ్రీలంక అధ్యక్షుడు మైత్రిపాల సిరిసేనతోపాటు సంతకం చేశారు. సింగపూర్ ప్రధాని మూడురోజుల పర్యటన కోసం సోమవారం శ్రీలంకకు వచ్చారు. సిరిసేనతో లూంగ్ రెండుదేశాలకు సంబంధించిన పలు అంశాలపైన చర్చలు జరిపారు. ఈ ఒప్పందం మూలంగా రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు విస్తృతమవుతాయని శ్రీలంక అధ్యక్షుడి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. సమాచార, సాంకేతిక పరిజ్ఞానం, రియల్ ఎస్టేట్, ఆతిథ్యం, టూరిజం, ఇంధనం, లాజిస్టిక్స్ రంగాలలో రెండు దేశాలు పరస్పరం సహకరించుకొని ప్రయోజనం పొందుతాయని, ఆ ప్రకటన తెలిపింది. సింగపూర్ నుంచి 35 మందితో కూడిన వాణిజ్య ప్రతినిధి వర్గం కూడా శ్రీలంకలో పర్యటించింది.

ఫెడరల్ ఛైర్మన్‌గా పావెల్

వాషింగ్టన్ : అమెరికా ఫెడరల్ రిజర్వ్ తదుపరి ఛైర్మన్‌గా జెరోం పావెల్‌ను సెనేట్ మంగళవారం ధృవీకరించింది. 85-12 ఓట్ల మెజార్టీతో సెంట్రల్ బ్యాంక్ ఛైర్మన్‌ను సెనేట్ ఎన్నుకున్నది. పావెల్ పదవీకాలం 4 ఏళ్లు ఉంటుంది. ప్రస్తుత ఛైర్మన్ జానెట్‌ఎల్లెన్ ఫిబ్రవరి 3వ తేదీన పదవీ విరమణ చేస్తారు. అనంతరం పావెల్ పదవీ బాధ్యతలను స్వీకరిస్తారు. ప్రస్తుతం పావెల్ ఫెడరల్ రిజర్వ్ గవర్నర్ల బోర్డు సభ్యుడుగా ఉన్నారు. గత ఏడాది నవంబరులోనే దేశ అధ్యక్షుడు ట్రంప్ పావెల్‌ను ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్‌గా నియమించారు.

విశాలాంధ్ర ప్రపంచం

రక్షణవాదం టెర్రరిజంవలే ప్రమాదకరం

మోడీ ప్రసంగాన్ని ప్రశంసిస్తూ చైనా వ్యాఖ్య



బీజింగ్ : రక్షణవాదం టెర్రరిజంవలె అత్యంత ప్రమాదకరమైనదని చైనా వ్యాఖ్యానించింది. భారత ప్రధానమంత్రి నరేంద్రమోడి దావోస్ సదస్సులో రక్షణవాదం సరైందికాదని చేసిన ప్రసంగాన్ని చైనా ప్రశంసించింది. ప్రపంచీకరణను పటిష్టం చేయాలన్న మోడీ సూచనకు చైనా మద్దతు పలికింది. ప్రపంచ ఆర్థిక సదస్సులో రెండు దశాబ్దాల తరువాత భారత ప్రధాని హోదాలో మాట్లాడిన వ్యక్తి మోడీ మాత్రమే. ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లలో టెర్రరిజం వాతావరణ మార్పులు, రక్షణవాదం ప్రముఖమైనవిగా మోడీ పేర్కొన్నారు. మోడీ ప్రసంగంపై చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి హుచున్‌యింగ్ మాట్లాడుతూ నేటి కాలంలో ప్రపంచీకరణ అభివృద్ధిచెందిన దేశాలతో సహా అన్ని దేశాలకు ప్రయోజకరంగా ఉందని అన్నారు. ప్రపంచీకరణను ప్రోత్సహించడం అవసరమని ఆమె తెలిపారు. ప్రపంచీకరణ పటిష్టతకు భారతదేశంతో కలిసి పనిచేస్తూ ఉన్నారు. ప్రపంచీకరణవల్ల ఎక్కువగా ప్రయోజనం పొందిన దేశాల్లో చైనా ప్రధానమైంది.

వినియోగవస్తువుల ఉత్పత్తి ఎగుమతి ద్వారా జిడిపిని రెండంకెల స్థాయికి చైనా పెంచుకోగలిగింది. అమెరికా ఫస్ట్ విధానాన్ని చైనా వ్యతిరేకిస్తున్నది. చైనా, భారతదేశాలు అనేక అంశాలలో ఉమ్మడి ప్రయోజనాలకు కలిగివున్నాయని ఆమె చెప్పారు. ప్రపంచ ఆర్థిక వృద్ధికి అన్ని దేశాల సంక్షేమానికి దోహదం చేసే ఆర్థిక ప్రపంచీకరణకు భారతదేశంతో సహా అన్ని దేశాలతో సహకారం, సమన్వయంతో పనిచేస్తామని అన్నారు.

పాలస్తీనాలో సార్వత్రిక సమ్మె

జెరూసలేం : అమెరికా ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ ఇజ్రాయిల్ పర్యటన సందర్భంగా చేసిన ప్రసంగాన్ని నిరసిస్తూ పాలస్తీనాలో బుధవారం సార్వత్రిక సమ్మె జరిగింది. తూర్పు జెరూసలేంను ఇజ్రాయిల్ ఆక్రమించుకోవడాన్ని పెన్స్ సమర్థించారు. అంతేకాదు.. జెరూసలేంను ఇజ్రాయిల్ రాజధానిగా గుర్తిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటనను పెన్స్ సమర్థించారు. ప్రస్తుతం ఇజ్రాయిల్ ఆక్రమణలోవున్న పశ్చిమ జెరూసలేం ప్రాంతంలో ఇజ్రాయిల్ సైన్యం అరాచకమైన చర్యలకు పాల్పడుతున్నదని పాలస్తీనా ప్రజలు నిరసించారు. పాలస్తీనా ప్రాంతంలోని వడీర బాబా, వడీహిల్‌వెహా జిల్లాలకు వెళ్లే రహదారులకు కూడా ఇజ్రాయిల్ సైన్యం మూసివేసింది. షాపులు, బ్యాంకులు, విద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సముదాయాలు మూసివేసి సమ్మెకు మద్దతు తెలియజేశారు. సమ్మె దేశవ్యాప్తంగా విజయవంతమైందని జాతీయ ఇస్లామిక్ శక్తులు సమ్మెకు పిలుపునిచ్చినాయని పాలస్తీనా వఫా వార్తా ఏజెన్సీ తెలియజేసింది. శాంతియుతంగా జరిగే పోరాటానికి ఇది ప్రారంభం అని పతాహ్ అధికార ప్రతినిధి జమాల్ ముహిసిన్ పాలస్తీనా రేడియోకు తెలియజేశారు.

సామాజిక సమానత్వం కావాలి

కెనడా ప్రధాని ట్రుడీవ్ పిలుపు



దావోస్ : స్త్రీ, పురుష సమానత్వం, సామాజిక సమానత్వం ఎంతైనా అవసరమని కెనడా ప్రధాన మంత్రి జస్టిన్ ట్రుడీవ్ పేర్కొన్నారు. దావోస్‌లో జరిగిన ప్రపంచ మేధావుల సదస్సులో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాల్గొనడానికి ముందు ట్రుడీవ్ మాట్లాడుతూ కొన్ని ప్రాంతాలలో లైంగిక వేధింపులు వ్యవస్థీకృత సమస్య అయ్యిందని అన్నారు. ఏడు పారిశ్రామిక దేశాల గ్రూపు అధ్యక్షుడి హోదాలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది జి-7 గ్రూపు కార్యకలాపాలలో స్త్రీ పురుష సమానత్వానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ట్రుడీవ్ 2015లో అధికారం చేపట్టిన తరువాత తన మంత్రివర్గంలో స్త్రీ పురుషులకు సమానసంఖ్యలో ప్రాతినిధ్యం కల్పించారు. లైంగిక వేధింపులు, దుష్ట ప్రవర్తన తదితర అంశాలపైన సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేయించారు. మహిళలను కించపరిచే విధంగా ట్రంప్ విధానాలు ఉన్నాయని నిరసిస్తూ గత వారం అమెరికా అంతటా మహిళ ప్రదర్శనలు జరిగాయి. మహిళా హక్కులు, సమానత్వం స్త్రీ పురుషులకు అధికారంలో భాగస్వామ్యం అంశాలపైన లోతైన చర్చలు జరగాలని ట్రుడీవ్ సూచించారు. వాణిజ్య కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు తదితర అనేక ప్రాంతాలలో లైంగిక వేధింపులు వ్యవస్థీకృత సమస్య అయ్యిందని, దీన్ని ఎంత మాత్రం అంగీకరించరాదని ఆయన పేర్కొన్నారు. గత రెండు సంవత్సరాల్లో ట్రంప్ లైంగిక వేధింపులకు పాల్పడినట్టు డజనుమందికిపైగా మహిళలు ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలను ట్రంప్ తిరస్కరించారు కూడా.

మయన్మార్‌కు వచ్చే రోహింగ్యాలకు రక్షణ ఉందా?



ఐరాస : బంగ్లాదేశ్‌లో తలదాచుకుంటున్న రోహింగ్యా ప్రజలు తిరిగి మయన్మార్‌లోని రఖైం రాష్ట్రానికి వస్తే వారికి తగిన రక్షణ ఉంటుందా? అని ఐక్యరాజ్యసమితి శరణార్థుల ఏజెన్సీ, ఇతర గ్రూపులు సందేహాన్ని వ్యక్తం చేస్తున్నాయి. బంగ్లాదేశ్ నుంచి రోహింగ్యాలను తిరిగి మయన్మార్‌కు పంపించే ప్రణాళికపైన మరోసారి ఆలోచించాలని ఐరాస ఏజెన్సీ కోరింది. గత సంవత్సరం తీవ్రమైన హింసాకాండ, రక్తపాతం జరగడంతో లక్షలాదిమంది రోహింగ్యా ముస్లింలు రఖిన్ రాష్ట్రాన్ని వదిలి బంగ్లాదేశ్‌లో ప్రవేశించారు. ప్రపంచమంతా మైన్మార్ ప్రభుత్వాన్ని విమర్శించింది. ఐక్యరాజ్యసమితి తీర్మానం ద్వారా మయన్మార్ ప్రభుత్వాన్ని అభిశంసించింది. ఈ నేపథ్యంలో మయన్మార్ ప్రభుత్వ కీలకనేత అంగ్‌సాన్‌సూకీ విమర్శలకు తలొగ్గి చొరవ తీసుకుని బంగ్లాదేశ్‌తో చర్చించి రోహింగ్యాలను తిరిగి తమ దేశంలోకి అనుమ తిస్తామని ఒప్పందం చేసుకున్నారు. రోహింగ్యాలకు మయన్మార్ పౌరసత్వం ఇచ్చే అంశంగాని, ఇంకా ఇతర సమస్యలుగాని చర్చించి ఒప్పందంలో పేర్కొనలేదని జెనీవా నుంచి ఐరాస శరణార్థుల ఏజెన్సీ ప్రతినిధి ఫిలిప్పోగ్రాండి తెలిపారు. ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో దాదాపు 7 లక్షలమంది రోహింగ్యాలు ఉన్నారు. రోహింగ్యాలను తిరిగి మైన్మార్‌కు పంపే అంశాన్ని మరికొంత జాప్యం చేయడం మంచిదేనని అమెరికా విదేశాంగశాఖ ప్రతినిధి హీదర్‌నొరట్ అన్నారు. రక్షణలేదని భావించే శరణార్థులను బలవంతంగా వెనక్కుపంపడం సరైందికాదని ఆమె పేర్కొన్నారు.

బ్రిటన్ పర్యటనకు అడ్డంకులు వద్దు

పార్లమెంటుకు 60వేల మంది వినతి

లండన్ : యూరోపియన్ యూనియన్‌యేతర దేశాల నుంచి ప్రస్తుతం బ్రిటన్ పౌరులుగావున్న కుటుంబాలకు చెందిన వ్యక్తులను బ్రిటన్‌లో పర్యటించేందుకు అడ్డంకులు కల్పించవద్దని 60వేల మందికిపైగా పార్లమెంటుకు వినతిపత్రాన్ని సమర్పించారు. బ్రిటన్ పౌరసత్వాన్ని పొంది ఇక్కడే నివసిస్తున్న వారి కుటుంబ సభ్యులను అనుమతి పత్రాలతో నిమిత్తం లేకుండా దేశంలో పర్యటనకు అనుమతించాలని వీరు పిటీషన్ దాఖలు చేశారు. వీరికి అనుకూలంగా దేశవ్యాప్తంగా ఉద్యమం విస్తృతమవుతున్నది. ఈ సమస్యపైన ప్రజలలోను, రాజకీయరంగంలోను విస్తృతంగా చర్చ సాగుతున్నది. బ్రిటన్ ఇమ్మిగ్రేషన్ విధానంపైన, బ్రిటన్‌లో పౌరసత్వం పొందిన ఇతర దేశాల కుటుంబాలకు చెందిన వ్యక్తులు ఆటంకాలు లేకుండా దేశంలో పర్యటిస్తే ఎదురయ్యే పరిణామాలు, ఇబ్బందులను విస్తృతంగా చర్చిస్తున్నారు. ఈ సమస్యను బ్రిటన్‌లో నివసిస్తున్న భారత కుటుంబాలు ఎక్కువగా ఎదుర్కొంటున్నాయని ఇక్కడ నివసించే కుటుంబాలకు చెందిన వ్యక్తులు భారతదేశం నుంచి రావడానికి ఎంతో ఇబ్బందని ఎదుర్కొంటున్నారని భారతీయ వర్కర్స్ అసోసియేషన్ తెలియజేసింది. ఇక్కడ నివసిస్తున్న భారతీయ సంతతికి చెందిన పౌరులు ఈ ఉద్యమానికి గట్టిగా అండదండలుగా నిలిచారు. పార్లమెంటరీ వెబ్‌సైట్‌లో ఈమేరకు పిటిషన్‌ను ఉంచారు. అయితే ప్రస్తుతం దేశంలోకి వచ్చే వారిపైగల నియమనిబంధనలను మార్చే ఆలోచనలేదని ప్రభుత్వం వివరణ ఇచ్చింది.

లిబియాలో పేలిన కారు బాంబులు

- 33 మంది మృతి
- 30 మందికి గాయాలు



ట్రిపోలీ : లిబియా తూర్పు ప్రాంతంలోని బెంఘజి నగరంలో జంట కారుబాంబులు పేలి 33 మంది చనిపోగా, దాదాపు 30 మంది గాయపడ్డారు. మంగళవారం రాత్రి కారుబాంబుల దాడి జరిగిందని అధికారులు తెలిపారు. మసీదులో ప్రార్థన అనంతరం తిరిగి ఇళ్లకు వెళ్లిపోయే సమయంలో బాంబులు పేల్చారు. మొదటిబాంబు సల్మని ప్రాంత సమీపంలో పేలింది. రెండవ బాంబు ఆ తరువాత అరగంటకు పేల్చారని సైనిక ప్రతినిధి తరీక్‌అల్‌ఖరజ్ తెలిపారు. స్థానిక ఆరోగ్య విభాగం అధికారి హనిబెల్రస్ మాట్లాడుతూ 33 మంది చనిపోగా దాదాపు 30 మంది గాయపడినట్టు చెప్పారు. బాంబు పేలుళ్లకు కారణమెవరైందీ ఇంకా ప్రకటించలేదు. ఈ పేలుళ్లను ఐక్యరాజ్య సమితి ఖండించినట్టుగా సోషల్ మీడియాలో ప్రచారమయ్యింది. లిబియాను సుదీర్ఘకాలం నియంతలాగా పాలించిన మహమ్మర్‌గడాఫీని 2011లో చంపివేసిన తరువాత దేశంలో కల్లోల పరిస్థితులేర్పడ్డాయి. 2014 నుంచి తూర్పు, పశ్చిమ ప్రాంతాల్లో ప్రత్యర్థులు రెండు పార్లమెంటులను, రెండు ప్రభుత్వాలను ఏర్పాటుచేసి ఘర్షణలకు దిగారు. రెండు ప్రాంతాల ప్రభుత్వాలకు విభిన్న తీవ్రవాద గ్రూపులు మద్దతు తెలియజేస్తున్నాయి. ఈనేపథ్యంలో తరచుగా బెంఘజి ప్రాంతం ఘర్షణలకు నిలయంగా మారింది. బాంబు పేలుళ్లు, దాడులు తరచుగా జరుగుతున్నాయి. స్థానికంగా బలమైన ఖలీఫాఇఫ్తర్ అనుకూల శక్తులు ఘర్షణలకు దిగుతూ నగరాన్ని కల్లోలపరుస్తున్నాయి.

టెన్త్‌కు 'ప్రీ' ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

పరీక్షలను నిర్వహిస్తారు. ఈ పరీక్షలకు సిద్ధమయ్యేందుకుగాను విద్యార్థులకు దాదాపు నెలరోజుల వ్యవధి కావాల్సి వుంది.పబ్లిక్ పరీక్షల సమయానికి ఐదు రోజుల ముందస్తుగా ఫిబ్రవరి 26 నుంచి మార్చి 10వరకూ ప్రీ-పబ్లిక్ పరీక్షల టైమ్‌టేబుల్‌ను రాష్ట్ర విద్యా పరిశోధనా శిక్షణ సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎంఎస్ రాజ్యలక్ష్మి విడుదల చేశారు.ప్రీ-పబ్లిక్ పరీక్షలు ముగిసిన ఐదు రోజులకే, పబ్లిక్ పరీక్షలు రాయడం వారికి భారం కానుంది.రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయుల్ని జన్మభూమి, మరుగుదొడ్ల సర్వే తదితర కార్యక్రమాలకు తరగతులకు ఆటంకం నెలకొంది.అనుకున్న సమయానికి పదో తరగతి సిలబస్ పూర్తవ్వలేదు. కొన్ని పాఠశాలల్లో ఇటీవల వరకూ సిలబస్‌ను హడావిడీగా పూర్తి చేశారు.ఈ క్రమంలో విద్యార్థులకు వరుస వారీగా పరీక్షలు నిర్వహించడంపై విమర్శలు నెలకొన్నాయి.పరీక్షల సంస్కరణలో భాగంగా చేపట్టిన నిరంతర సమగ్ర మూల్యాంకనం(సీసీఈ) పద్ధతికి అనుగుణంగా ప్రీ-పబ్లిక్ నిర్వహిస్తారు.

ప్రీ-పబ్లిక్ పరీక్షల షెడ్యూలు ఇదీ..

ఫిబ్రవరి 26న ఫస్టు లాంగ్వేజ్ పేపర్-1 (కాంపోజిట్ కోర్స్). 27న ఫస్టు లాంగ్వేజ్ పేపర్-2, ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-2(కాంపోజిట్స్), ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-1 (సంస్కృతం,అరబిక్, పర్సియన్), 28న సెకండ్ లాంగ్వేజ్, మార్చి 1న ఇంగ్లీషు పేపర్-1, 2న ఇంగ్లీషు పేపర్-2, 3న మ్యాథ్స్ పేపర్-1, 5న మ్యాథ్స్ పేపర్-2, 6న జనరల్ సైన్స్ పేపర్-1, 7న జనరల్ సైన్స్ పేపర్-2, 8న సోషల్ స్టడీస్ పేపర్-1, 9న సోషల్ స్టడీస్ పేపర్-2, 10న ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-2(సంస్కృతం, అరబిక్, పర్షియన్) పరీక్షలను నిర్వహిస్తారు. అధికారులు స్పందించి పబ్లిక్, ప్రీ-పబ్లిక్ పరీక్షలకు మధ్య విద్యార్థులు చదువుకునేందుకు అనువుగా కొంత సమయంతో షెడ్యూలును మార్చాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

నూరు శాతం ఉత్తీర్ణత సాధ్యమయ్యేనా..?

ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతితో నూరుశాతం ఉత్తీర్ణత ప్రశ్నార్థకంగా మారింది. గత విద్యా సంవత్సరం కంటే ఈ ఏడాది మెరుగైన ఫలితాలు సాధించాలని మానవ వనరులశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు ఆదేశించిన విషయం విదితమే.13జిల్లాల విద్యాశాఖాధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టారు.పదో తరగతి విద్యార్థుల బోధనపై ఆరా తీశారు.గ్రామీణ ప్రాంతాల్లోని తెలుగు మీడియం పాఠశాలల విద్యార్థులకు ఆంగ్లం, మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టులపై పూర్తిస్థాయి పట్టు రావట్లేదు.వెనుకబడిన ప్రాంతాల విద్యార్థుల చదువులపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించాల్సిన అవసరముంది.

రాజకీయాలు చేయను

(మొదటిపేజీ తరువాయి)

ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల కార్యకర్తలతో పవన్ బుదవారం సమావేశమయ్యారు. ఎన్నికల్లో సీట్లు ఇస్తేనే సామాజిక న్యాయం జరగదని, తమ కులం అభివృద్ధి చెందకపోవడంపై ఆయా నేతలు ఆలోచించాలని పవన్ అన్నారు. కార్యకర్తలు సంక్షేమ హాస్టళ్ల స్థితిగతులు తెలుసుకోవాలని సూచించారు. నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్య తనను కదిలించిందని, ప్రజలకు అండగా నిలబడితే ఎందుకు విమర్శలు చేస్తారో తెలియడం లేదన్నారు. ఇంతకాలం ప్రజా సమస్యలు ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. స్థానిక సమస్యలను వెలుగులోకి తేవాలని పార్టీ కార్యకర్తలను కోరారు. సమస్యలపై అధికారపక్షాలను నిలదీయడమంటే తిట్టడం కాదని పవన్ అన్నారు.

మైనింగ్ కళాశాల ఏర్పాటు చేయాలి : అంతకుముందు అతిథి గృహంలో పవన్ పత్రికల వారితో మాట్లాడుతూ కొత్తగూడెం సమస్యలపై తనకు అవగాహన ఉందన్నారు. కొత్తగూడెంలో అపారమైన ఖనిజ సంపద ఉందని, ఇక్కడ మైనింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ ప్రాంతంలో కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని డిమాండు చేశారు. సింగరేణి ఆస్పత్రిని సూపర్ స్పెషాలిటీగా మార్చాలని ప్రభుత్వాన్ని కోరతానన్నారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ప్రాణ గండం నుంచి బయటపడిన బాలిక శ్రీజ తనను కలిసి, తానెంతో ఆరోగ్యంగా ఉన్నానని చెప్పిందని, ఈ విషయం తనకు సంతోషాన్ని కలిగిస్తోందని పవన్ అన్నారు. అప్పట్లో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ తనకు పవన్‌ను చూడాలని శ్రీజ కోరినట్టు తెలుసుకున్న ఆయన బాలికను కలిసి పరామర్శించారు. ఆమె తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు. అనంతరం శ్రీజ కోలుకున్న విషయం విదితమే.

చెప్పుతో దాడి : పవన్ కల్యాణ్‌పై గుర్తు తెలియని వ్యక్తి చెప్పుతో దాడి చేశాడు. ఖమ్మం పర్యటనలో ఉన్న పవన్‌పై ఓ దుండగుడు ఇలా చేయడం సంచలనంగా మారింది. ఓపెన్‌టాప్ వెహికల్‌లో అభిమానులకు అభివాదం చేసుకుంటూ ర్యాలీ నిర్వహిస్తున్న పవన్‌పై ఓ వ్యక్తి చెప్పు విసరగా అది కారు బాయినెట్‌పై పడింది. దీంతో అభిమానులు, కార్యకర్తలు ఊపిరి పీల్చుకున్నారు. తనపై దాడులు చేసినా ఎదురుదాడి చేయబోనని, ప్రజల కోసం ఏమైనా భరిస్తానని పవన్ అన్నారు. మహనీయుల ఆశయాల కోసం బాధ్యతాయుత రాజకీయాలు చేయాలని సూచించారు.

ఖాకీల దమననీతి

(మొదటిపేజీ తరువాయి)

ఆయన్ని విడుదల చేశారు.ఆయనతోపాటు వామపక్షాల నాయకులు శాంతికుమార్, వైకే, డి.రమాదేవి, చలమయ్య, జేవీ రాఘవులు, వై.రాధాకృష్ణ, నేతాజీ, నళినికాంత్, కాళిదాసు, దళిత సంఘం రాష్ట్ర నాయకులు భగత్‌సింగ్, కనపర్తి రత్నం, కె.ప్రకాశ్, కాంగ్రెస్ నాయకులు కొర్రి వినయ్‌కుమార్, డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి కనకరాజుప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కాబోతు ఈశ్వరరావు, జి.విజయ్‌కుమార్, కాకుమాను నాగేశ్వరరావు, కౌలు రైతుల కార్యదర్శి పి.జమలయ్య, ఉపాధ్యక్షుడు శివనాగేశ్వరరావు, ఈమని అప్పారావు, వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ కార్యదర్శి కె.రోశయ్య, రమాదేవి, ప్రత్తిపాడు సీపీఐ కార్యదర్శి ఆర్.ఆదేశ్వరరావు తదితరులను అరెస్టు చేశారు. వారిని గుంటూరులో వివిధ స్టేషన్లకు తరలించారు.

ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అగ్ర కులాలకు కొమ్ముకాస్తోందని ఆరోపించారు. గొట్టిపాడులో దళితులపై దాడి చేసినప్పటికీ ఏ మాత్రం స్పందించకుండా మౌనంగా ఉండటం దారుణమన్నారు. కేసులను నిర్వీర్యం చేసే కుట్ర పన్నుతుందని ధ్వజమెత్తారు. ఒకవైపు దళితులపై దాడులు చేయిస్తూనే మరొక వైపు ఈనెల 26 నుంచి దళిత తేజం పేరిట కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయడం ఘోరమన్నారు. ప్రభుత్వానికి దళితులపై ప్రేమ లేదని విమర్శించారు. గొట్టిపాడులో దళితులను పరామర్శించేందుకు వెళుతున్న తమను ఎందుకు పోలీసులు అడ్డుకుంటున్నారో తెలియడం లేదన్నారు. తమ వద్ద ఆయుధాలు లేనప్పటికీ గ్రామంలో ప్రవేశించడానికి ఎందుకు అనుమతులు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో దళితులపై వరుసగా దాడులు జరుగుతున్నాయన్నారు. పశ్చిమగోదావరి జిల్లా గరగపర్రు గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు నేపథ్యంలో అగ్రవర్ణాలు అడ్డుకోవడంతోపాటు దళితులను బహిష్కరించారన్నారు. అలాగే కర్నూలు జిల్లా నక్కలదిన్నెలో కూడా దళితులకు అవమానం జరిగిందన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకుండా ఎందుకు ఉందని ప్రశ్నించారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశవ్యాప్తంగా దళితులపై దాడులు పెరిగాయన్నారు. దళితులను రక్షించాల్సిన ప్రభుత్వాలు అగ్ర వర్ణాలకు కాపుకాస్తూ దళితులకు అన్యాయం చేస్తున్నాయన్నారు. గొట్టిపాడులో అగ్రవర్ణాల దాడిలో గాయపడిన దళితులు ఇప్పటికీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. దాడి చేసిన వారిని ఇప్పటి వరకు ఎందుకు అరెస్ట్ చేయలేదో చెప్పాలని డిమాండు చేశారు. ప్రభుత్వం వైఖరి మార్చుకోకపోతే దళిత సంఘాలు, వామపక్షాలు, ప్రజాసంఘాలు కలిపి రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. గొట్టిపాడులో దళితులకు న్యాయం జరిగే వరకు ఉద్యమం కొనసాగిస్తామన్నారు.

150 మంది నాయకుల అరెస్ట్

చలో గొట్టిపాడు కార్యక్రమం సందర్భంగా బుధవారం జిల్లావ్యాప్తంగా 150 మంది వామపక్ష నాయకులు అరెస్ట్ అయ్యారు. ప్రధానంగా ప్రత్తిపాడు, తాడికొండ, గుంటూరులలో పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిని గుంటూరులో పట్టాభిపురం, నగరంపాలెం, కొత్తపేట, పాతగుంటూరు, నల్లపాడు వంటి పోలీసు స్టేషన్లకు తరలించారు. దీంతో వామపక్షాల నాయకులతో పోలీసుస్టేషన్లు నిండిపోయాయి. తమ నాయకులను అరెస్ట్ చేయడం అన్యాయమంటూ కార్యకర్తలు నిరసనలు తెలిపారు.

గొట్టిపాడులో భారీగా పోలీసుల మోహరింపు

గొట్టిపాడులో అడుగడుగునా భారీగా పోలీసులను మోహరించారు. సీపీఐ, సీపీఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జరిగిన చలో గొట్టిపాడు కార్యక్రమాన్ని పోలీసులు బలవంతంగా అడ్డుకున్నారు. మహిళలపై జులుం ప్రదర్శించారు. అడుగడుగునా తనిఖీ చేశారు. గొట్టిపాడు వైపు వెళ్ళే అన్ని దారులను మూసేశారు. డ్రోన్ కెమెరాలతో పహారా కాశారు. కర్ఫ్యూ వాతావరణాన్ని ప్రత్తిపాడు తలపించింది. గొట్టిపాడులో మహిళలు ప్రజాసంఘాలను కలవాలని రోడ్డుపైకి వచ్చి ఎండలో కూర్చున్నారు. గుంటూరు అర్బన్ ఎస్పీ విజయరావు, డీఎస్పీలు ముగ్గురు, సీఐలు నలుగురు, ఏపీఎస్పీ దళాలను మోహరించాయి. అదనపు ఎస్పీ వైటీ నాయుడు పాల్గొన్నారు. దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావును స్థానిక ప్రత్తిపాడు సీపీఐ కార్యాలయంలో అరెస్టు చేశారు. పోలీసుల నిరంకుశ వైఖరి, ప్రభుత్వం పట్టుదల కారణంగా గొట్టిపాడు వెళ్లలేకపోతున్నామని తెలిపారు. బాధితులతో మాట్లాడకుండా అడ్డుకోవడం ప్రభుత్వం తప్పిదమని దీనికి తగిన మూల్యం చెల్లించుకోవాల్సివస్తుందని హెచ్చరించారు.

అరెస్టులకు వామపక్షాల నేతల ఖండన

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : పెదగొట్టిపాడుకు తరలివెళ్తున్న సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శులు కె.రామకృష్ణ, పి.మధులతోపాటు పలు వామపక్ష, దళిత, ప్రజాసంఘాల నేతలు, కార్యకర్తల్ని పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి.

ఈ మేరకు బుధవారం సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావుతోపాటు వై.వెంకటేశ్వరరావు-సీపీఎం, వై.సాంబశివరావు- సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ, గుర్రం విజయ్‌కుమార్-సీపీఐ (ఎంఎల్), ఎం. వెంకటరెడ్డి- ఎంసీపీఐ (యు), బి.బంగార్‌రావ్-సీపీఐ(ఎంఎల్) లిబరేషన్, చిట్టిపాటి వెంకటేశ్వర్లు-సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ, బి.ఎస్.అమర్‌నాథ్- ఎస్‌యూసీఐ(సి), పీవీ సుందరరామరాజు-ఫార్వర్డ్ బ్లాక్, జానకీరాములు- రివల్యూషనరీ సోషలిస్టు తదితర పార్టీ నాయకులు ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 1వ తేదీన గొట్టిపాడులో దళితులపై అగ్రకుల పెత్తందారులు దాడికి పాల్పడ్డారని, గ్రామంలో సాంఘిక బహిష్కరణకు పాల్ప డ్డారని పేర్కొన్నారు. అరెస్టయిన వారిలో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్, గొట్టిపాడు దళిత సంఘీభావ కమిటీ కన్వీనర్ శాంతికుమార్, వై.కోటేశ్వరరావు, కె.వినయ్‌కుమార్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.సుబ్బారావు, డి.రమాదేవి, గుంటూరు పశ్చిమ జిల్లా కార్యదర్శి గద్దె చలమయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నేతాజీ, రాధాకృష్ణ, వామపక్ష, దళిత, ప్రజాసంఘాల నేతలు ఆర్.ఆదేశ్వరరావు, కె.ఈశ్వరరావు, వెంకటేశ్వరరెడ్డి, నాగండ్ల బ్రహ్మయ్య, పోతురాజు, ఎం.గణిరాజు, కె.సుబ్బారావు, కె.ప్రసాద్, ఎన్.సురేష్‌తోపాటు 129 మంది ఉన్నారని వివరించారు. దళితులపై దాడికి పాల్పడిన వారిని శిక్షించి, సాంఘిక బహిష్కరణ ఎత్తివేసేలా చర్యలు తీసుకోవాలని, అక్రమంగా అరెస్టు చేసిన వామపక్ష, దళిత, ప్రజాసంఘాల నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండు చేశారు.

పోలీసులు మృతి

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. డీఆర్‌జీ, ప్రత్యేక టాస్క్‌ఫోర్సు (ఎస్టీఎఫ్) పోలీసులతో కూడిన బృందం ఇర్పానర్ అటవీ ప్రాంతాన్ని ముట్టడించారని, పోలీసు బృందాన్ని చూసిన నక్సల్స్ వారిపై కాల్పులు జరిపారని చెప్పారు. పోలీసు బృందం కూడా ఎదురు కాల్పులు ప్రారంభించిందని తెలిపారు. ఎన్‌కౌంటర్ సమాచారం అందుకున్న వెంటనే మరిన్ని బలగాలు ఆ ప్రాంతానికి వెళ్లాయని అవస్థి తెలిపారు. ఎన్‌కౌంటర్‌లో గాయపడిన వారిని చికిత్స కోసం విమానంలో రాయ్‌పూర్ తరలించారని తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్ ఉదయం 11 గంటల ప్రాంతంలో ప్రారంభమైందని, దాదాపు రెండు గంటలపాటు జరిగిందని పోలీసు ఇన్స్‌పెక్టర్ జనరల్ (బస్తర్ రేంజ్) వివేకానంద్ సిన్హా తెలిపారు.

మరో ఐదేళ్ల జైలు...!

(మొదటిపేజీ తరువాయి)

కుంభకోణం కేసులో ఛాయ్‌బసా ఖజానా నుంచి రూ.36కోట్లు అక్రమంగా పొందినట్లు లాలూ, మిశ్రాపై కేసు ఉంది. నిజానికి అనుమతిచ్చిన మొత్తం రూ.7.1 లక్షలు కాగా.. ఏకంగా 33 కోట్లు తీసుకోవడం గమనార్హం. లాలూపై మొత్తం ఐదు దాణా కుంభకోణం కేసులు ఉన్నాయి. 2013లో మొదటి దాణా కుంభకోణం కేసులో లాలూకు అయిదేళ్ల జైలు శిక్ష పడింది. మరో కేసులో ఈనెల 6న లాలూకి మూడున్నరేళ్ల జైలు శిక్ష విధిస్తూ సీబీఐ న్యాయస్థానం తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. ఆయనపై ఇంకా దమ్కా ఖజానా నుంచి రూ.3.97కోట్లు, దొరాండా ఖజానా ద్వారా రూ.184కోట్లు అక్రమంగా పొందినట్లు కేసులు ఉన్నాయి. ఇది కూడా సీఎం నితీశ్ కుట్రేనని బీహార్ మాజీ డిప్యూటీ సీఎం, లాలూ కుమారుడు తేజస్వి యాదవ్ విమర్శించారు. ఇదే తుది తీర్పు కాదని, తమకు ఇంకా న్యాయపోరాటం చేసే అవకాశం ఉందని చెప్పారు. దాణా కుంభకోణం కేసులో 76 మంది నిందితులు కాగా, వీరిలో 14 మంది చనిపోయారు. ముగ్గురు అప్రూవర్లుగా మారారు. ఇద్దరు నేరాన్ని అంగీకరించారు.

సరికొత్త ప్రయోగం

(మొదటిపేజీ తరువాయి)

30 నుంచి 40 శాతం వరకు ఉత్పాదకత పెంచగలదని అంచనా. అలాగే భారీ వర్షాల సమయంలో భూమిపై జల్లిన ఎరువులు కొట్టుకుపోయి వృథా కాకుండా సంరక్షించే మరో ఉత్పత్తిని సైతం యూపీఎల్ సంస్థ రూపొందించింది. దీంతో 30 శాతం ఎరువుల వినియోగం తగ్గుతుందని తయారీ సంస్థ చెబుతోంది. వ్యవసాయ ఉపకరణాలు, ఉత్పత్తులకు పేరుగాంచిన యూపీఎల్ సంస్థ గ్లోబల్ సీఈవో జై షరోఫ్‌తో బుధవారం ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. ఎరువుల వినియోగాన్ని తగ్గించడం, సమర్థ నీటి నిర్వహణ చేపట్టడం, వ్యవసాయ వ్యయ భారాన్ని నియంత్రించడం, ఉత్పాదకత పెంచడం తమ సంస్థ లక్ష్యాలని జై షరోఫ్ ముఖ్యమంత్రికి వివరించారు. తైవాన్ సైనిక సహకారంతో డ్రోన్ టెక్నాలజీని అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రంలోని అభివృద్ధి కార్యక్రమాలను యూపీఎల్ సంస్థ ప్రతినిధులకు తెలిపిన ముఖ్యమంత్రి, ఏపీని ఒక పర్యాయం సందర్శించాలని, తమ ఉత్పత్తులకు ప్రయోగశాల చేసుకోవాలని సూచించారు.

ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంతో 35 శాతం ఇంధనం ఆదా

నన్యాంగ్ టెక్నలాజికల్ యూనివర్సిటీ ప్రెసిడెంట్ సుబ్రా సురేష్‌తోనూ ముఖ్యమంత్రి సమావేశం అయ్యారు. సింగపూర్‌లోని తమ వర్సిటీ క్యాంపస్‌ను స్మార్ట్ క్యాంపస్‌గా తీర్చిదిద్దుతున్నామని ముఖ్యమంత్రికి వివరించిన సుబ్రా సురేష్, ఇప్పటికే 60 శాతం ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. వర్సిటీలో అంతర్గత రవాణా యావత్తూ ఎలక్ట్రికల్ వాహనాలేనని, 35 శాతం ఇంధనం ఆదా అవుతోందని సుబ్రా సురేష్ వెల్లడించారు. తమ క్యాంపస్ ప్రపంచంలోనే అత్యుత్తమ ఎకో ఫ్రెండ్లీ క్యాంపస్‌గా అభివర్ణించారు. తమ బెస్ట్ ప్రాక్టీసెస్‌ను పరిశీలించడానికి ఈసారి సింగపూర్ పర్యటనలో ఒకసారి నన్యాంగ్ క్యాంపస్‌ను సందర్శించాలని ముఖ్యమంత్రిని సుబ్రా సురేష్ కోరారు. ఆంధ్రప్రదేశ్ మొత్తాన్ని స్మార్ట్ రాష్ట్రంగా మార్చాలని భావిస్తున్నామని, ఇ-ప్రగతి, రియల్ టైమ్ గవర్నెన్స్ తదితర కార్యక్రమాలను అమలు చేస్తున్నట్టు సుబ్రా సురేశ్‌కు సీఎం చెప్పారు.

బ్లాక్ చైన్ టెక్నాలజీ సంస్థ ఏర్పాటుకు కృషి

బ్లాక్‌చైన్ టెక్నాలజీకి చెందిన 'ఎథేరియం' వ్యవస్థాపకుడు జో లుబిన్ ముఖ్యమంత్రిని కలిశారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఏదైనా విశ్వవిద్యాలయంలో బ్లాక్ చైన్ టెక్నాలజీ సంస్థను ఎథేరియం-రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నెలకొల్పితే బావుంటుందని జో లుబిన్ ప్రతిపాదించారు. భారతదేశంలో ఎక్కడా కూడా బ్లాక్ చైన్ టెక్నాలజీ కోర్సు లేదని, రాష్ట్రంలో ఏదైనా విద్యాలయాన్ని ఎంపిక చేసుకుని మూడు నెలల కోర్సు ప్రారంభించవచ్చని చెప్పారు. ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ వచ్చేవారం న్యూయార్క్‌లో పర్యటించినప్పుడు 'ఎథేరియం' కార్యాలయాన్ని సందర్శిస్తారని ముఖ్యమంత్రి చెప్పారు.

హెచ్‌పీ త్రీడీ ప్రింటింగ్ హెడ్‌తో భేటీ

అలాగే హెచ్‌పీ త్రీడీ ప్రింటింగ్ హెడ్ స్టీఫెన్ నిగ్రోతోనూ ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. సంస్థ ప్రతినిధులు మెటల్ గేర్ వీల్ తయారీ, త్రీడీ ప్రింటింగ్ విధానంపై ముఖ్యమంత్రికి ప్రదర్శన ఇచ్చారు. ఇప్పటికే 'వైజాగ్ మెడ్‌టెక్' జోన్‌లో నూతన తరం త్రీడీ ప్రింటింగ్ పరికరాలు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. హెచ్‌పీ సంస్థ తమ సెంటర్లను ఏపీలో విరివిగా ఏర్పాటు చేసి ప్రజలకు త్రీడీ ప్రింటింగ్ అనుభూతిని తెలియచేయాలని సీఎం సూచించారు. ముఖ్యమంత్రి ఆహ్వానం మేరకు రెండు నెలల్లో తన భారత పర్యటనలో భాగంగా అమరావతి వస్తానని వెల్లడించిన స్టీఫెన్, ఏపీలో త్రీడీ ప్రింటింగ్ సెంటర్ ఏర్పాటు విషయమై హెచ్‌పీ భారత్ సీఈవోతో సంప్రదిస్తానని మాటిచ్చారు. దావోస్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి బృందంలో ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు, ప్రభుత్వ సలహాదారు డాక్టర్ పరకాల ప్రభాకర్, ఐటీ-పంచాయతీరాజ్ శాఖ మంత్రి లోకేష్, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్, ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు సీఈఓ జాస్తి కృష్ణ కిశోర్, పరిశ్రమల శాఖ కార్యదర్శి సాల్మన్ ఆరోకియా రాజ్, వ్యవసాయ సలహాదారు టి.విజయ్ కుమార్ ఉన్నారు.

రాష్ట్రంలో నిరంకుశ పాలన : రఘువీరారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్రంలో నిరంకుశ పాలన కొనసాగుతోందని పీసీసీ చీఫ్ డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి విమర్శించారు. ఈ మేరకు బుధవారం పీసీసీ రాష్ట్ర కార్యాలయం నుంచి ఆయన ప్రకటన విడుదల చేశారు.చలో గొట్టిపాడు సందర్భంగా బాధితులను పరామర్శించడానికి వెళుతున్న కాంగ్రెస్, దళిత, వామపక్ష, ప్రజాసంఘాల నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని రఘువీరా ఖండించారు.గొట్టిపాడు దళితులపై దాడిచేసిన వారిని శిక్షించకుండా, పరామర్శించడానికి వెళుతున్న వామపక్ష, దళిత సంఘాలు, ప్రజాసంఘాల నేతల్ని అరెస్టు చేయడం దారుణమని పేర్కొన్నారు.అరెస్టు చేసిన వారిని బేషరతుగా విడుదల చేయాలని, పెదగొట్టిపాడు దళితులకు రక్షణ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు.

జాతీయ ఓటరు దినోత్సవం నేడు

విశాలాంధ్ర అమరావతి : జాతీయ ఓటరు దినోత్సవంలో భాగంగా గురువారం ఉదయం 11 గంటలకు సచివాలయంలో ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. భారతదేశంలో ప్రజాస్వామ్యం మరింత విజయవంతమవ్వడానికి అర్హులైన దేశ ప్రజలందరూ ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఇందుకోసం కొత్త ఓటర్ల నమోదు ఉధృతం చేపట్టాలన్నారు. ప్రతి ఏటా జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహిస్తున్నారన్నారు. దీనిలో భాగంగా గురువారం ఉదయం 11 గంటలకు సచివాలయంలోని ఒకటో నెంబర్ బ్లాక్ గ్రీవెన్స్ హాల్ లో జాతీయ ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయంలోని అన్ని విభాగాల అధికారులూ, ఉద్యోగులూ విధిగా పాల్గొనాలని సీఎస్ దినేష్ కుమార్ ఆ ప్రకటనలో కోరారు.

లక్షల్లో అప్పులు..ఆస్తులు శూన్యం

బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి విమర్శ

విశాలాంధ్ర అమరావతి : ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని పీఏసీ ఛైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి విమర్శించారు. 2014లో రాష్ట్ర విభజన జరిగినప్పుడు రూ. 97 వేల కోట్ల అప్పులుంటే, ఇప్పుడు రూ. 2.17 లక్షల కోట్లకు చేరాయని, ఇదే పరిస్థితి కొనసాగితే మార్చి 2018 నాటికీ అప్పులు రూ. 2.30 లక్షల కోట్లకు చేరే అవకాశం ఉందని ఆయన విశ్లేషించారు. పట్టిసీమతో ప్రభుత్వం రూ. 400 కోట్లు వృధా చేసిందని ఆ మొత్తంతో రెండు కొత్త అసెంబ్లీ భవనాలను నిర్మించవచ్చని ఆయన అన్నారు. బుధవారం అయన వైసీపీ సీఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఇన్ని అప్పులు చేసి తెచ్చిన డబ్బున్నంత ఏం చేశారనేది అర్థం కావటం లేదన్నారు. ఒక్క శాశ్వత ఆస్థి కూడా లేదని, సచివాలయం, పట్టిసీమ తాత్కాలిక ఆస్తులతోనే సరిపెట్టారన్నారు. లక్షల కోట్ల రుణాలని రోజువారీ ఖర్చులకే వాడేస్తున్నా రన్నారు. హెూటల్, రవాణా ,విమాన చార్జీలకే అధిక మొత్తం జీతాలకే అయి పోతున్నాయన్నారు. దయా ఫ్రావాల్ సంప్రాదాయ పద్దతిలో కట్టిఉంటే రూ. 100 కోట్లు తగ్గి ఉండేవన్నారు. పట్టిసీమ కరెంట్‌కు ఏడాదికి రూ.100 కోట్ల ఖర్చు చేస్తున్నారన్నారు. అధికారు లను వాస్తవ రికార్డులను తీసుకోరమన్నామని, పరిశీలించి ప్రభుత్వానికి అందిస్తామన్నారు.

జ్ఞాన కేంద్రాలుగా యూనివర్సిటీలు

నాలెడ్జ్‌హబ్‌గా ఏపీ : విద్యకు అధిక ప్రాధాన్యత

గవర్నర్ నరసింహన్



విశాలాంధ్ర-విశాఖసిటీ : విశ్వవిద్యాలయాలు జ్ఞాన కేంద్రాలుగా నిలవాలని రాష్ట్ర గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ ఆకాంక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాల వైస్‌ఛాన్సలర్లతో ఛాన్సలర్ హోదాలో ఆయన బుధవారం విశాఖ ఏయూలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూనివర్సిటీలు దేవాలయా లుగా ఉండాలని హితవు పలికారు. విద్యార్థులకు విద్య నందించడంతో పాటు వారిని మంచి పౌరులుగా తీర్చి దిద్దాలని చెప్పారు. విద్యతో పాటు నైపుణ్యాలు అభివృద్ది చేసేలా వారికి ప్రత్యేక శిక్షణ అందించాలని చెప్పారు. ఇకపై తాను విశ్వవిద్యాలయాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిం చనున్నట్టు తెలిపారు. విద్యార్థుల్లో మంచి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు నిరంతరం కృషి చేయాలన్నారు. విద్యార్థులు సక్సెస్ అయినప్పుడే గురువులు విజయం సాధించినట్లవుతుందన్నారు. ఈ సందర్భంగా అన్ని విశ్వవిద్యాలయాల వీసీలు తమ యూనివర్సిటీల ప్రగతి, విద్య, పరిశోధన, ర్యాంకింగ్, వసతులు, ప్రాజెక్టులు, బోధనా పద్ధతులు తదితర యూనివర్సిటీకు సంబంధించిన పూర్తి వివరాలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. వీటిపై గవర్నర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు, రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య ఎస్.విజయరాజు, రాష్ట్ర ఉన్నత విద్యా స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆదిత్యానాథ్ దాస్, ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్లు ఆచార్య వి.వల్లీకుమారి, పి.నరసింహ రావు, కార్యదర్శి ఎస్.వరదరాజన్, వివిధ విశ్వవిద్యాలయాల వీసీలు, తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనలు సమాజ ఉపయుక్తంగా ఉండాలి

మీడియా సమావేశంలో నరసింహన్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నాలెడ్జ్ హబ్‌గా రూపొందనుందని చెప్పారు. రాష్ట్రంలో విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తు న్నట్లు చెప్పారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కూడా ఎక్కువగా విద్యకు కేటాయిస్తుందన్నారు. చదువుతో పాటు సామాజిక సేవాకార్యక్రమాల్లో విద్యార్థులను భాగస్వాములను చేయాలన్నారు. పరిశోధనలు సమాజానికి ఎంత బాగా ఉపయోగపడాలో ఆలోచించాలన్నారు. నూతన ఆలోచనలు వారిలో వస్తున్నాయని, ఆయా ఆలోచనలు అమలుపరిచి నూతన శకానికి, ఆవిష్కరణకు, అభివృద్ధికి వాటిని వినియో గించాలన్నారు. విశ్వవిద్యాలయాల్లో బయోమెట్రిక్ డిజిట లైజేషన్ ఖచ్చితంగా అమలుపరచా లన్నారు. రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యకు అధికశాతం బడ్జెట్ కేటాయి స్తున్నట్లు చెప్పారు. విశ్వవిద్యాలయాల బలోపేతంపై గవర్నర్ ఇచ్చిన సూచనలు కచ్చితంగా అమలుపరుస్తామన్నారు.

టెట్‌పై అస్పష్టత

- వెబ్‌సైట్‌లో అందుబాటులో లేని హాల్‌టిక్కెట్లు
- మంత్రి గంటా వైఖరిపై అభ్యర్థుల ఆగ్రహం
- పేపర్-3కి గడువు పెంచాలని భాషా పండితుల వినతులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:ఏపీ టెట్(ఉపాధ్యాయ అర్హత పరీక్ష) హాల్ టిక్కెట్లను బుధవారం నుంచి వెబ్‌సైట్‌లో అందుబాటులో లేవు.టెట్ రివైజ్డు నోటిఫికేషన్‌లో భాగంగా ఈ నెల 24 నుంచి దరఖాస్తు చేసిన అభ్యర్థుల హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడు చేసుకునే సదుపాయం కల్పిస్తామని అధికారులు జీవోలో పొందుపరిచారు. రాత్రి 9 గంటల వరకూ కమిషనర్ ఆఫ్ స్కూలు ఎడ్యుకేషన్ వెబ్‌సైట్‌లో టెట్ హాల్‌టిక్కెట్ల కోసం అభ్యర్థులు వీక్షించి నిరుత్సాహానికి గురయ్యారు.అటు ఏపీ టెట్‌ను వాయిదా వేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా అభ్యర్థులు నిరసనకు దిగుతున్నారు.ఇటీవల కాకినాడలో మానవ వనరులశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు కారుకు అభ్యర్థులు అడ్డంపడి నిరసన వ్యక్తం చేసిన విషయం విదితమే.దీంతో టెట్‌ను వాయిదా వేయాలా?, కొనసాగించాలా? అనే అంశంపై బుధవారం కీలక నిర్ణయం తీసుకుంటామని మంత్రి వారికి హామీ ఇచ్చారు.దీంతో మరోమారు వాయిదా పడుతుందని వారు ఆశించారు.అటు రాత్రి వరకూ టెట్‌పై మంత్రి ఎలాంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం.విశాఖలో నిర్వహించిన వీసీల సదస్సుకు మంత్రి హాజరయ్యారు. దీంతో గురువారం టెట్‌పై ఒక కీలక నిర్ణయం వెలువడుతుందని అభ్యర్థులు ఆశిస్తున్నారు.భాషా పండితుల కోసం ప్రత్యేక సిలబస్‌తో కొత్తగా ప్రవేశపెట్టిన టెట్ పేపర్-3కు గడువు కావాలని అభ్యర్థులు కోరుతున్నారు.ఫిబ్రవరి 5 నుంచి 15వరకూ ఆన్‌లైన్లో టెట్ పరీక్షల షెడ్యూలును పేపర్-1, పేపర్-2 అభ్యర్థులకు యథాతథంగా నిర్వహించే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలిసింది. పేపర్-3కి గడువు పెంచాలని కోరుతూ కృష్ణాజిల్లా అవనిగడ్డ, తూర్పుగోదావరి జిల్లా కాకినాడ తదితర ప్రాంతాల్లో పెద్దఎత్తున భాషా పండితులు ఆందోళనకు దిగిన విషయం విదితమే. అభ్యర్థుల వినతుల మేరకు పేపర్-3కు కొన్ని రోజులు గడువు పొడిస్తారా? యథాతథంగా నిర్వహిస్తారా? అనేదీ ప్రశ్నార్థకంగా మారింది.

అదనపు డీజీపీలుగా అమిత్ గార్గ్, మహేష్ దీక్షిత్

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : రాష్ట్రంలో 1993 ఐపీఎస్ బ్యాచ్‌కి చెందిన ఇద్దరు ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు (ఐజీపీ)లకు అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు (ఏడీజీపీ)లుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీఐడీ ఐజీగా పని చేస్తున్న అమిత్ గార్గ్, ఎన్‌ఐబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మహేష్ దీక్షిత్‌కు అదనపు డీజీపీగా పదోన్నతి పొందారు. వీరిద్దరికి సూపర్ టైమ్ స్కేల్‌ను వర్తింప చేస్తూ లెవల్ 15 ప్రకారం పే మ్యాట్రిక్స్‌ను ప్రభుత్వం ఫిక్స్ చేసింది.



గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం

గట్టి పోలీసు బందోబస్తు - ఏర్పాట్లపై డీజీపీ మాలకొండయ్య ఆరా



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రస్థాయి గణతంత్ర దినోత్సవానికి విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం(ఐజీఎంసీ) సర్వం సిద్ధమైంది. ఈ నెల 26న కట్టుదిట్టమైన భద్రతా నడుమ ఇక్కడ ఉత్సవాలను నిర్వహించనున్నారు. రాష్ట్ర గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, సీఎం చంద్రబాబు, మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు వేడుకలకు తరలిరానుండటంతో పోలీసులు భారీ భద్రతా చర్యలు చేపట్టారు. రాష్ట్ర డీజీపీ మాలకొండయ్య, ఉన్నతాధికారులు కలిసి బుధవారం ఇందిరాగాంధీ స్టేడియానికి విచ్చేసి ఏర్పాట్లపై ఆరా తీశారు. 68వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఇందిరాగాంధీ స్టేడియంలో గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారు. అనంతరం వివిధ విభాగాలు అందజేసే గౌరవ వందనాన్ని ఆయన స్వీకరిస్తారు. ఇందిరాగాంధీ స్టేడియం లోపల, బయట గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. విజయవాడ నగరంలోని ప్రధాన కూడళ్లలోనూ పోలీసు నిఘాను పెంచారు. డీజీపీ ఆధ్వర్యాన విజయవాడ సీపీ గౌతమ్ సవాంగ్, జాయింట్ సీపీ రమణకుమార్, డీసీపీ కాంతిరాణా, జీడీఐజీ విజయ్‌కుమార్, బత్తుల శ్రీరామమూర్తి, సీఎం సెక్యూరిటీ అధికారి జోషి, ఆర్ అండ్ బి శేషుకుమార్ తదితర అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఉదయం 11.30 గంటలకు గణతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా పేరెడ్‌లో పాల్గొనే బృందాల్ని సిద్ధంగా ఉంచుతారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకుగాను పాస్‌లు జారీచేశారు. నిర్దేశించిన మార్గాల ద్వారా పాస్‌లు ఉన్న వారినే లోపలి కి అను మతిస్తారు. ఉత్సవాల పేరెడ్ కమాండెంట్ కే.ఆరీఫ్ హఫీజ్, కమాండెంట్-2గా అజయ్‌కుమార్‌లు వ్యవహరిస్తారు. ఈ ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల శకటాలను ప్రదర్శిస్తారు.

ఆరుతడి పంటలను రక్షించాలి

కేఆర్ఎంబీకి రాష్ట్ర సాగునీటి సంఘాల విజ్ఞప్తి

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: నాగార్జునసాగర్ ఎడమ కాలువ నుంచి కృష్ణాజిల్లాలోని 3వ జోన్‌కు సాగర్ జలాలను తక్షణమే విడుదల చేసి ఆరుతడి పంటలను రక్షించాలని రాష్ట్ర సాగునీటి సంఘాల నాయకులు విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని కృష్ణానదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) కార్యాలయంలో బుధవారం సభ్య కార్యదర్శి ఎ పరమేశంను రాష్ట్ర ఎపెక్స్ కమిటీ సభ్యుడు ఆళ్ల వెంకట గోపాల కృష్ణారావు, ఎడమ కాలువ కమిటీ ఛైర్మన్ వై పుల్లయ్యచౌదరి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ నాదెళ్ల చెన్నకేశవరావు కలిసి వినతి పత్రాన్ని అందచేశారు. సాగర్ ఎడమ కాలువ ఆయకట్టు కింద కృష్ణాజిల్లాలోని తిరువూరు, మైలవరం, నూజివీడు, గన్నవరం, నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో 3.60 లక్షల ఎకరాలుందని, దీనిలో మిర్చి, పొగాకు, మొక్కజొన్న, పత్తి, మామిడి, మినుము, పసుపు వంటి ఆరుతడి పంటలను రైతులు సాగు చేసినట్లు తెలిపారు. ఏపీ ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు నవంబరులో 4 టీఎంసీలు, డిసెంబరులో 4 టీఎంసీల నీటిని సాగర్‌నుంచి ఎడమ కాల్వకు కేటాయించారన్నారు. నవంబరులో మొదటి విడతగా 2,3 జోన్లకు 3.780 టీఎంసీలను తెలంగాణ విడుదల చేసిందని, మూడో జోన్‌కు సాగునీటిని విడుదల చేసి ఇప్పటికీ 50 రోజులు గడచిపోయాయన్నారు. డిసెంబరు, జనవరి నెలల్లో రెండో విడతగా 2వ జోన్‌కు 1.35 టీఎంసీలు మాత్రమే ఇచ్చి ఏకపక్షంగా జనవరి 26న సాగర్ డ్యామ్ వద్ద హెడ్ రెగ్యులేటర్‌ను మూసివేస్తున్నట్లు తెలంగాణ అధికారులు చెబుతున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. దీనిపై పరమేశం స్పందించి ఏపీలో ఆరుతడి పంటలను కాపాడేందుకు తెలంగాణ ప్రభుత్వానికి తగిన ఉత్తర్వులు ఇస్తామని సాగునీటి సంఘాల నేతలకు హామీ ఇచ్చారు. అనంతరం నేతలు జలసౌధ కార్యాలయంలోని తెలంగాణ ప్రభుత్వ నీటిపారుదలశాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ సి మురళీధర్‌ను కలసి ఎడమ కాల్వ, మూడవ జోన్‌లో ఉన్న నీటి ఎద్దడిని వివరించారు. దీనిపై ఆయన స్పందిస్తూ, సాగర్ చీఫ్ ఇంజనీర్ ఎం సునీల్‌తో మాట్లాడి కేఆర్ఎంబీ ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం ఏపీలోని 3వ జోన్ ఆయకట్టుకు సాగర్ నీటిని విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

అగ్రిగోల్డ్ బాధితులకు బడ్జెట్‌లో

రూ.4 వేల కోట్లు కేటాయించాలి

- 10 నెలలుగా ప్రభుత్వం కాలయాపన
- మరో పోరాటానికి కార్యాచరణ సిద్ధం
- ఫిబ్రవరి 1 నుంచి కార్యక్రమాలు
- ముప్పాళ్ల, తిరుపతిరావు, విశ్వనాథరెడ్డి వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకునేందుకు బడ్జెట్‌లో రూ.4 వేల కోట్లను కేటాయించాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు, అధ్యక్షుడు బి.విశ్వనాథరెడ్డి, ప్రధాన కార్యదర్శి వి.తిరుపతిరావు డిమాండు చేశారు.

దాసరి భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ వ్యవహారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీలో బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చి పది నెలలు గడచినా అమలుకు నోచుకోలేదన్నారు. అసోసియేషన్ ఆధ్వ ర్యంలో జరిగిన ఆందోళనలు, ఉద్యమాల ఫలితంగా బాధితుల్లో ఆత్మహత్యలు, అసహజ మరణాలకు గురైనవారికి పరిహారంగా రూ.5 లక్షలు చెల్లిస్తామని ప్రభుత్వం జీఓ నెంబరు 80ను గత ఏడాది మే 12న జారీ చేసిందన్నారు. అయితే మరణించిన వారి పేర్ల జాబితాల్లో అభ్యంతరాలు, అడ్డంకులున్నాయనే సాకుతో అధికారులు పరిహారం చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారని తెలిపారు. ఈ విషయమై అసోసియేషన్ నిరంతరం ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతూనే ఉందన్నారు. ఇటీవల కలెక్టర్ల సమావేశంలో జీవోను సవరిం చాలని సీఎం ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు. బాధితుల డిపాజిట్లను 120 రోజుల్లో చెల్లిస్తా మన్న హామీ కూడా అమలుకు నోచుకోలేదన్నారు. గత ఏడాది నిర్వహించిన బస్సు యాత్ర ఫలితంగా ప్రభుత్వం స్పందించి 1.14 లక్షల బాండ్ల పరిశీలన జరిపి మూడు నెలలు కావస్తున్నా రీపేమెంట్లు చేయకపోవడం దారుణమన్నారు. కేసును సీఐడీకి అప్పగించి మూడేళ్లు కావస్తున్నప్పటికీ పురోగతి లేకపోవడంతో బాధితులు ఆత్మవిశ్వాసాన్ని కోల్పో యే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈ నేపథ్యంలో సమావేశంలో కార్యాచరణ రూపొందించినట్లు ముప్పాళ్ల వివరించారు. ఫిబ్రవరి 1 నుంచి 10 వరకూ ఆయా గ్రామాల్లోని కస్టమర్లు, ఏజెంట్లను కలసి కార్యోన్ముఖులు చేయడానికి అసోసియేషన్ గడపగడపకు వెళ్లి వారిలో ధైర్యం నింపాలని నిర్ణయించినట్లు చెప్పారు. అలాగే ఫిబ్రవరి 11 నుంచి 15 వరకూ అన్ని జిల్లాల్లో విస్తృత సమావేశాలు, 15, 16 తేదీల్లో మండల స్థాయిలో జీపు యాత్రలు నిర్వహిస్తామన్నారు. చివరగా 19వ తేదీ నుంచి 21 వరకూ మూడ్రోజులపాటు మండల కేంద్రాల్లో బాధిత కుటుంబీకులతో రిలే నిరాహార దీక్షలు చేపడతామన్నారు. అప్పటికీ స్పందించకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ముప్పాళ్ల ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ సంస్థ మోసానికి 200 మందికిపైగా ఆత్మహత్యలు, అసహజ మరణాలకు గురైనట్లు తెలిపారు. సంస్థకు వేల కోట్ల విలువైన ఆస్తులున్నందున ముందుగా ఆయా మొత్తాలను ప్రభుత్వం చెల్లించి, తర్వాత ఆస్తులను వేలం వేయా లని సూచించారు. అసోసియేషన్ అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ బాధితులకు చెల్లించాల్సిన మొత్తాలు, జీవో సవరణల పేరుతో మరింత జాప్యం చేసేందుకు ప్రభుత్వం యత్నిస్తోందని ఆరోపించారు. సీఎం హామీని నిలబెట్టుకోవాలన్నారు.

వామపక్ష నేతల అరెస్టులకు ఖండన

చలో గొట్టిపాడుకు వెళుతున్న వామపక్ష, దళిత సంఘాల నాయకుల అరెస్టుల పట్ల ముప్పాళ్ల నాగేశ్వరరావు, విశ్వనాథరెడ్డి, తిరుపతిరావు ఖండించారు. గొట్టిపాడు దళితులపై అనేక రోజులుగా కొనసాగుతున్న సాంఘిక బహిష్కరణ ఎత్తివేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలన్నారు. దళితులపై దాడులు చేసిన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని వారు డిమాండు చేశారు.

నెలాఖరులోగా పరిహారం చెల్లించాలి

అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : అగ్రిగోల్డ్ బాధితుల్లో ఆత్మహత్యలు, అసహజ మరణాలకు గురైన కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన రూ.5 లక్షల పరిహారాన్ని ఈనెలాఖరులోగా చెల్లించాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండు చేసింది. దాసరి భవన్‌లో రెండ్రోజులపాటు జరిగిన సమితి రాష్ట్రస్థాయి విస్తృత సమావేశాలు బుధవారంతో ముగిశాయి. ఈ సమావేశాలకు 13 జిల్లాల నుండి 150 మందికి పైగా సమితి సభ్యులు హాజరయ్యారు. భవిష్యత్ కార్యాచరణకు సంబంధించి అన్ని బ్రాంచీలకు చెందిన 30 మంది చర్చల్లో పాల్గొని, భవిష్యత్ కార్యక్రమాన్ని రూపొందించారు. బాధితుల డిపాజిట్లు చెల్లించడానికి ప్రత్యేక స్కీముతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకొస్తే కోర్టులకు అభ్యంతరం ఉండదని పేర్కొంటూ, కోర్టు పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేయడాన్ని వివిధ జిల్లాల ప్రతినిధులు తీవ్రంగా వ్యతిరేకించారు. మరణించిన బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా రూ.5 లక్షలు అందించే నిమిత్తం జీవో సవరణకై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించడాన్ని సమావేశం అభినందించింది. అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆమరణ దీక్షలు, రాష్ట్ర వ్యాప్త బస్సు యాత్రలు, పలు జిల్లాలలో ఆందోళనలు చేపట్టిన నేపథ్యంలో ప్రభుత్వం బాధితులకు న్యాయం చేస్తామని చెప్పి 10 నెలలు గడచిపోవడం పట్ల విచారం వ్యక్తం చేసింది. సమావేశంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ బాధితుల్లో ఆత్మ విశ్వాసం సడలకుండా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. హైకోర్టు ధర్మాసనంలో పదే పదే వాయిదాలు పడుతూ ఉండటం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, హైకోర్టు రెండూ బాధితులపక్షాన ఉన్నట్లు కనిపించినా పరిష్కారం లభించక మూడు సంవత్సరాలు దాటిందన్నారు. ప్రజాస్వామ్యం, న్యాయవ్యవస్థ పట్ల నమ్మకం సడలడానికి ఇలాంటి కాలయాపన తోడ్పడుతుందని ముప్పాళ్ల ఆవేదన వ్యక్తం చేశారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు, అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ ఆత్మహత్యలు పునరావృతం కాకుండా తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకునేందుకు బడ్జెట్‌లో రూ.4 వేల కోట్లు కేటాయించాలన్నారు. లేనిపక్షంలో ప్రభుత్వంపై మరో పోరాటానికి అసోసియేషన్ సిద్ధమవుతోందన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి బి.వి.చంద్రశేఖరరావు, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఇ.వి.నాయుడు, కోశాధికారి జి.శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

13 వేల కోట్ల మద్యం కుంభకోణం

- ఎనిమిదేళ్లుగా మూలుగుతున్న కేసు
- 48 కేసులు నమోదు చేసిన సిట్

హైదరాబాద్ : అసలే ఆరోగ్యాన్ని, ప్రాణాలను హరించే మహమ్మారి మద్యం, పాలకులు ఆదాయం పెంచుకునేందుకు మద్యాన్ని ఏరులై పారిస్తున్నారు. మద్యం విక్రయాలకు సంబంధించిన వ్యాపారులు, కాంట్రాక్టర్లు సిండికేట్ అయి రూ.13 వేల కోట్ల కుంభకోణానికి పాల్పడినట్టు 2010లో బయటపడింది. దాదాపు ఎనిమిదేళ్లు గడిచినప్పటికీ ఈ కేసు ఏమైందో తెలియదు. ఇందులో అనేకమంది బ్యూరోక్రాట్లు భాగస్వాములని ఆనాడు వెల్లడైంది. 2012లో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కేసు నమోదు చేసింది. వేల కోట్ల కుంభకోణం కేసును దర్యాప్తు చేసి, నేరస్తులను విచారించి శిక్షలు పడేలాగా చూడవలసిన సిట్ గానీ, న్యాయవిభాగంగానీ తదుపరి చర్యలు తీసుకోలేదు. ఎందువల్ల ఈ కేసు ఇంతకాలం ముందుకు నడవలేదు. బహుశా ఇలాంటి కేసు ఒకటి ఉందని సంబంధిత వర్గాలు కూడా మరిచిపోయాయా? ఈ కేసులో భాగస్వామ్యం ఉన్న 11 వందల మందికి పైగా అధికారులు, అనధికారుల పైన కేసులు నమోదు చేశారు. అవినీతి నిరోధక బ్యూరో (ఏసీబీ) డైరక్టరు జనరల్ నాయకత్వంలో సిట్ ఏర్పడింది. కేసును దర్యాప్తు చేసి, దోషులను నిర్ధారించవలసిన బాధ్యత సిట్‌ది. దర్యాప్తు చేసిన 11 వందల మందికి పైగా అధికారులు, అనధికారులను అరెస్టు చేయవలసిందిగా సిఫారసు చేసింది. అయితే రెవెన్యూ శాఖ పలుమార్లు మోకాలడ్డడంతో ఏసీబీ ఏమీ చేయలేకపోయిందని తెలుస్తోంది. చివరకు 20 మంది అరెస్టుకు ఏసీబీకి అనుమతించారు. తక్కిన కేసులను వివిధ ఏజెన్సీలకు అప్పగించగా అవి నేటికీ వెలుగు చూడలేదు. వీటిలో 16 కేసులను విచారణ కమిషనర్ విభాగానికి, 20 కేసులు క్రమశిక్షణా చర్యలు తీసుకునే ట్రిబ్యునల్‌కి, 9 కేసులు విచారణ శాఖకు అప్పగించారు. ఈ కేసులన్నీ ఇప్పటికే ఆయా శాఖల, ఏజెన్సీ పరిధిలో మూలుగుతున్నాయి. 16 కేసులు విచారణ కమిషనర్‌కు అప్పగించామని రెవెన్యూశాఖ చెబుతోంది. ఇందులో ఒక కేసే తమ వద్దకు వచ్చిందని విచారణ కమిషన్ ఆఫీసు ఆర్టీఐ పిటిషన్‌కు సమాధానంగా తెలిపింది. తక్కినవి ఏమయ్యాయో తెలియదు. 20 కేసులు ట్రిబ్యునల్‌కు పంపగా 2014 నుంచి ఆ ట్రిబ్యునల్ అధికారులు లేక ఖాళీగా ఉందని తెలుస్తోంది. వేల కోట్ల కుంభకోణాలు, మోసాల కేసులు ఏళ్ల తరబడి మూలుగుతున్నా సీరియస్‌గా తీసుకొని దోషులకు శిక్షలు వేయించాలన్న లక్ష్యం కొరవడడం నేటి వైచిత్రి.

సమస్యల పరిష్కారానికే...

- పొదుపు మహిళలకు రుణమాఫీ
- ఆరోగ్యశ్రీలో పెనుమార్పులు తీసుకువస్తా..
- ప్రజాసంకల్ప యాత్రలో వైఎస్ జగన్ భరోసా



విశాలాంధ్ర- పెళ్లకూరు, నాయుడుపేట : ప్రజల సమ స్యల పరిష్కారానికే తాను ఈ ప్రజా సంకల్పయాత్ర కొనసాగిస్తున్నానని వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. పెళ్లకూరు మండలంలో రెండవ రోజు జరిగిన ప్రజా సంకల్పయాత్రలో తాము అధికారంలోకి రాగానే పొదుపు మహిళలకు రుణమాఫీ, వడ్డీ లేని రుణాలు ఇస్తామని హామీ ఇచ్చారు. పెళ్లకూరు మండలంలోని సీఎన్ పేట గ్రామం నుంచి ఉదయం 8.45 గంటలకు ప్రజా సంకల్పయాత్ర ప్రారంభమైంది. శిరసనంబేడు గ్రామం వద్ద స్థానిక ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎంపీ వరప్రసాద్‌తోపాటు జగన్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. రెండవ రోజు ప్రజా సంకల్ప యాత్ర శిరసనంబేడు గ్రామం మీదుగా దిగువ చావాలి చెక్‌పోస్టు నుంచి పెన్నేపల్లి గ్రామం వరకు మధ్యాహ్నం విరామ సమయం వరకు సాగింది. అనంతరం ఆయన పాదయాత్ర మండల పరిధిలోని గోమతి సర్కిల్ వరకు , ఆ తర్వాత నాయుడుపేట మండలంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రను కొనసాగించారు. పెళ్లకూరు మండలంలో పాదయాత్రను విజయవంతం చేసిన స్థానిక నాయకులకు ఆ పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు కృతజ్ఞతలు తెలిపారు. వీరి వెంట నెల్లూరు నగర ఎమ్మెల్యే పి. అనీల్‌కుమార్‌యాదవ్, ఆత్మకూరు మేకపాటి గౌతంరెడ్డి, ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే శాసనసభ్యులు కాకాని గోవర్ధన్‌రెడ్డి తదితర నాయకులు ఉన్నారు.

పెళ్లకూరు మండలం పెన్నేపల్లి సమీపంలో మధ్యాహ్నం భోజనం విరామం తరువాత ప్రజా సంకల్పయాత్ర నాయుడుపేట టౌన్ పరిధిలోని గోమతి సెంటర్ వద్దకు చేరుకుంది. అనంతరం ప్రజా సంకల్పయాత్ర బీడీ కాలనీలు, లోతువానిగుంట, కరెంటు ఆఫీసు సెంటర్, పిచ్చిరెడ్డితోపు, గాంధీమందిరం, పాతశివాలయం వీధి, పోలీస్‌స్టేషన్, వెల్‌కం సెంటర్, దర్గా వీధుల మీదుగా పాతబస్టాండు సర్కిల్ వద్దకు చేరుకుంది.జగన్ పాతబస్టాండు సర్కిల్‌లో జగన్ మాట్లాడుతూ, చంద్రబాబునాయుడు నాలుగు సంవత్సరాల పరిధిలో పేదలకు ఒక్క ఇళ్లు అయినా కట్టించి ఇచ్చారా అని ప్రశ్నించారు. ఈ నాలుగు సంవత్సరాలలో నిర్మించిన పక్కాగృహాల లెక్క తేల్చాల న్నారు. ఈ ప్రాంతంలో గల శ్రీసిటీ, మేనకూరు ఎస్ఈ జడ్‌లలో పక్క రాష్ట్రంలోని వ్యక్తులకే ఉద్యోగ అవకాశాలు దక్కు తున్నాయని ఆయన అన్నారు. తమ ప్రభుత్వం వస్తే స్థానికులకే పరిశ్రమల్లో తొలి అవకాశం కల్పిసా మన్నారు. తాను ముఖ్యమంత్రి అయితే హైదరాబాద్‌తో పాటు చెన్నై నగరంలో ఆపరేషన్ చేయించుకున్న వారికి తాను ఆరోగ్యశ్రీ వర్తించేలా చేస్తానని హామీ ఇచ్చారు. కుటుంబ యజమాని గాయపడి ఐదారు నెలలు విశ్రాంతి తీసుకోవాల్సి వచ్చినా ఆ కుంటుంబాన్ని తాను ఆదుకుంటా నని భరోసా ఇచ్చారు. అంతేకాకుండా డయాలసీస్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల బారినపడితే ఆ కుటుంబానికి రూ. 10వేలు పెన్షన్ ఇస్తానని ప్రజల హర్షధ్వానాల మధ్య వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జగన్ సమక్షంలో సమైక్యాంధ్ర జేఏసీ నాయకుడు చెంగయ్య వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు.అనంతరం రైల్వేస్టేషన్ ఎల్ఐసీ బిల్డింగ్ ఎన్ఎస్ఆర్ కాలనీ మీదుగా స్థానిక జడ్పీ బాయిస్ హైస్కూల్ ఆవరణంలోకి చేరుకుంది. అక్కడ రాత్రి బస చేసి అనంతరం నేడు ప్రజా సంకల్పయాత్ర మండల పరిధిలోని తుమ్మూరు మీదుగా ఓజిలి మండలంకు చేరుకోనుంది. సభ విజయవంతం అవడానికి సహకరించిన కిలివేటి సంజీవ య్యను నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎంపీ వరప్రసాద్, నెల్లూర ఎంపీ రాజమోహ న్‌రెడ్డి, స్థానిక శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య, నెల్లూరు పట్టణ శాసనసభ్యులు అనీల్‌కుమార్‌యాదవ్, ఆత్మకూరు శాసనసభ్యులు గౌతం కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

సంపాదకీయం

పెరుగుతున్న ఆర్థిక అంతరాలు

భారత ప్రధాని నరేంద్ర మోడీ దావోస్ వేదిక ద్వారా మన దేశం అభివృద్ధి బాటన పరుగులు తీస్తున్నదనీ, రెండు దశాబ్దాల వ్యవధిలో జీడీపీ ఆరు రెట్లు పెరిగిందనీ, అందుకు మానవశక్తి ఎంతగా దోహదపడిందో వివరిస్తున్న తరుణంలోనే, ఆక్స్‌ఫామ్ ఇండియా నివేదిక దేశంలోని కోట్లాదిమంది జనం ఎంతటి దుర్భర దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారో ఎత్తిచూపింది. ఇది ఆర్థిక అసమానతకు, ఒక అమానవీయ పరిస్థితికి అద్దం పడుతోంది. వాస్తవాలను మరుగువర్చి గొప్పలు చెప్పుకోవడం వల్ల ఉన్న పరువు పోతుందే తప్ప ఒరిగేదేమీ ఉండదు. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ప్రపంచార్థిక వేదిక (వరల్డ్ ఎకనమిక్ ఫోరం) సదస్సు ఆరంభానికి కాస్త ముందు అంతర్జాతీయ హక్కుల సంస్థ 'ఆక్స్‌ఫామ్' ప్రపంచంలోని ఆర్థిక అసమానతలను గుర్తుచేస్తూ నివేదిక విడుదల చేస్తుంటుంది. నయా ఉదారవాద ఆర్థిక విధానాల వల్ల గడచిన ఏడాదిలో సామాజిక అంతరాలు ఎంత భయానకంగా పెరిగిపోయిందీ ఆ నివేదిక వెల్లడించింది. ప్రపంచ జనాభాలో సగం దాకా ఉన్న అంటే 370 కోట్ల మంది జీవితాలు ఎదుగూ బొదుగూ లేకుండా ఉంటే, రెండు రోజులకో బిలియనీర్ పుట్టుకొస్తున్నాడని పేర్కొన్నది. ప్రపంచంలోని 82శాతం సంపద ఒక శాతం చేతుల్లోనే పోగవుతున్నదని స్పష్టంచేసింది. ఈ సంపద కేంద్రీకరణ 2010 నుంచి వేగంగా పెరుగుతున్నదని, కోటీశ్వరుల సంపదలో 13 శాతం పెరుగుదల ఉండగా, కార్మికుని నెల జీతంలో మాత్రం రెండు శాతం మాత్రమే పెరుగుదల ఉన్నదని ఆక్స్‌ఫామ్ వాపోయింది. భారత్ పరిస్థితి దీనికి భిన్నంగా ఏమీ లేదని ఆక్స్‌ఫామ్ సర్వే వివరించింది. దేశంలోనూ 73 శాతం సంపద 17 శాతం మంది వద్దనే పోగై ఉన్నది. కాగా అరవై కోట్ల మంది సంపద ఒక శాతం మాత్రమే పెరుగగా, 2017 ఏడాది కాలంలోనే దేశంలో కొత్తగా పదిహేడు మంది బిలియనీర్లు పుట్టుకొచ్చారు. ఈ ఏడాది కాలంలోనే భారతీయ కోటీశ్వరుల సంపద ఐదులక్షల కోట్లు హెచ్చి, 20.9 లక్షల కోట్లు అయింది. అదే కార్మికుల జీతాల్లో మాత్రం నామమాత్రం పెరుగుదల కూడా లేదు. దీనంతటికీ ప్రధాన కారణం నయా ఉదారవాద విధానాలేనని ఆక్స్‌ఫామ్ నివేదిక కుండబద్దలు కొట్టింది. సమ్మిళిత అభివృద్ధిలోనూ మన దేశం.. పాకిస్థాన్, నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక కన్నా వెనుకబడి ఉండటం గమనార్హం. మన దేశంలో ఆర్థిక అంతరాలు రెండు దశాబ్దాల కాలంలోనే రెట్టింపయిన విషయం ఎన్నడో తేలిపోయింది. ఈ సర్వే ద్వారా ఈ వ్యత్యాసాల ప్రక్రియ మరింత వేగంగా, బలంగా సాగుతున్నదని రూఢీ అవుతోంది. కుబేరుల సంఖ్య పెరగడం ఆర్థిక వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనం. మరో రెండునెలల్లో భారతీయ బ్యాంకుల్లో నిరర్థక ఆస్తులు పదిలక్షల కోట్లకు చేరుకోబోతున్నాయంటూ వచ్చిన వార్త కూడా ఈ దేశంలో కుబేరుల సంఖ్య పెరగడం వెనుక ఉన్న కారణాలను పట్టిస్తున్నది. శతకోటీశ్వరుల వద్ద పోగుపడుతున్న సంపదంతా వారసత్వం, గుత్తాధిపత్యం, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం ద్వారా సహజవనరులను కొల్లగొట్టడం, ప్రైవేటీకరణ ఒప్పందాల్లో రాజ్యమేలుతున్న అవినీతి, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పేరుతో దోపిడీ వంటి అక్రమ మార్గాల ద్వారా చేకూరినదేనని తేలిపోతున్నది.

ప్రపంచ దేశాలన్నీ....సామాజిక అంతరాలకు కారణమవుతున్న విధానాల్లో మార్పులు చేయాల్సిన ఆవశ్యకతను ఈ నివేదిక నొక్కి చెప్పింది. కుబేరులకు మేలు చేసే విధంగా రూపొందిస్తున్న విధానాలను తీవ్రంగా విమర్శించింది. కొద్దిమంది సంపన్నులకు గాక, ప్రజలందరికీ ప్రయోజనం చేకూర్చే విధంగా ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దాలనీ, కార్మికశక్తికి ప్రాధాన్యం ఇచ్చే రంగాలను ప్రోత్సహించాలనీ, వ్యవసాయంలో పెట్టుబడులు పెంచాలని ఈ నివేదిక అనేక సూచనలు, సలహాలు ఇచ్చింది. యథేచ్ఛగా సాగుతున్న పన్ను ఎగవేతదారులను నిలువరించాలనీ, కార్పొరేట్లకు ఇస్తున్న భారీ రాయితీలను తగ్గించాలనీ స్పష్టంచేసింది. రాజకీయ నాయకులకూ, వాణిజ్యవేత్తలకూ మధ్య అపవిత్ర పొత్తులను ఎత్తిచూపింది. కాబట్టి సహజంగానే ఈ నివేదికను ధనికదేశాలు, కార్పొరేట్ శక్తులు వ్యతిరేకించడం, అది పేదలకు ఇచ్చే నిర్వచనంలోని లోపాలను, సంపదను లెక్కించే విధానాన్ని ఎత్తిచూపుతూ దాడి చేస్తున్నారు. కార్మికచట్టాలను నిర్వీర్యం చేసి, రెడ్‌టేప్ స్థానంలో రెడ్‌కార్పెట్ పరుస్తానంటూ పెట్టుబడిదారులను రమ్మంటున్న పాలకులకు ఈ సలహాలు పట్టవని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఆధునిక ప్రపంచంలో ప్రభుత్వాలు సంపద సృష్టిపై పెడుతున్న శ్రద్ధ దాని పంపిణీపై పెట్టడంలేదు. దీంతో ఆర్థిక అంతరాలు, ఆదాయ తారతమ్యాలు అంతులేకుండా పెరిగిపోతున్నాయి. ఫలితంగా పారిశ్రామిక అశాంతితో పాటు సామాజిక ఆందోళనలూ పెచ్చరిల్లుతున్నాయి. పెరుగుతున్న అంతరాలు సమాజంలో ఉద్రిక్తతలను తీవ్రతరం చేస్తాయనీ, తిరుగుబాట్లకు కారణమవుతాయన్న కనీస స్పృహ లేకుండా పాలకులు వ్యవహరిస్తున్నారు. వారు పేదలను మరింత పేదలుగా, ధనికులను మరింత ధనికులుగా మార్చేందుకే అభివృద్ధి జపం చేస్తున్నారు. అయితే 'సంస్కరణలతో అభివృద్ధి దిశగా సమాజం' అనే బూటకపు నినాదాలతో పాలకులు ఎంతోకాలం మోసగించలేరని ఈ నివేదికల వల్ల తేటతెల్లం అవుతోంది. నయా ఉదారవాద విధానాలను అనుసరించిన యూరప్ పాలకులను ఆయా దేశాల ప్రజలు పదవీచ్యుతులను చేసిన ఉదాహరణలు మన కళ్ల ముందు న్నాయి. ప్రస్తుతం మోడీ సర్కారు వేగంగా అమలుచేస్తున్న సంస్కరణల వల్ల సూక్ష్మస్థాయిలో ప్రజల జీవన ప్రమాణాల ఎదుగుదలకు చోటు లేకుండా పోతున్నది. సంక్షేమ పథకాలతో సరిపుచ్చుతూ సామాజికాభివృద్ధిని పట్టించు కోవడం లేదు. మౌలిక సదుపాయాలు, నిర్మాణా లతోనే అభివృద్ధి జరిగిపోతుందనే భావనకు ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో అభివృద్ధి ఫలాలన్నీ కొద్దిమందికే పరిమితమై, అత్యధిక శాతం మంది జీవన ప్రమాణాలు పెరగడం లేదు. నిరుద్యోగం, సామాజిక అసమానతలు తీవ్రరూపం దాల్చుతున్నాయి.

ఈ నేపథ్యంలో కోట్లాది మంది పేదలున్న భారత్‌లో అభివృద్ధితోపాటు సంపద పంపిణీపై దృష్టి కేంద్రీకరించాలి. మన విధానాలలో ప్రజల జీవన ప్రమాణాల పెంపుదల ప్రధానాంశం కావాలి. ప్రజలందరికీ విద్య, వైద్యం, రక్షిత తాగునీరు, నివాసం అందించేందుకు తగు ప్రాధాన్యం ఇవ్వాలి. అయితే కార్పొరేట్ల కొమ్ముకాసే ఈ ప్రభుత్వాలు ఆ పనిచేస్తాయని ఆశించడం అత్యాశే. కాబట్టి ప్రస్తుత పాలకులు అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాలను తిప్పికొట్టేందుకు జనం సమాయత్తం కావాలి.

చురక

దావోసు విత్తసభలో
దంచే మోడీ ప్రసంగం
భారత్‌లో పెట్టుబడికి
బార్లు తెరిచే మంత్రాంగం

పెట్టుబడిదారులకు
పెద్ద స్వర్గధామమంటూ
మనదేశం వనరులన్నీ
మంటగలిపే హోమం

- వేల్పుల నారాయణ

'అజ్ఞాతవాసి' - నీ పయనమెటు?



వి. శంకరయ్య

రాష్ట్ర రాజకీయముఖ చిత్రం అస్పష్టంగా వుంది. టీడీపీ, బీజేపీ మైత్రి పై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. మరోవైపు అజ్ఞాతవాసి రాజకీయ పయనం ఎటో తేలడంలేదు. తిరుపతి, అనంతపురం బహిరంగ సభల ద్వారా బీజేపీతో తెగ తెంపులు చేసుకున్నట్లు పవన్ కళ్యాణ్ ప్రకటించారు. పైగా ఇటీవల రెండు తెలుగు రాష్ట్రాలలో సొంతంగా తన పార్టీ పోటీ చేస్తుందని ప్రకటించారు. తదుపరి పవన్ వ్యవహార సరళి అందుకు భిన్నంగా మారింది. రెండు తెలుగురాష్ట్రాలలోని అధికార పార్టీలకు వ్యతిరేకంగా ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలు నన్నగిల్లాయి. రాష్ట్రంలో, కేంద్రంలో బీజేపీతో అంటకాగుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు విధానాలపై అనుకూలంగానూ లేక వ్యతిరేకంగానూ పవన్ కళ్యాణ్ ఒక ముక్క మాట్లాడలేదు. కానీ అసలు వదిలిపెట్టి కొసరుపై పడ్డట్టు తెలుగుదేశం యంపీలు, ఎమ్మెల్యేల పై తరచూ విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. ఈ ధోరణి అత్తమీద కోపం దుత్తమీద చూపినట్లుందని భావించేందుకు ఆస్కారమున్నా తదుపరి పరిణామాలు విస్మయంకొల్పే విధంగా వున్నాయి. పరస్పరం పరుషపద జాలంతో వాగ్వివాదాలు సాగించిన నేపథ్యంలో తెలంగాణా ముఖ్యమంత్రి కేసీఆర్, పవన్ కళ్యాణ్ అప్యాయతగల స్నేహితులుగా కలుసుకున్నారు. పవన్ కళ్యాణ్ కేసీఆర్ ఇంటికి వెళ్ళి ముద్దు ముచ్చట సాగించడంతో ఆ రాష్ట్రంలోని జనసేన కార్యకర్తలు ఆత్మరక్షణలో పడ్డారు. ఏపీలో కూడా గందరగోళ పరిస్థితి నెలకొని వుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవహారశైలి పై మనోగతం ఇటీవల వరకు బయటపెట్టకున్నా అజ్ఞాతవాసి సినిమాకు పొందిన రాయితీలలో సామాన్యజనంలో కూడా పవన్ కళ్యాణ్ ధోరణిపై సందిగ్ధత ఏర్పడింది.

సినిమా నటుడుగా, రాజకీయ నేతగా ద్విపాత్రాభినయం చేయబోయి తప్పటడుగులు వేసి రాజకీయంగా తామరాకు పై నీటిబొట్టులాగా అల్లల్లాడుతున్నాడనే భావన ఎల్లడెలా ఏర్పడింది. పవన్‌కు ఫ్యాన్స్‌గా వుండేవారు ఈ వైఖరి మూర్ఖంగా అంగీకరిస్తారేమోగానీ రాజకీయ వాసనలున్న జనసేన నేతలు కార్యకర్తలు తమ నేత అధికార పార్టీలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని భావించేందుకు ఆస్కారమేర్పడింది. పవన్ కళ్యాణ్‌ను సినిమా నటుడుగా పరిగణించడం పక్కనబెడితే రాజకీయ నేతగా తనపార్టీ విధానాలను ఎన్ని మలుపులైనా తిప్పుకునే స్వేచ్ఛ కలిగి వుంటారు. ప్రస్తుతం ఏపీలో పార్టీ ఫిరాయింపులు చేసిన నేతలను చూడండి. ఎన్ని కుప్పిగంతులు వేస్తున్నారో. తుదకు ప్రజాతీర్పుకు బద్ధులు కావల్సిందే. పవన్ కళ్యాణ్ పరిస్థితి కూడా అంతే. రేపు ఏపీలో తెలుగుదేశం పార్టీతో కలిసి పయనించవచ్చు. లేదా ప్రస్తుతం ఆ పార్టీకున్న పరిమితులను బట్టి స్వతంత్రంగా పోటీ చేయవచ్చు. ఇప్పటికే తన పంథాను ఇన్ని మలుపులు తిప్పిన పవన్ ఇంకెన్ని భిన్నమైన వైఖరులు అవలభిస్తారో వేచి చూడాల్సిందే. టీడీపీతో కలిసి పయనించినా, ప్రత్యేకంగా పోటీ చేసినా తన పరస్పర విరుద్ధమైన వ్యవహారశైలి పై రాష్ట్ర ప్రజలకు మాత్రం జవాబు చెప్పుకోవల్సి వస్తుంది.

2014 ఎన్నికల్లో ప్రధాని అభ్యర్థిగా నరేంద్రమోడీ ముఖ్య మంత్రి అభ్యర్థిగా చంద్రబాబు రాష్ట్రంలో పర్యటించినప్పుడు వారి వెంబడి వుండి బీజేపీ, టీడీపీ అభ్యర్థులను గెలిపించమని కోరారు. ఇరువురు నేతలు గద్దె ఎక్కారు. దాదాపు మూడున్నరేళ్ళకాలం గడిచిపోయింది. ఇదేమీ అంత తక్కువ కాలం కాదు. కేంద్రంలో ఏర్పడ్డ బీజేపీ ప్రభుత్వం ఏపీ ప్రజలను దానితోపాటు తెలుగుదేశం ప్రభుత్వాన్ని వివిధ సందర్భాలలో కీలక అంశాలపై కర్రుగాల్చి వాతపెడుతూ వుంది. అందుకే బీజేపీతో తెగతెంపులు చేసుకొన్నానని ప్రకటించినట్లు చెప్పు కోవచ్చు. అయితే మూడున్నరేళ్ళకాలం గడుస్తున్నా జనసేనపార్టీ నేతగా కేంద్రానికి వ్యతిరేకంగా సాగించిన పోరాటం ఏమీలేదు. మాటల తూటాలు మాత్రమే పేలాయి. ఎన్నికల ముందు వచ్చి బీజేపీకి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎంత అరచి గీ పెట్టినా ప్రజలు సానుకూలంగా స్పందించే అవకాశాలు ఏమాత్రం వుండవు. కేవలం సినిమా గ్లామర్‌తో బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడి సాధించేది శూన్యం. ఆమధ్య మహాను భావులు యన్‌టీఆర్ నుండి కాపీ కొట్టి ఆత్మగౌరవ నినాద మిచ్చినా అది పేలని తుస్సుమన్న టపాసులాగా మిగిలిపోయిం ది. యన్‌టీఆర్ రాజకీయ ప్రవేశం చేసిన రోజులువేరు. ఆనాడు రాష్ట్రంలో రాజకీయ శూన్యత బలీయంగా వుండినది. ప్రత్యామ్నాయం లేదు. నేడు ఆ పరిస్థితి రాష్ట్రంలో లేదు.

ఇకపోతే ముఖ్యమంత్రి చంద్రబాబు యెడల ఆయన చేపట్టిన అపసవ్య విధానాల పట్ల ఇంతవరకు పవన్ కళ్యాణ్ పల్లెత్తుమాట అనలేదు. పైగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతి అంశంలోనూ తోకకోసి సున్నం పెడుతున్నా ముఖ్యమంత్రి కనీసం తోకకూడా జాడించలేని దుస్థితిలో ఉండిపోవడం పై పవన్ కళ్యాణ్ ఎందుకు మౌనం వహిస్తున్నట్లు? ఒక దఫా మాత్రం కేంద్రాన్ని చూసి ఎందుకు భయపడాల్సి వస్తున్నదని ప్రశ్నించారు. తదుపరి ఇరువురు ఏకాంత చర్చలు జరిపారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అంతేకాదు, కొంతకాలంనుండి రాష్ట్రంలోని పలు వర్గాల ప్రజలు పవన్ కళ్యాణ్ చెబితేనైనా ముఖ్యమంత్రి తన తప్పుడు విధానాలను మార్చుకుంటాడేమోననే ఆశతో ఆశ్రయించగా అది ఎండమావిగా మిగిలి పోయింది. శ్రీకాకుళం జిల్లా కిడ్నీ బాధితుల వ్యథభరితగాథ కొండను తవ్వి ఎలుకను పట్టినట్టైంది. పోలవరం డంపింగ్ యార్డ్ రైతులు, తుందుర్రు అక్వా బాధితులు, అగ్రిగోల్డ్ బాధితులు, రాజధాని రైతులు, డీసీఐ ఉద్యోగులు తుదకు విలువైన జీవితకాలం వృధా చేసుకుంటున్న ఫాతిమా కాలేజీ విద్యార్థులు తనను ఆశ్రయించగా పవన్ కళ్యాణ్ వారికి చేసిన ఉపకారమేమిటి? ముఖ్యమంత్రి చంద్రబాబు వైఖరిని ఏమాత్రం మార్చలేకపోయారు. బాధితులకు న్యాయం జరగలేదు. అదే సమయంలో తను నటించిన చిత్రానికి మాత్రం రాయితీ లభించింది.



ఇవేకాదు తన సరసన వేదికలపై నిలబడి రైతులకు, మహిళలకు రుణాలు మాఫీ చేస్తానని, నిరుద్యోగ యువతకు భృతి ఇస్తానని ముఖ్యమంత్రి చేసిన వాగ్దానాలు హుష్‌కాకి అయ్యాయి. కేంద్రం నుండి చట్టబద్ధంగా పొందాల్సిన నిధులు, రాయితీలు పొందడంలో ముఖ్యమంత్రి వైఫల్యం చెందారు. ఈ అంశాలపై పవన్ వైఖరి ఏమిటో స్పష్టంకాలేదు. ఈ పూర్వరంగంలో పవన్ కళ్యాణ్ టీడీపీతో కలిసి పయనించితే ఏముఖం పెట్టుకొని ప్రజలను ఓట్లు అడుగుతారు? ఒకవేళ ప్రతిపక్షపార్టీగా పోటీ చేస్తే ఆ సమయంలో కూడా ప్రజలకు సమాధానం చెప్పుకోలేని ఆవాంతర పరిస్థితి పవన్ ఎదుర్కోవల్సి వుంటుంది. రాష్ట్రంలో పౌరహక్కులు హరించడం, బలహీన వర్గాలు, అసంఘటిత ప్రజా సమూహం, దళితుల పై దాడులు ఎక్కువ కావడం భూసేకరణ సందర్భంగా బాధితులయ్యే నిర్వాసితులను వామపక్షనేతలు తుదకు కలుసుకునే అవకాశం కూడా ఇవ్వకుండా పోలీసు దమనకాండ సాగింది. ఇలాంటి ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ మూడున్నరేళ్ళ కాలంలో పవన్ కళ్యాణ్ కనీసం నిరసన కూడా తెలపలేని స్థితిలో వుండి వామపక్షాలను అభిమానిస్తానని చేసిన ప్రకటనలకు జవాబు దొరకడం లేదు.

వాస్తవం చెప్పాలంటే రాష్ట్రంలో ఒకవైపు ముఖ్యమంత్రి తిరిగి అధికారం స్వాధీనం చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. అధికార, ధన బలంతో ఏదైనా సాధించవచ్చుననే ధీమాతో వున్నారు. మరోవైపు విపక్షనేత జగన్ తనదైన శైలిలో ప్రజలలోకి వెళ్ళి సుదీర్ఘపాదయాత్ర చేస్తున్నారు. వచ్చిన చిక్కల్లా పవన్ కళ్యాణ్‌కే! ఇప్పటికీ తను అధికారపార్టీకి మిత్రపక్షమా? లేక ప్రతిపక్షమా నిర్ణయించుకోలేని అయోమయ స్థితిలో వున్నారు. పుణ్యకాలం గడిచిపోయింది. కాలం కరిగిపోతోంది. పవన్ కళ్యాణ్ తట్టాబుట్ట సర్దుకొని వచ్చేవరకు కాలం ఆగదు. ప్రజలు కూడా ఆయనకోసం ఎదురు చూస్తూ కూర్చోరు. పుణ్యకాలం గడిచిపోయిన తర్వాత ఎన్నికల బరిలో ఏపక్షంగా దిగినా 2014 ఎన్నికల్లో తను నిర్వర్తించిన పాత్రకు ప్రజలనుండి నిలదీత ఎదుర్కోక తప్పదు. ముఖ్యమంత్రి, విపక్షనేత కన్నా పవన్ కళ్యాణ్‌కే ఎక్కువ ఇబ్బందికర పరిస్థితి ఎదురుకానున్నది. పవన్ కళ్యాణ్‌ను చూస్తే కేరింతలు కొట్టే అభిమానుల అంశానికొస్తే అది గోళీసోడా బుడ్డిలాంటిదే. పార్టీ నిర్మాణం ఏమీలేకుండా ముందుకెళ్ళడం అంతసులభమైన అంశం కాదు. తన రాజకీయ పంథాను పవన్ కళ్యాణ్ ఎక్కువకాలం నాన్చుతున్నంతకాలం మరీ అంత ఇబ్బందికర పరిస్థితి ఎదురుకాక తప్పదు. ఎన్నికల తుదిదశలో పవన్ కళ్యాణ "సొంతంగా ఎన్నికల బరిలో దిగినా కలిసొచ్చే లాభంకన్నా మూటగట్టుకొనే అపప్రథ ఎక్కువగా ఉంటుంది.

వ్యాస రచయిత : విశ్రాంతపాత్రికేయుడు
సెల్ : 9848394013

సామాన్యుని సణుగుడు

జోస్యుల వేణుగోపాల్

చాలా విషయాలలో ఖచ్చితమైన సరిహద్దు గీతలుండాల్సిన చోట లేకుండాపోవడం వల్ల అస్థవ్యస్థమై అభివృద్ధి కుంటుపడుతోంది. ఇంతకుముందు కేంద్రం ఒకే పార్టీ పాలనలో ఉన్నప్పుడు అభివృద్ధి, అవినీతి అనేది సమాంతర రైలు పట్టాల్లా సాగిపోయినా ఖచ్చితమైన తేడాతో ఏది అభివృద్ధో, ఏది అవినీతో సామాన్యుడు సైతం గ్రహించగలిగేవాడు. తర్వాత వివిధ పార్టీల సంకలనం అనేక రంగులు కలసిన జనతా వస్త్రాల్లాంటి జనతా పార్టీ మూణ్ణాళ్ళకల్లా చిరిగి పీలికలై పార్టీల ఐకమత్యానికి సరిహద్దులు చెరిపివేసింది. తర్వాత వచ్చిన యూ.పి.ఏ. ఎన్.డి. ఏ. లాంటి కిచిడీ ప్రభుత్వాలు కూడా సరైన విధానంలో నడవడంలేదు. అందుకే పార్టీలకు, ప్రభుత్వానికి ఖచ్చితమైన తేదా ఉండాలి. పార్టీలు ప్రభుత్వాలను డామినేట్ చేస్తే 'డామిట్' కథ అడ్డం తిరుగుతుంది. గెలిచేంతవరకే పార్టీ కానీ తర్వాత ప్రభుత్వము, ప్రజలు ఇవి రెండే కనపడాలి. దురదృష్టవశాత్తూ ఓడిపోయిన వారు ఇన్‌చార్జ్‌లుగాను, పదవులూడి పోయిన రాజకీయ నిరుద్యోగులు పెత్తందార్లుగాను, పార్టీల కమిటీలు, కుల సంఘాలు, కలగలపు కార్పోరేషన్లు.. ఏ విషయం మీద పూర్తి అవగాహన లేకున్నా అన్ని శాఖల గురించి మాట్లాడే కొందరు మంత్రులు, ఎవరిమీదా కంట్రోల్ లేని ప్రభుత్వ పెద్దలు....! అసలు అర్థమే కాని సందిగ్ధంలో అమాయక ప్రజలు. కేంద్రం, రాష్ట్రాలలో ప్రస్తుతం కలిసి ఉన్న పార్టీలవల్ల ఎవ్వరికీ ప్రయోజనం లేదు. పూర్తి మెజారిటీ ఉన్న కేంద్రానికి అవసరం లేకపోయినా మేమున్నా మంటూ అంశాలవారీ మద్దతు ప్రకటించి అందులో మంత్రిపదవులు పొంది రాష్ట్రానికి రావలసినవి అడిగే హక్కును కోల్పోతున్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రి పదవులు తీసుకుతీన్న కేంద్రం కూడా వారి పథకాలు స్వయంగా ప్రకటించుకునే అవకాశం లేక వాటిని నీరుగార్చి నిధుల విడుదల ఆపేస్తున్నారు. ఏది కేంద్ర పథకమో, ఏది రాష్ట్ర ప్రభుత్వ పథకమో తెలీక జనం జుట్టుపీక్కుంటున్నారు. ప్రత్యేక హోదాకు, ప్యాకేజీకి తేదా లేని విషయాన్ని రెండు ప్రభుత్వాలు కలిసి మనకు కళ్ళకు కట్టినట్లు చూపించాయి. మొహమాటానికి పోయి కేంద్రం చేయాల్సిన పనులు రాష్ట్రాలు నెత్తిన వేసుకొని ఆ భారాన్ని మోయలేక జనం నెత్తిన వేయడం జరుగుతోంది. ఇదుగో అంటూ ఇవ్వలేని వ్యవస్థలు, మాకు కావాలి అంటూ అడగలేని అవస్థలు.. కేవలం ఇదంతా కలగా పులగం కావడం వల్ల వచ్చే అనర్థం. దేశ సరిహద్దుల్లో పాకిస్తాన్, చైనాలు హద్దులు చెరిపి మన లోకి జొరబడి అంతా మాదేనంటారు.. ఏది హద్దో తెలియని సందేహంలో ఇవన్నీ గతపాలకుల నిర్వాకాలని ప్రస్తుతాన్ని నీరుగారుస్తుంటారు నేటి పాలకులు. వారికి వీరికి తేడా కనపడని ప్రజలు మరొక కొత్తశక్తి ఏదైనా రావాలని కోరుకుంటుంటారు.. రాను రాను ఏ విషయంలోనూ మంచి చెడు, పెద్దా, చిన్న తారతమ్యాలు కూడా కనపడడంలేదు. పని విధానంలో కానీ, జనం జేబులు గుల్ల చేయడంలోకానీ ప్రభుత్వ, ప్రైవేటు రంగాలకు తేడాలేకుండా పోయింది. ప్రభుత్వ బ్యాంకింగ్ రంగం కూడా ప్రైవేటు వ్యాపారుల అవతారమెత్తి డిపాజిట్లకు గ్యారంటీ లేకుండా చేస్తోంది. కాలాలు కల్లోలాలుగా మారుతున్నాయి. రుతువుల్లో కూడా సరైన తేడా కనపడకుండా అకాల వానలు, మంచు, చలి, ఎండలు అన్నీ కాలం తెలీకుండా కనెర్ర జేస్తున్నాయి. ప్రతి రంగంలోనూ తేడాలేని నిర్లక్ష్యం. సంఘ విద్రోహ శక్తులుగా మారడానికి కూడా చదువుకున్న వారు, నిరక్షరాస్యులు అనే తేడాలేదు. శీలము, అశ్లీలము గురించి తారతమ్యం లేని తర్కం మొదలైంది. ప్రేమ, పెళ్ళిల మధ్య సరిహద్దులు చెరిగి పెటాకులవుతున్నాయి. పాలక పక్షం పథకాలకు రంగులు మారుస్తుంది... ప్రతిపక్షం వాటి హంగులు మార్చి ప్రచారం చేస్తుంది. న్యాయానికి, అన్యాయానికి సరిహద్దులు ఏనాడో చెరిగి పోయాయి. ఇక పండుగలు కూడా దీపావళి లాంటివి సౌండ్ పొల్యూషన్ అని కొంతమంది, సాంప్రదాయమని మరి కొంతమంది టి.వి.లో చర్చిస్తారు. పండుగ చేసుకోవడానికి సామాన్యుడి జేబులో లేని డబ్బు గురించి ఎవరికీ పట్టదు. నేరస్థుల తరపున కూడా వాదించడానికి న్యాయం ముందుకు వస్తుంది. శిక్షపడి జైల్లో ఉన్న కొందరు నాయకులకు జైలుకు, ఇంటికి ఏ తేడా లేకుండా ఇంట్లో గడిపినట్లే ఉండడం సామాన్య ఖైదీలకు అర్థం కాని విషయమే. జాతీయ స్థాయిలో వికసిస్తున్న "హస్తకమలాలన్నీ" తేడాలేని వాసనను వెదజల్లుతుంటే .....ఇన్నాళ్ళ ప్రతిపక్షంలో ఉండి పాలక పక్షాన్ని నిలువునా ఎండగట్టినవారే అభివృద్ధి వాసనకు, రుచికి తట్టుకోలేక తన్మయత్వం చెంది పాలక పక్షంలో చేరి ప్రతిపక్షాన్ని విమర్శిస్తూ తరిస్తుంటే సామాన్య ప్రజలంతా అర్థం కాని భాషలో ...." ఏతా వాతా ఏ చెట్టు కింద పడుకున్నా పీడకలలే" అని సణుక్కుంటూ దేవుడికి దణ్ణం పెట్టుకొని ఆయనమీదే భారం వేస్తున్నారు.

సందర్భం

జీఎస్టీ నష్టాలకు బొగ్గు సెస్సు నిధులా..!

టీ.వి. సుబ్బయ్య

పర్యావరణ కాలుష్యంవల్ల భూతాపం పెరుగుతున్నది. ఈ శతాబ్ది చివరినాటికి భూతాపం 2 డిగ్రీల సెల్సియస్‌కు మించి పెరగకుండా నివారణ కార్యచరణ చేపట్టేందుకు అంగీకరించి పారిస్ ఒప్పందపైన 195 దేశాలు సంతకాలు చేశాయి. వీలయితే 1.5 డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేయాలి. భారతదేశం కూడా సంతకం చేసింది. ఇప్పటికే ఒక డిగ్రీ సెల్సియస్ భూతాపం పెరిగిందని కఠినమైన చర్యలు తీసుకోకపోతే శతాబ్ది చివరినాటికి 4-6 డిగ్రీల సెల్సియస్ పెరిగి ప్రపంచాన్ని ప్రమాదంలో పడవేస్తుందని శాస్త్రవేత్తల అధ్యయనాలు హెచ్చరించాయి. 2014లో అధికారానికి వచ్చిన నరేంద్రమోడీ ప్రభుత్వం అత్యంత ముఖ్యమైన వాతావరణం విషయంలోనూ చెప్పే మాటలకు చేసే పనులకు పొంతన వుండటం లేదని పరిశీలిస్తే విదితమవుతుంది. ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టే బడ్జెట్‌లోనూ కాలుష్యం, భూతాపం నియంత్రణకు అధిక నిధులు కేటాయించవచ్చు. ఇందుకోసం బొగ్గు వినియోగ సంస్థల నుంచి భారీగా పన్ను వసూలు చేస్తున్నారు. అయినప్పటికీ లక్ష్యసాధనకు చేసే వ్యయం అత్యల్పంగా వుంటూ ప్రాజెక్టుల ప్రకటనలను వెక్కిరిస్తోంది. అంతేకాదు వసూలు చేసిన బొగ్గు సెస్సులో రు.57వేల కోట్లకు పైగా జీఎస్టీ అమలు కారణంగా వచ్చిన నష్టాన్ని పూడ్చేందుకు వినియోగించడం వల్ల పర్యావరణం పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని స్పష్టమవుతుంది.

2005 నాటి లెవెల్స్‌కు కర్బన వాయువుల విడుదలను 30-35 శాతం తగ్గిస్తామని అన్ని దేశాలూ ఐక్యరాజ్యసమితికి తెలిపాయి. శిలాజయేతర ఇంధన వినియోగాన్ని ఇప్పుడున్న 30 నుంచి 40 శాతానికి పెంచుతామని తదితర హామీలను ఇచ్చాయి. భారతదేశం 2030 నాటికి అమలు చేయవలసిన వాతావరణ కార్యాచరణ ప్రణాళికకు 2014-15లో వున్న ధరల ప్రకారం రూ. 150 లక్షల కోట్లు అవసరమవుతుందని 2016 ఆర్థిక సర్వే తెలిపింది. వాతావరణ మార్పులకు సంబంధించిన కార్యకలాపాలను వాతావరణం, అడవులు, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ (ఎండిఇఎఫ్ అండ్ సిసి) నిర్వహిస్తుంది. బడ్జెట్‌లో కేటాయింపులకు 2017-18 సంవత్సరానికి రూ. 1599.23 కోట్ల నుంచి రూ. 2675.42 కోట్లకు పెంచారు. గత మూడేళ్లతో పోలిస్తే ఇది 67 శాతం పెరిగింది.

ఈ కేటాయింపులేమయ్యాయో పరిశీలిస్తే నిరాశ కలుగుతుంది. రెవిన్యూ వ్యయంలో వేతనాలు, నిర్వహణ వ్యయం 2014-15లో రూ. 1531.38 కోట్లు వుండగా 2017-18 నాటికి బడ్జెట్‌లో 2635.88 ఓట్లు వుండగా 2017-18 నాటికి బడ్జెట్లో 2635.39 కోట్లకు పెంచారు. ఇదే సమయంలో పెట్టుబడుల వ్యయం - వివిధ పథకాలు, కార్యక్రమాలకు వాస్తవంగా 40 శాతం తగ్గిపోయింది. 2014-15లో రూ. 67.3 కోట్లుండగా 2017-18 నాటికి రూ. 40.03 కోట్లకు తగ్గిపోయింది. ఈ అంకెలు చూసినప్పుడు 'స్వచ్ఛభారత్' నినాదానికి ఆచరణకు పొంతనలేదని స్పష్టమవుతుంది. పైగా స్వచ్ఛ వాతావరణం కోసం కార్యక్రమాల నిర్వహణకు 28 మంత్రిత్వ శాఖలను భాగస్వాములను చేశారు.

బొగ్గు సెస్సు దుర్వినియోగం

స్వచ్ఛ ఇంధనాన్ని ప్రోత్సహించి బొగ్గు వినియోగాన్ని తగ్గించే లక్ష్యంతో 2010-11 బడ్జెట్‌లో టన్ను బొగ్గుకు రూ. 50 సెస్సును ప్రవేశపెట్టారు. వసూలైన సెస్సును జాతీయ స్వచ్ఛ ఇంధన నిధికి (ఎన్‌సిఇఎఫ్) పంపవలసి వున్నప్పటికీ ఇతర పనులకు బదిలీ చేశారు. ఈ నిధులు నూతన, పునరుత్పత్తి ఇంధన మంత్రిత్వ శాఖ స్వచ్ఛ ఇంధన ప్రాజెక్టులు చేపట్టడానికి వుద్దేశించినవి. మోడీ ప్రభుత్వం వచ్చాక సెస్సు పెరుగుతూ వచ్చింది. చివరిగా 2016లో టన్నుకు 200 నుంచి రూ. 400లకు పెరిగింది. సెస్సు 106 శాతం పెరిగిందని కాగ్ నివేదిక సైతం తెలిపింది. బొగ్గు సెస్సు కింద 2010-11 నుంచి 2016-17 వరకు రూ. 53,967.23 కోట్లు వున్నాయని కాగ్ ఆడిట్ నివేదిక వెల్లడించింది. వీటిలో రూ. 15,483.21 కోట్లు (28.69 శాతం) మాత్రమే జాతీయ స్వచ్ఛ ఇంధనం నిధికి బదిలీ చేశారు. వాస్తవంగా రూ. 38,484.02 కోట్లు (71.31 శాతం) తక్కువ నిధులు బదిలీ చేశారు. 2017-18లో మరో రూ. 29,700 కోట్లు వసూలు కావచ్చునని పార్లమెంటరీ స్టాండ్ కమిటీ తెలిపింది. అయితే, వివిధ పథకాలకు రూ. 7 వేల కోట్ల లోపు మాత్రమే ఖర్చు చేశారు. ఈ పథకాలకు కేటాయించకుండా పక్కన వుంచిన రూ. 56,700 కోట్లు 2017లో జీఎస్టీ వల్ల వచ్చిన నష్టాన్ని పూడ్చుకునేందుకు మళ్లించినట్టు ఆర్‌టీఐ దరఖాస్తుకు సమాధానం వచ్చింది. వాస్తవంగా ఈ ఏడాది ఎన్‌సిఇఎఫ్ వద్ద ఎలాంటి నిధులు లేవు. ఈ సంస్థ మౌనంగా కూచోవలసిందే. వాతావరణ మార్పుల నిర్వహణకు ఉపబడ్జెట్‌ను ప్రవేశ పెట్టాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు వార్తలు వచ్చాయి. వసూలు చేసిన నిధులను సైతం వ్యయం చేయని మోడీ ప్రభుత్వానికి స్వచ్ఛభారత్‌పై ఎంత శ్రద్ధ వుందో ఈ చర్యలు స్పష్టం చేయడం లేదా?

వి-మెయిల్స్

31 న ఏర్పడేచంద్రగ్రహణాన్ని ఆహ్లాదకరంగా చూద్దాం

తెలుగునాట భక్తిరసం తెప్పలుగాపారుతోంది ..అని గజ్జలమల్లారెడ్డిగారు ఎప్పుడో అన్నాడు.ఈ రోజు అయితే భరతనాట భక్తిరసం ...అని వ్రాసి ఉండేవాడు.రేపు 31 వ తేదీ ఏర్పడే చంద్రగ్రహణం నాడు దేవాలయాలన్నీ మూసివేస్తున్నారు.అఖిలాండ భక్తకోటి నాయకుడు ఆపదమొక్కులవాడు పిలిస్తేపలికేదేవుడు అడుగడుగు దండాల వాడు అయిన తిరుపతి వెంకన్నగుడికూడా ఆరోజు మూసివేస్తున్నారు. చంద్రుడిని మింగే రాహుకేతువుల సొంగ ఇక్కడ ఈదేవుళ్ళ మీదపడి మైలపడిపోతారని గుళ్ళ మూసివేస్తున్నారు .ఆరోజు గర్భిణీ స్త్రీలు బయటతిరిగితే .పిల్లలు మొర్రితో పుడతారని భయపెడుతున్నారు. ఇక సైన్సు పాఠాలుచెప్పే పంతుళ్లు పట్టుస్నానాలు, విడుపుస్నానాలు . వీళ్ల స్కూళ్లలో చంద్రుడు భూమి ఒకదానిచుట్టూ ఒకటి తిరుగుతూ సూర్యుని చుట్టూ తిరిగే క్రమంలో భూమినీడ చంద్రునిపై పడినందున గ్రహణం ఏర్పడుతుందని చెపుతారు.కానీ ఇంటికెళ్లి పట్టు విడుపు స్నానాలు! ఆసమయంలో ఎమితినకూడదు.ఏమీచెయ్యకూడదు! వేలాది సంవత్స రాలుగా ఇలా భయపెడుతూనే వున్నారు.మా అమ్మాయి ప్రభుత్వ ఉద్యోగి. గర్భిణీగా ఉన్నప్పుడు బయటతిరిగింది. మొర్రితో పుట్టాలిగదా ! చందమామలాంటి అమ్మాయి పుట్టింది .చందమామ అని పేరుపెట్టుకున్నారు. అవన్నీ మూఢనమ్మకాలు . వాటిని వదులుకుంటేనే సమాజం అభివృద్ధి చెందుతుంది.మూఢనమ్మకాలను ప్రచారం చేసేవారిపై చర్యలు తీసుకోవాలి.ఆపని ప్రభుత్వం చెయ్యాలి. ప్రజలు ఒత్తిడి కూడా చెయ్యాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, అధ్యక్షుడు, ఏపీ హేతువాద సంఘం

ప్రతి ఒక్కరూ దేశభక్తి భావజాలాన్ని పెంచుకోవాలి

"నేతాజీ సుభాష్ చంద్రబోస్ పుట్టిన రోజైన జనవరి 23న దేశభక్తి దినోత్సవంగా జరుపుకున్నాము. సుభాష్ చంద్రబోస్ 23.01.1897న కటక్‌లో జన్మించారు. తల్లి ప్రభావతి, తండ్రి జానకీనాథ్‌బోస్ చిత్తరంజన్‌దాస్ అనుచరుడిగా సుభాష్‌చంద్రబోస్ స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారు. కాంగ్రెస్‌లో కొంతకాలం కొనసాగిన తర్వాత ఫార్వర్డ్ బ్లాక్ అనే పార్టీని స్థాపించారు. 1941న సంవత్సరంలో పోలీసుల కన్ను గప్పి జర్మనీ చేరుకున్నాడు. జలంతర్గామిలో 90 రోజులు ప్రయాణించి హిందూ మహాసముద్రం మీదుగా జపాన్ చేరుకున్నాడు. 1943లో ఇండియన్ నేషనల్ ఆర్మీ (ఆజాద్ హింద్ ఫౌజ్) ను స్థాపించి, నాయకత్వం వహించాడు. జపాన్ తాను ఆక్రమించుకున్న అండమాన్ దీవులను నేతాజీకి అప్పగించింది. నేతాజీ ఏలుబడిలోకి వచ్చిన మొదటి ప్రాంతమిదే. ఈ ఆజాద్ హింద్ ప్రభుత్వాన్ని జర్మనీ, బర్మా, ఫిలిప్పైన్స్, క్రొయేషియా దేశాలు అధికారికంగా గుర్తించాయి. నేతాజీ ఫార్మోసాకు విమానంలో వెళుతూ ఆ విమానం కూలిపోవడం వల్ల (18.08.1945) మరణించాడని అంటారు. ఈ విమాన ప్రమాదంలో బోస్ మరణించలేదని మరికొందరి అభిప్రాయం. వారి మృతి ఇప్పటికీ మిస్టరీగా ఉంది. వీరికి "భారతరత్న" అవార్డ్ సైతం ప్రదానం చేయబడింది. బోస్‌కి దేశమన్నా దేశభక్తి అన్నా ఎక్కువ. నేటి యువతలో దేశభక్తి కొరవడుతుంది. యువత నిరాశ నిస్పృహలో కొట్టుమిట్టాడుతున్నారు. యువత దేశభక్తుల, స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్న నాయకుల జీవిత చరిత్రలు చదవాలి. దేశం మనకేమి చేసిందని కాదు మనం దేశానికి ఏం సేవ చేస్తున్నాం అని ఆత్మ పరిశీలన చేసుకోవాలి. ధైర్య, సాహసాలకు మారు పేరు నేతాజీ. ప్రతి ఒక్కరూ దేశమును ప్రేమించాలి. దేశభక్తిని పెంచుకోవాలి. విద్యార్థులలో ప్రాథమిక దశ నుండే దేశభక్తి భావాజాలాన్ని పెంపొందింప చేయాలి. ప్రతి గ్రామంలో నిత్య జనగణమన, జాతీయ గీతం ఆలాపన జరగాలి. ప్రతీ ఒక్కరూ నేతాజీ సుభాష్‌చంద్రబోస్‌ను స్ఫూర్తిగా తీసుకొని దేశసేవలో పునరంకితం కావాలి. వారి జీవిత చరిత్రను అధ్యయనం చేయాలి.

- కామిడి సతీష్‌రెడ్డి, పరకాల, వరంగల్ రూరల్ జిల్లా

విశాలాంధ్ర
బతుకు The Life
గురువారం
25 జనవరి 2018

రచయితలకు సూచన

'బతుకు' పేజీలో ప్రచురణకు పంపే రచనలు, వార్తా కథనాలను ఇక నుంచి ఈ దిగువ ఈ మెయిల్ చిరునామాకు పంపగలరని మనవి.

batuku@visalaandhra.com

ఈ ఏడాది గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో ఓ ప్రత్యేకత ఉంది, ఓ గొప్ప విశేషం ఉంది. ఈ పరేడ్‌లో ఎప్పుడూ, ప్రతి ఏటా విశేషాలు ఉంటాయి. కానీ అవన్నీ అలవాటైపోయిన విషయాలు, విశేషాలు. ఈ ఏడాది పరేడ్ చరిత్రలో నిలిచిపోయే ఓ ఘనమైన సంఘటనకు వేదిక కానుంది, దేశ ప్రజలనే కాదు ప్రపంచ ప్రజలనే అచ్చెరొవొందించనుంది. అదే....ఆ విశేషమే...మహిళా బైకర్ల విన్యాసాలు. ఈ విన్యాసాల అభ్యాసం సమయంలోనే ఈ చిత్రాలన్నీ పత్రికలకెక్కాయి. మరి పరేడ్‌లో ప్రదర్శనతో ఈ శివంగులు ఇంకెంత కీర్తిని సంపాదించనున్నారో! మరి ఈ మహిళా బైకర్లతో విన్యాసాలు చేయించాలనే ఈ ఆలోచన ఎవరిది? వీళ్ళకి నాయకురాలు ఎవరు? ఎలాంటి ప్రాక్టీసు చేశారు? ఇత్యాది విశేషాలు వివరంగా....తెలుసుకుందామా!



రాజ్‌పథ్ దగ్గర ఉదయాన్నే మంచు ముసుగులో సాధన చేస్తున్న మహిళా బైకర్ల బృందం


రేపు మహిళా గణతంత్రం

తొలిసారి లేడీ డేర్‌డెవిల్స్ విన్యాసాలు

ప్రతి సంవత్సరం సాధారణంగా పరేడ్ చివరలో బైకర్ల బృందం తమ విన్యాసాలతో అందరి చూపును కట్టిపడేయడం తెలిసిందే. కానీ ఈ ఏడాది మహిళలు ఈ పని చేయనున్నారు. సరిహద్దు భద్రతా దళాల (బీఎస్ఎఫ్)కు చెందిన మహిళా బైకర్ల బృందం ఈసారి ఈ విన్యాసాలు చేయనుంది. మహిళా బైకర్ల బృందం తొలిసారిగా గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొనడమే ఒక విశేషమైతే ఒళ్ళుగగుర్పొడిచే విన్యాసాలతో అలరించేందుకు సిద్ధం కావడం ఇంకో విశేషం. కన్ను తిప్పుకోనివ్వని స్టంట్స్, యాక్రోబాటిక్స్‌తో ఈ లేడీ డేర్‌డెవిల్స్ అబ్బురపరచనున్నారు. సంప్రదాయం ప్రకారం అయితే బీఎస్ఎఫ్ లేదా ఆర్మీ దళంలోని పురుషుల బృందం ఈ పరేడ్‌ని ముగిస్తుంది. ఒక ఏడాది బీఎస్ఎఫ్ బృందం ఈ విన్యాసాలు చేస్తే మరుసటి ఏడాది ఆర్మీ బృందం ఇందులో పాల్గొంటుంది. అలా ఈ ఏడాది వంతు బీఎస్ఎఫ్‌కి వచ్చింది. దేశంలో అతి పెద్ద సరిహద్దు రక్షణ దళంగా ఉన్న బీఎస్ఎఫ్ ఈ ఏడాది ఏదైనా విభిన్నంగా చేయాలని ఆలోచించింది. ఈ ఆలోచన నుంచి పుట్టుకొచ్చిందే మహిళా బైకర్ల సాహసోపేత విన్యాసాలు. 'సీమ భవాని' లేదా బోర్డర్ బ్రేవ్‌హార్ట్స్ అని పిలిచే ఈ దళంలో మొత్తం 113 మంది సభ్యులు ఉండగా ఇందులో మహిళలూ ఉన్నారు. వీళ్ళంతా 25 నుంచి 30 ఏళ్ళ వయస్సు ఉన్నవాళ్ళే. వివిధ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు పొందినవాళ్ళే ఈ దళంలో సభ్యులుగా ఉంటారు. ఈ దళంలోని మహిళా సభ్యులే ఇప్పుడు బైక్‌పై విన్యాసాలు చేయనున్నారు.







లడక్‌కి చెందిన సబ్ ఇన్స్‌పెక్టర్ స్టాన్‌జిన్ నార్‌యాంగ్ (28) నేతృత్వంలో మహిళా బైకర్ల బృందం పరేడ్‌కి సిద్ధమవుతోంది. ఈ బృందంలో దాదాపుగా దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన మహిళలు ఉన్నారు. ఇందులో అత్యధికంగా 20 మంది పంజాబ్ నుంచి ఉండగా పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌ల నుంచి వరసగా 15, 10, 9, 8 మంది సభ్యులు ఉన్నారు. అసోం, బీహార్‌ల నుంచి ఏడుగురు, ఒడిషా నుంచి ఆరుగురు, రాజస్థాన్, మణిపూర్, గుజరాత్‌ల నుంచి ఐదుగురు చొప్పన, జమ్మూకాశ్మీర్, చత్తీస్‌ఘర్‌ల నుంచి ముగ్గురు చొప్పన ఈ బైకర్ల బృందంలో ఉన్నారు. కేరళ, కర్నాటక, ఉత్తరాఖండ్, ఢిల్లీల నుంచి ఇద్దరేసి చొప్పన, మేఘాలయ, హిమాచల్ ప్రదేశ్‌ల నుంచి ఒక్కొక్కరు చొప్పన ఈ బృందంలో సభ్యులుగా పరేడ్ ప్రాక్టీస్ చేస్తున్నారు. ఇందులో 15 మంది మహిళలు వివాహితులు కాదు వీరిలో కొంతమంది తల్లి అయినవాళ్ళూ ఉన్నారు.

ఇక్కడ తెలుసుకోవలసిన ఆసక్తికరమైన విషయమేమంటే పరేడ్‌లో పాల్గొనడానికి ఎంపికయ్యే వరకూ ఈ మహిళల్లో చాలామందికి కనీసం సైకిల్ ఎలా ఉపయోగించాలో కూడా తెలియదు. ఈ జాబితాలో ఈ బృందం కెప్టెన్ నార్‌యాంగ్ కూడా ఉన్నారు. ఇంతకుముందెన్నడూ ఇలాంటి పరిస్థితి లేదని భయపడినవాళ్ళూ ఉన్నారు. అయితే ఈ మహిళలంతా బాస్‌నే స్ఫూర్తిగా తీసుకున్నారు. తమ భయాలన్నింటినీ పక్కనపెట్టి ధైర్యంగా ముందడుగు వేయాలని నిర్ణయించుకున్నారు. బైక్‌లతో విన్యాసాల ప్రాక్టీస్‌కు సిద్ధమయ్యారు. ఒక సవాల్‌గా తీసుకుని బైక్‌లతో యాక్రోబాటిక్స్ సాధన ప్రారంభించారు.

బీఎస్ఎఫ్‌లోని ప్రత్యేక ఇనస్ట్రక్టర్ల మార్గదర్శకత్వంలో ఈ అతివలంతా కఠోర సాధన చేశారు. చలివేళ ఉదయం ఎనిమిది గంటలకే వారు ప్రాక్టీస్ ప్రారంభమయ్యేది. మధ్యాహ్నం ఒంటిగంట వరకూ సాధనే. తిరిగి మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5.30 వరకూ ప్రాక్టీసే. గత కొన్ని రోజులుగా రోజూ ఇదే వారి దినచర్య. ఈ సాధనకు అనుగుణంగా తమ శరీరాలను తయారుచేసేందుకు, ఫిట్‌నెస్‌ని సాధించేందుకు వారిని వారు ఎంతో మార్చుకున్నారు. ఆహారంలోనూ మార్పులు చేసుకున్నారు.

బైక్‌ని ఎలా బేలన్స్ చేయాలనే విషయంతో ప్రారంభమైన వారి ప్రాక్టీస్ అందరినీ ఆశ్చర్యపరిచే, అబ్బురపరిచే విన్యాసాలు చేసే వరకూ వచ్చింది. ఎవరైనా ఏదైనా ఒక కృతనిశ్చయం తీసుకుంటే దానిని సాధించేందుకు భయం ఎప్పుడూ అడ్డంకి కాదనే విషయాన్ని ఈ మహిళలు మరోమారు నిరూపించారు. శిక్షణా సమయంలో చాలామంది గాయపడ్డారు కూడా. అయినా వారి పట్టుదల, స్ఫూర్తి ఏ మాత్రం సడలలేదు.

మహిళా బృందం చేత పరేడ్‌లో బైక్ విన్యాసాలు చేయించాలనే ఆలోచన మాత్రం బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్ కె.కె.శర్మదే. ఎప్పుడూ చేస్తున్నట్టుగా పురుషుల చేత కాకుండా మహిళా బైకర్లతో ఈ విన్యాసాలు చేయించాలనుకున్నారాయన. తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేశారు.

ఈ మహిళా బైకర్ల బృందం రేపు జరిగే గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో 'పిరమిడ్', ఫిష్ రైడింగ్, శక్తిమాన్, బుల్ ఫైటింగ్, సీమ ప్రహరి లాంటి ఎన్నో రకాల విన్యాసాలను ప్రదర్శించనుంది.

త్రివిధ దళాలకు (ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్) చెందిన మహిళల బృందం మూడేళ్ళ క్రితం 2015లోనే పాల్గొంది. అయితే 350 సీసీ రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ మోటార్ బైక్‌లతో మహిళలు విన్యాసాలు చేయనుండడం మాత్రం ఇదే తొలిసారి.

రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఈ గణతంత్ర దినోత్సవ వేడుకలకు అతిథులుగా హాజరుకానున్న ఆసియా దేశాలకు చెందిన 10 మంది నాయకులు కూడా ఈ విన్యాసాలను నేరుగా తిలకించనున్నారు.

మెదడు చురుగ్గా పనిచేయాలంటే....!



స్తబ్దతగా అనిపిస్తోందా? మెదడు చురుగ్గా పనిచేయడం లేదా? అయితే మీ అలవాట్లు మార్చుకోండి అంటున్నారు ఆరోగ్య నిపుణులు. కొన్ని రకాల అలవాట్లు మెదడుని చురుగ్గా ఉంచితే మరికొన్ని రకాల అలవాట్లు మెదడు ఏ పనీ చేయకుండా మొద్దుబారుస్తాయి. ఇందులో తెలుసుకోవలసిన అతి ముఖ్యమైన విషయం స్మార్ట్‌ఫోన్ వాడకం. స్మార్ట్‌ఫోన్‌ను అతిగా వినియోగిస్తున్నారా? అయితే మీ ఆనందాన్ని మీరు చేతులారా దూరం చేసుకున్నట్టే. ఇందులో ఉన్న దుష్ప్రభావాలు అలాంటివి మరి. ఈ అలవాటు ఉంటే వెంటనే మార్చుకోండి. స్మార్ట్‌ఫోన్‌కి సాధ్యమైనంత దూరంగా ఉండండి. ఇంకా మెదడును చురుకుగా ఉంచుకోవాలనుకుంటే మార్చుకోవాల్సిన అలవాట్లు ఇవీ. ఉదయం పూట టిఫిన్‌ని అస్సలు మానేయవద్దు. దీంతో రక్తంలో చక్కెర స్థాయిలు పడిపోతాయి, ఈ కారణంగా మెదడుకి కావలసినంత ఆక్సిజన్ అందదు. టిఫిన్ తినకపోవడం వల్ల ఎంత నష్టమో అతిగా తినడం వల్ల కూడా అంతే నష్టం. అతిగా తినడం వల్ల కూడా మెదడు మొద్దుబారిపోతుంది. సరిగ్గా పనిచేయదు. నిద్ర లేకుండా పనిచేయవద్దు. నిద్ర మెదడును శక్తివంతం చేస్తుంది. నిద్ర లేకుండా పనిచేస్తే మెదడులోని కణాలు చచ్చుబడిపోయే అవకాశం ఎక్కువ.

పంచదార ఎక్కువ వాడే అలవాటు ఉందా? అయితే దీనిని మార్చుకోవాల్సిందే. పంచదార ఎంత తక్కువ వాడితే అంత మంచిది. పంచదార వాడకం ఎక్కువైతే ఆహారంలోని పోషకాలను శరీరం గ్రహించలేదు. పోషకాహార లేమి మనిషిని నిస్సత్తువగా చేస్తుందనే విషయం తెలిసిందే. పంచదార మనిషిలోని చలాకీతనాన్ని హరించేస్తుంది. ఇక చివరగా చెప్పుకోవలసిన విషయం. తలగడలో తల దాచుకుని పడుకునే అలవాటు ఉందా? అయితే వెంటనే మానుకోండి. ఎందుకంటే దీనివల్ల మెదడుకి ఆక్సిజన్ బదులుగా మీరు వదిలిన కార్బన్ డై ఆక్సైడ్ అందుతుంది. అది అనారోగ్యానికి దారితీస్తుంది. అనారోగ్యంగా ఉన్నప్పుడూ కొంతమంది పనిచేస్తుంటారు. ఇది మంచి అలవాటు కాదు. మెదడు పనిచేయవద్దని సంకేతాలిచ్చినప్పుడు విశ్రాంతి తీసుకోవడమే మంచిది. లేదంటే తీవ్ర అలసట మరింత ముంచేస్తుంది. ఈ పరిస్థితుల్లో మెదడులోని కణాలు పనిచేయలేక మొరాయిస్తాయి. ఇలాంటి అలవాట్లను మానుకోండి, మిమ్మల్ని మీరు మార్చుకోండి. మీ మెదడును చురుకుగా ఉంచుకోండి.

వసంత పంచమి ఉత్సాహం!





జరిగిన కథ

దేవుడేదిస్తే - కాయ అయితే కాయ - పండైతే పండు - దాన్నే కళ్ళకద్దుకుని - తృప్తిపడడం స్త్రీ స్వభావం. నూరు సంవత్సరాలు - వెయ్యి సంవత్సరాలు - అయనాలు, యుగాలు - అనంతకాలం - ఇలా చరిత్రాత్మకంగా ఆలోచించడం స్త్రీ నైజంకి విరుద్ధం. అంచేతే మనవాళ్ళు - బాలాత్రిపురసుందరిని శక్తిగా పూజించినా, - బ్రహ్మనే సృష్టికర్తగా చేశారు. ఆర్యులు సింధునదీతీరాన్ని ఏ కొద్ది శతాబ్దాలపాటో సమష్టిగా జీవించినా - ఆర్యావర్తంలో స్థిరనివాసం ఏర్పరచుకోగానే - సంఘ జీవనంలోనూ, కుటుంబజీవనంలోనూ - పురుషునికీ ప్రాముఖ్యత ఇచ్చి - సమాజాలు - రాజ్యాలు - ధర్మాలు - ఏర్పరుచుకున్నారు. శాంతంతో ఈ మాట చెప్పి లాభంలేదు - ఒకమాటు నన్ను "కొరడుబారిన కాపిటలిస్టు" అంది!....

(నిన్నటి సంచిక తరువాయి)

పాపాయంటే నాకు ప్రాణం. శాంతం ఆసుపత్రిలో వున్న నెల్లాళ్ళూ - నా మంచందగ్గిర తన వుయ్యాలమంచం వేయిస్తేనే గాని పడుకునేది కాదు. ఆ నెల్లాళ్ళూ 'అమ్మ' అన్నమాట మర్చేపోయింది - ఎంతసేపూ "నాన్న - నాన్న" అనే. అయినా యేముంది - మరి పది పదిహేనేళ్ళయాక - యీ చెట్టునుంచి రెక్కలు కట్టుకుని ఎగిరిపోయి - మరో చెట్టుమీద గూడు కట్టుకుంటుంది.

డాక్టరు గురుమూర్తి మొదలియార్‌గారిని తరిచి తరిచి అడిగేను - శాంతం వంట్లో అంతర్గతంగా మరేం జబ్బు లేదు కదా అని. ఎంతమాత్రం లేదు - అప్పుడు లాఠీ ఛార్జీలో దెబ్బలు తగలడం వల్ల లోపలి అవయవాలు ఇంకా పచ్చిగానే వున్నాయి. అవి అదరకుండా మాత్రం చూసుకుంటే - మరేం భయంలేదు. ప్రమాదం అంతకంటే లేదు అని చెప్పాడు. శస్త్రం చేసిన వైద్యులు ఇద్దరుకూడా అలాగే అన్నారు. అంచేత నేనెంత మాత్రం బాచిగాడిమీద ఆశ వదులుకోలేదు.

అయినా యోగించాలె! అంచేతే మన పూర్వులు సుపుత్ర జననం కోసం ఎంతో తాపత్రయపడేవారు. యాత్రలు, ఉపవాసాలు, తపస్సులు చేసేవారు. జాతకఫలం - నక్షత్రబలం - ముహూర్త విశేషం - వ్రతఫలం అనుకునేవారు. "కర్మ" అంటే అది ఒక సివిల్ ప్రొసీజరు, కోడ్డు అన్నమాట. కర్మానుభవం తప్పించుకోవడానికి - జపాలు, హోమాలు, శాంతులు ఒక మోస్తరు స్టే ఆర్డర్లు. ఇంటరిమ్ ఇంజక్షనులు కౌంటర్లు - అన్నమాట.

కొంచెం మనం నమ్మితే - మిగతాదంతా సబబుగానే వుంటుంది. చాదస్తం - మూఢ నమ్మకం అని కొట్టేడానికి వీలులేదు - ఈ యుద్ధం వచ్చాక - పాశ్చాత్యదేశాల్లో నమ్మకాలు ఎంత పెరిగాయో - సత్యాగ్రహం వచ్చిం తరువాత మనదేశంలో కూడా అంత హెచ్చయాయి... ఈ ఉద్యమం నా ఉసురుకే వచ్చినట్టుంది కాని - అప్పుడూ ఆ లాఠీఛార్జీ మూలాన్ని బాచిగాడు ఎగిరిపోయాడు.



శాంతం త్వరగా ఆరోగ్యవంతురాలు కావాలి. అన్నట్టు లా డిబేటింగు సొసైటీ ఉపన్యాసాలివ్వడానికి జస్టిస్ రాధాశ్యామాణీ వస్తున్నాడు కరాచీనుంచి - గొప్ప సిద్ధాంతి, త్రికాలజ్యోతిష్కుడు, హనుమంతోపాసకుడు అని పేరు - ఆయన్ని సలహా అడుగుతాను - కుంభహారతి చేయించమంటాడేమో. ఒక్కటే చిక్కు - శాంతానికి తెలియకుండా కాండ నడిపించాలి. తెలిసిందంటే మండుతుంది.

69 ఆమె

శుభలేఖ చదివేను. "పెండ్లి పిలుపు - కామాక్షి, వరదరాజం - కొత్తూరి శివసుబ్రమణ్యం: ధాతృనామ సంవత్సర జ్యేష్ఠ. శు॥ శుక్రవారం : సాయంకాలం 6-30 : బండ్లవారి తోట - పరశువాకం" ఎవరు చెప్మా - అనుకున్నాను! ఇంతట్లో శాస్త్రి హడావుడిగా వచ్చి - "లేడీ అయ్యంగారుకి సుబ్బయ్యకి మంచి అందం అయిన వస్తువు ఒకటి పెళ్ళికట్నం ఇవ్వాలి మనం - సాయంకాలం మౌంట్ రోడ్డు వెళదాం" అన్నాడు. అప్పుడు తెలిసింది!

...పెళ్ళికి వెళ్ళాం. లేడీ అయ్యంగారు ఎంతో అందంగా వుంది... అసలే చక్కని మనిషేమో - చిన్న కుంకుంబొట్టు పెట్టుకుంది - మరీ చక్కగా వుంది. "బుగ్గలకీ, పెదిమెలకీ రంగేసుకుంది - ఇంకా ఎవరిని వలలో వేసుకోవడానికని!" అని సీతాచంద్రం అంది కాస్తగట్టిగానే నలుగురూ వినేటట్టూ. అసూయమాట



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

లకేంగాని-అందంమీద బొట్టు మరింత రాణించింది. మొట్టమొదట రోజుల్లో - ఆవిడంటే నాకు బ్రతికివున్నప్పుడు నన్ను ఆమెతో పరిచయం చేసిన రోజుల్లో - ఆవిడంటే నాకూ కొంచెం అసూయగానే వుండెను. ఆవిడంటే భయంగానే వుండెను, ఎప్పుడేనా శాస్త్రికి కళ్ళు జిగేలుమని పోతాయేమోనని. తరువాత ఆవిడ పెనిమిటి పోయి-ఇంకా పరిచయం హెచ్చు అయాక - ఒప్పుకోవాలి కదూ - నాకు అనుమానంకూడా వేస్తూండేది - శాస్త్రివేపు ఆవిడ విసిరే చూపులు-ఇతని హాస్యాలు-చూస్తుండేసరికి. కాని నాదే పొరపాటు - అందం అయిన స్త్రీ - డబ్బుందీ - అందరిలోను కలిసి మెలిసి తిరగడం అంటే సరదా - అలాంటప్పుడు పూజలర్పించేవాళ్ళ కేం కొదువ!

కాని - సుబ్బయ్యకీ ఈవిడికీ పరిచయం అయినట్టు నా కెప్పుడూ తేలీలేదే! అసలు వాళ్ళిద్దరిదీ ఒక జట్టు కానేకాదుకదా?... శిబిరంలో వున్నప్పుడు సుబ్బయ్య - సుబ్బయ్య - అని పిలవడం తప్ప - అసలతని పేరే నాకు తెలియదు. ఆ రోజుల్లో అప్పుడే అతను సబర్మతి ఆశ్రమాన్నించి వచ్చాడేమో - తలంతా తిరుక్షవరం - గోష్పాదం అంత పిలక, పొట్టిగా పంచ - వంటిమీద ఉత్తరీయం - అసలు ఖద్దరు మనిషంటే "ఓయి" అన్నట్టు! కాని - అతని ముఖంలో మంచి నాజూకు - తెలివి వుండేది. వాలంటీర్లందరిలోకి అతనంటే నాకు హెచ్చు ఆప్యాయంగా వుండేది. లాఠీచార్జీ అయింతరువాత మళ్ళీ మొన్న నా జబ్బులో చూశాను - అప్పుడు తెలిసింది అతని పుట్టు పూర్వోత్తరం - శాస్త్రి చెబితే.

వాళ్ళది కొవ్వూరు దగ్గిర పొన్నూరట. తాతముత్తాతలనుంచి మంచి భూవసతివున్న వాళ్ళట. ఆరువేల నియోగులు, కంపెనీ పొగాకు వచ్చిం దగ్గరనుంచీ ఆ వ్యాపారంచేస్తూ బాగా డబ్బు సంపాదించారుట. సుబ్బయ్య పొగాకు వ్యాపారం మీదే ఇంగ్లాండు, అమెరికా వెళ్ళాడుట. తరవాత ఉద్యమంలో చేరడం - జైలున్ను ఉద్యమానికి చాలా డబ్బు సహాయం చేశాడుట. మొన్ననే వ్యాపారం మీద హాంకాంగు, షాంగ్‌హై వెళ్ళి వచ్చాడుట.

అతిథులందరికీ స్వాగతం ఇస్తూ వాళ్ళిద్దరూ ఒకరి ప్రక్కన ఒకరు నిలబడివుంటే నాకు ఎంతో సరదాగా వుండెను. సుబ్బయ్యది పొగాకు వ్యాపారం అయినా కాంగ్రెసు వాడవడంచేత ఖద్దరు మధుపర్కాలే కట్టుకున్నాడు. లేడీ అయ్యంగారు మాత్రం - నాకు లేడీ అయ్యంగారనే వస్తుంది! జార్జెటు చీరె, పట్టుబాడీసున్ను - అచ్చంగా విదేశీబట్టలే. రాజకీయంగా ఇద్దరిదీ వేరు వేరు తోవలుకదా - సంసారం హాయిగా వెళ్ళుతుందా వీళ్ళిద్దరిదీని - అనిపించింది.

మన దేశం పరాధీనంగా వున్నవాళ్ళు కుటుంబాల్లో రాజకీయంగా అభిప్రాయభేదాలుంటే సౌఖ్యానికి ప్రతిబంధకమే. తల్చుకుంటే - నాకే భయంవేస్తుంది - శాస్త్రికి, నాకు ఎప్పుడేం వొచ్చిపడుతుందో అని. ఇప్పుడేంవుంది ఉద్యమం అంతా ఆగిపోయింది. కాని మళ్ళీ ఉద్యమం ప్రారంభం అయితేనో - శాస్త్రీ ఏ ఎడ్వకేటుజనరలో అయి - నేను ఏ జైల్లోనో ఏ కాంగ్రెసుదళంలోనో పనిచేస్తూంటే - అసలు ఇద్దరం కలిసివుండడం ఎలాగు? ప్రేమకంటే అతీతంకదా - దేశం?

లేడీ అయ్యంగారు మంచి గడుసు మనిషి - తెలివితేటలు గలది. అంచేత తప్పకుండా మారిపోతుంది. రాజకీయంగా సుబ్బయ్యకి చేదోడువాదోడుగా వుండి - తన్ని మంచివృద్ధిలోకి తీసుకువస్తుందనే నాకు తోస్తూంది... ఆవేళ లాఠీచార్జీ జ్ఞాపకం వస్తూంది - సుబ్బయ్య, రామస్వామి, నేను! తల్చుకుంటే - అదోజన్మ అనిపిస్తూంది.... వధూవరులు సుఖంగా వుండాల్సింది - అని మనఃపూర్తిగా ఆశీర్వదించేను.

నేనూ, శాస్త్రీ సుఖంగా వున్నాం. "సంసారం సాగరం దుఃఖం" అని మా తాత రోజుకి అధమం పదిసార్లేనా అనేవాడు - మా చిన్నతనంలో. ఆ మాట ఆయనకి ఊతపదం అయిపోయింది. ఆయన ఆ మాట అనేటప్పుడల్లా - మా తొమ్మండుగురు మేనమామలు - మా ఆరుగురు పిన్నిలు మా కళ్ళముందర కనిపించగానే - చిన్న పిల్లలం మేం పకాలని నవ్వేవాళ్ళం!

సంసారం నాకు క్షీరసాగరంగానే వుంది మొత్తంమీద! కాని - శాస్త్రి మాత్రం - మరీ గడుసుగా ప్రవర్తించకుండా వుంటే బాగుండును - అనిపిస్తుంది. అలా ప్రవర్తించినప్పుడు మాత్రం - నిజంగా దుఃఖసాగరమే అనిపిస్తుంది.

కారులో ఇంటికివస్తూ శాస్త్రిని అడిగేను: "పెళ్ళిపెద్దవి కదా, శాస్త్రీ! నాకీ సందేహంతీర్చు. పెళ్ళేమో రిజిస్ట్రారు యెదుట జరిగింది. మళ్ళీ ముహూర్తం, తిథి, వారం, నక్షత్రం, లగ్నం - ఏమిటోయి?"

"దానికేముంది - శాంతం! ఒకటి పద్ధతి - రెండోది సాంప్రదాయం! ఇద్దరి జాతకాలు వేయించి, ముహూర్తం నేనే పెట్టించాను, చిట్టి గూడూరు నరసయ్య సిద్ధాంతి గారిచేత. ఇంతకీ పూర్వాచారం పాటించడంవల్ల మనకేం నష్టంలేదు.

- ఇంకా వుంది.

ఉపరాష్ట్రపతిని తొలగించే అధికారం ఎవరికి ఉంది ?

డీఎస్సీ సోషల్ స్టడీస్

1. లోక్‌సభ స్పీకర్‌కు సంబంధించి కిందివాటిలో సరైన అంశం ఏది ?
ఎ. రాజ్యాంగ నిర్మాతలు స్పీకర్ పదవిని బ్రిటిష్ రాజ్యాంగం నుంచి స్వీకరించారు.
బి. స్పీకర్‌గా ఎన్నికైన వ్యక్తికి లోక్‌సభలో సభ్యత్వం ఉండాలి.
సి. లోక్‌సభ రద్దు అయినప్పటికీ స్పీకర్ పదవి రద్దుకాదు
డి. స్పీకర్ పదవి గురించి 90-99 అధికరణల్లో పేర్కొన్నారు.
1) ఎ, బి, డి 2) ఎ, సి, డి
3) ఎ, బి, సి 4) బి, సి, డి

2. కిందివాటిని జతపరచండి.
జాబితా - x
i. మొరార్జీ దేశాయ్ ii. పి.వి.నరసింహారావు
iii. దేవెగౌడ iv. లాల్ బహదూర్ శాస్త్రి
జాబితా - xx
a. రాజ్యసభ సభ్యత్వంతో ప్రధాని పదవిని చేపట్టినవారు
b. మొదటి కాంగ్రెసేతర ప్రధాని
c. తాష్కెంట్ ఒప్పందంపై సంతకం చేసిన ప్రధాని
d. తొలి తెలుగు ప్రధాని
1. i-b, ii-d, iii-a, iv-c
2. i-a, ii-b, iii-c, iv-d
3. i-c, ii-a, iii-d, iv-b
4. i-c, ii-d, iii-b, iv-a

3. కింది సమావేశాలకు అధ్యక్షత వహించే వారికి సంబంధించి కిందివాటిని జతపరచండి.
జాబితా - x
i. ఉపరాష్ట్రపతి
ii. ప్రధానమంత్రి
iii. స్పీకర్
iv. శాసనమండలి చైర్మన్
జాబితా - xx
a. కేబినెట్ సమావేశం
b. పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశం
c. రాజ్యసభ సమావేశం
d. విధాన పరిషత్ సమావేశం
1. i-c, ii-a, iii-b, iv-d
2. i-c, ii-a, iii-d, iv-b
3. i-b, ii-a, iii-c, iv-d
4. i-a, ii-c, iii-b, iv-d

4. భారత ఉపరాష్ట్రపతులకు సంబంధించి కిందివాటిలో సరైనది ఏది ?
ఎ. ఉపరాష్ట్రపతిని పదవినుంచి తొలగించే తీర్మానాన్ని మొదట రాజ్యసభలో మాత్రమే ప్రవేశపెడతారు.
బి. ఉపరాష్ట్రపతి పదవిని అమెరికా రాజ్యాంగం నుంచి స్వీకరించారు.
సి. సర్వేపల్లి రాధాకృష్ణన్, మహ్మద్ హమీద్ అన్సారీ వరుసగా రెండు పర్యాయాలు ఉపరాష్ట్రపతిగా విధులు నిర్వర్తించారు.
డి. ఉపరాష్ట్రపతి తన పదవికి రాజీనామాను రాష్ట్రపతికి సమర్పిస్తారు.
1. ఎ, బి, డి 2. ఎ, సి, డి
3. ఎ, బి, సి 4. ఎ, బి, సి, డి

5. సమష్టి కుటుంబాల నిర్వహణ బాధ్యతలను ఎవరు చేపడతారు ?
1. పెద్ద కుమారుడు 2. పెద్ద కుమార్తె
3. తల్లి 4. కుటుంబ పెద్ద

6. జతపరచండి.
కేసులు
i. బేలుబారి ii. కేశవానంద భారతి
iii. గోలక్‌నాథ్ iv. మినర్వా మిల్స్
సంవత్సరాలు
a. 1967 b. 1980
c. 1960 d. 1973
1. i-c, ii-a, iii-b, iv-d
2. i-b, ii-c, iii-c, iv-d
3. i-b, ii-a, iii-c, iv-d
4. i-c, ii-d, iii-a, iv-b

7. కిందివారిలో అలీన విధాన (నామ్) రూపకల్పనలో ప్రమేయం లేనివారు ఎవరు ?
1. మార్షల్ టిటో (యుగోస్లేవియా)
2. సుకర్నో (ఇండోనేషియా)
3. సిరిమావో బండారు నాయికే (శ్రీలంక)
4. జవహర్‌లాల్ నెహ్రూ (భారత్)

8. కిందివాటిలో యూఎన్‌వో ప్రత్యేక ఏజెన్సీల్లో జెనీవాలో ప్రధాన కార్యాలయం లేని సంస్థ ఏది ?
1. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్)
2. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌వో)
3. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో)
4. ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంవో)

9. భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు సంబంధించి కిందివాటిలో సరైనది ఏది ?
1. ఉత్తర్‌ప్రదేశ్ నుంచి రాష్ట్రపతి అయిన తొలి వ్యక్తి.
2. భారతీయ జనతాపార్టీ నుంచి రాష్ట్రపతి అయిన తొలి వ్యక్తి
3. దేశంలో రెండో దళిత రాష్ట్రపతి
4. వ్యక్తులపరంగా 14, ఎన్నిక పరంగా 15వ రాష్ట్రపతి
1. బి మాత్రమే 2. సి మాత్రమే
3. ఎ, సి 4. ఎ, బి, సి, డి

10. 'మానవుడికి సుఖప్రదమైన, గౌరవప్రదమైన జీవనాన్ని ప్రసాదించడమే లక్ష్యంగా కలిగిన కుటుంబాలు, గ్రామాల సముదాయమే రాజ్యం' అని రాజ్యాన్ని నిర్వచించినవారు ?
1. బ్లంట్ షీ 2. గార్నర్
3. బీన్ బోడిన్ 4. అరిస్టాటిల్

11. భారత రాజ్యాంగ రూపకల్పనకు పట్టిన కాలం?
1. 36 నెలల 18 రోజులు 2. 34నెలల 18 రోజులు
3. 35 నెలల 18 రోజులు 4. 37 నెలల 18 రోజులు

12. కింది వ్యాఖ్యల్లో సరైనవి ఏవి ?
ఎ. పార్లమెంటరీ ప్రభుత్వాన్ని 'బాధ్యతాయుత ప్రభుత్వం' అని కూడా పిలుస్తారు.
బి. అధ్యక్ష తరహా ప్రభుత్వానికి మరోపేరు 'ఏక సభ్య కార్యనిర్వాహక ప్రభుత్వం'
సి. పునరాయనం అనేది పరోక్ష ప్రజాస్వామ్య సాధనం
డి.



రాజ్యాంగం అంటే ప్రభుత్వ రూపం- స్టీఫెన్ లీకాక్
1. బి, సి 2. ఎ, సి
3. బి, డి 4. ఎ, బి, డి

13. కిందివాటిలో పంచశీల సూత్రం కానిది ఏది ?
1. రాజ్యాల సమగ్రతను, సార్వభౌమాధికారాన్ని పరస్పరం గౌరవించడం
2. రాజ్యాల పరస్పర దురాక్రమణకు పాల్పడకుండా ఉండటం
3. ఇతర రాజ్యాల ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం
4. ఇతర రాజ్యాల ఆంతరంగిక వ్యవహారాల్లో జోక్యం చేసుకోకుండా ఉండటం

14. ఏ సభలో సభాపతి ఆ సభలో సభ్యుడిగా ఉండరు ?
1. విధానసభ 2. రాజ్యసభ
3. లోక్‌సభ 4. పైవేవీ కాదు

15. అలీన దేశాల ఏడో శిఖరాగ్ర సమావేశం 1983లో భారత్‌లోని ఏ నగరంలో నిర్వహించారు ?
1. బెంగళూరు 2. ఢిల్లీ
3. హైదరాబాద్ 4. ముంబయి

16. కలకత్తా, మద్రాస్, బొంబాయి హైకోర్టులను ఏ చట్టం ద్వారా ఏర్పాటు చేశారు ?
1. రెగ్యులేటింగ్ చట్టం-1773
2. చార్టర్ చట్టం-1833
3. కౌన్సిల్ చట్టం-1861
4. భారత ప్రభుత్వ చట్టం-1858

17. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు సంబంధించి కిందివాటిలో సరికానిది ఏది?
1. రాజ్యసభ సభ్యత్వంతో ప్రధాని పదవిని చేపట్టిన నాలుగో వ్యక్తి
2. ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా పనిచేసి ప్రధాని అయిన రెండో వ్యక్తి
3. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టారు.
4. పంజాబ్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు.

18. కిందివాటిలో బ్రిక్స్‌లో సభ్యత్వం లేని దేశం ఏది ?
1. దక్షిణాఫ్రికా 2. బ్రెజిల్
3. భారత్ 4. భూటాన్

19. రాజ్యసభ అధ్యక్షుడికి సంబంధించి కిందివాటిలో సరికానిది ఏది ?
1. ఓటువేసే హక్కు ఉండదు
2. ఇతర సభ్యుల మాదిరిగా ఒక ఓటు ఉంటుంది
3. సమానంగా ఓట్లు వచ్చిన సందర్భంలో మాత్రమే ఓటు ఉంటుంది
4. సవరణ బిల్లుల విషయంలో మాత్రమే ఓటు ఉంటుంది.

20. బి.ఆర్.అంబేద్కర్ ముసాయిదా రాజ్యాంగంలో ఎన్ని ఆర్టికల్స్ ఉన్నాయి ?
1. 314 2. 315
3. 316 4. 317

21. జతపరచండి
వ్యక్తులు
i. గ్రాన్‌విల్లే ఆస్టిన్ ii. హెచ్.వి.కామత్
iii. ఎం.వి.పైలీ iv. కె.సి.వేర్
భారత రాజ్యాంగంపై వ్యాఖ్యానం
a. న్యాయవాదుల స్వర్గం
b. అందమైన అతుకుల బొంత
c. ఐరావతం d. అర్ధ సమాఖ్య
1. i-c, ii-a, iii-b, iv-d
2. i-b, ii-c, iii-a, iv-d
3. i-b, ii-a, iii-c, iv-d
4. i-a, ii-c, iii-b, iv-d

22. భారత రాష్ట్రపతులు - వారి ప్రత్యేకతలను జతపరచండి.
జాబితా - x
i. హిదయతుల్లా ii. వి.వి.గిరి
iii. జాకీర్ హుస్సేన్ iv. నీలం సంజీరెడ్డి
జాబితా - xx
a. భారత ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసి రాష్ట్రపతి పదవిని చేపట్టినవారు
b. తాత్కాలిక రాష్ట్రపతిగా పనిచేసిన తొలి వ్యక్తి
c. తొలి ముస్లిం రాష్ట్రపతి
d. ఏకగ్రీవంగా ఎన్నికైన రాష్ట్రపతి
1. i-b, ii-d, iii-a, iv-c
2. i-a, ii-b, iii-c, iv-d
3. i-c, ii-a, iii-d, iv-b
4. i-a, ii-b, iii-c, iv-d

23. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శుల్లో రెండు పర్యాయాలు పనిచేసినవారు ఎవరు ?
1. ట్రిగ్వేలి (నార్వే) 2. యూథాంట్ (బర్మా)
3. డాగ్ హామర్ జోల్డ్ (స్వీడన్) 4. బ్రూత్రోస్ బూత్రోస్ ఘాలి (ఈజిప్ట్)

24. ఉపరాష్ట్రపతిని తొలగించే అధికారం ఎవరికి ఉంది ?
1. పార్లమెంట్ 2. రాష్ట్రపతి
3. లోక్‌సభ 4. పైవేవీ కాదు

25. అవినీతి నిరోధక చట్టాన్ని ఎప్పుడు రూపొందించారు ?
1. 1985 2. 1988
3. 1990 4. 1919

26. భారత రాజ్యాంగాన్ని రూపొందించినప్పుడు అందులో ఎన్ని ఆర్టికల్స్, షెడ్యూళ్లు, భాగాలు ఉన్నాయి ?
1. 395 ఆర్టికల్స్, 6 షెడ్యూళ్లు, 12 భాగాలు
2. 395 ఆర్టికల్స్, 8 షెడ్యూళ్లు, 21 భాగాలు
3. 395 ఆర్టికల్స్, 12 షెడ్యూళ్లు, 8 భాగాలు
4. 395 ఆర్టికల్స్, 8 షెడ్యూళ్లు, 22 భాగాలు

27. అలీనోద్యమం మొదటి శిఖరాగ్ర సమావేశం 1961లో యుగోస్లావియాలోని బెల్‌గ్రేడ్‌లో జరిగితే, 2015లో 17వ శిఖరాగ్ర సమావేశాన్ని ఎక్కడ నిర్వహించారు ?
1. కౌలాలంపూర్ (మలేషియా) 2. హవానా (క్యూబా)
2. టెహ్రాన్ (ఇరాన్) 4. కారకాస్ (వెనిజులా)

28. కిందివాటిలో సరైంది ఏది ?
ఎ. రాష్ట్రపతి తన రాజీనామాను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి సమర్పిస్తారు.
బి. రాష్ట్రపతి తన రాజీనామాను ఉపరాష్ట్రపతికి సమర్పిస్తారు.
సి. రాష్ట్రపతిని పార్లమెంట్ మహాభియోగ తీర్మానం ద్వారా తొలగిస్తుంది.
డి. ప్రధానమంత్రిని రాష్ట్రపతి తొలగిస్తారు.
1. బి, సి 2. ఎ, సి
3. బి, డి 4. బి, సి, డి

29. సైమన్ కమిషన్ ముఖ్య ఉద్దేశం?
ఎ. 1919 చట్టం ద్వారా ప్రవేశపెట్టిన సంస్కరణలను సమీక్షించడం
బి. డోమినియన్ ప్రతిపత్తిని సమీక్షించడం
1. ఎ మాత్రమే 2. బి మాత్రమే
3. ఎ, బి 4. ఏదీ కాదు

30. కిందివారిలో రాజ్యాంగ పరిషత్ సలహాదారుడిగా ఎవరు వ్యవహరించారు ?
1. బెనగల్ రామారావు 2. బెనగల్ నరసింహారావు
3. బెనగల్ నరేంద్ర 4. ఎవరూ కాదు

31. CTBT ని విస్తరించండి.
1. Common Treatment for Bad Terrorists
2. Comprehensive Nuclear Test Ban Treaty
3. Conclusive Test Ban Treaty
4. Community Test Base Treatment

32. పబ్లిక్ ఆస్తికి ఉదాహరణ ?
1. విద్యుచ్ఛక్తి 2. సముద్ర నీరు
3. వార్తాపత్రిక 4. జనరేటర్

33. 'మున్సిపల్ వ్యవస్థకు కళ్లు, చెవులు, చేతులు' అని వేటిని పేర్కొంటారు ?
1. మున్సిపల్ కమిషనర్లు 2. ఆర్థిక వనరులు
3. పన్నులు, ప్రణాళికలు 4. స్థాయీ సంఘాలు

34. రాజ్యం అనే పదం కింద వాటిలో ఏ భాష పదంతో సంబంధం కలిగి ఉంది ?
1. లాటిన్ 2. గ్రీక్
3. ట్యూటానిక్ 4. జర్మన్

35. కిందివారిలో ముసాయిదా కమిటీలో సభ్యుడు కానివారు ఎవరు ?
1. టి.కృష్ణమాచారి 2. ఎన్.మాధవరావు
3. కె.ఎం.మున్షీ 4. రాజేంద్రప్రసాద్

36. రాజ్యాంగ పరిషత్ చిహ్నం?
1. సింహం 2. ఐరావతం
3. మేషం 4. వరాహం

37. 'నాగరికతకు ఊయల లాంటిది' అని దేన్ని పేర్కొంటారు ?
1. ప్రభుత్వం 2. సమాజం
3. కుటుంబం 4. సంస్కృతి

38. 'రాజనీతి శాస్త్ర పితామహుడి'గా ఎవరిని పేర్కొంటారు ?
1. సోక్రటీస్ 2. అరిస్టాటిల్
3. ప్లేటో 4. మాకియావెల్లి

జవాబులు

1. 3	2. 1	3. 1	4. 4
5. 4	6. 4	7. 3	8. 1
9. 4	10. 4	11. 3	12. 4
13. 3	14. 2	15. 2	16. 3
17. 4	18. 4	19. 3	20. 2
21. 2	22. 4	23. 2	24. 1
25. 2	26. 4	27. 4	28. 1
29. 3	30. 2	31. 2	32. 2
33. 4	34. 3	35. 4	36. 2
37. 3	38. 2		

ఎస్‌బీఐలో 8301 జూనియర్ అసోసియేట్ పోస్టులు



స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) జూనియర్ అసోసియేట్ (కస్టమర్ సపోర్ట్ అండ్ సేల్స్) పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది.

ఖాళీల వివరాలు..

రెగ్యులర్ ఖాళీలు : 7200 (అన్ని వర్గాలు కలిపి)
బ్యాక్‌లాగ్ ఖాళీలు : 1101 (ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు మాత్రమే)
మొత్తం : 8301
తెలుగు రాష్ట్రాల్లో ఖాళీలు..
అమరావతి సర్కిల్ పరిధి: 400 ; హైదరాబాద్ సర్కిల్ పరిధి: 110
(బ్యాక్‌లాగ్ విభాగంలో 145 ఎస్సీ కేటగిరీ ఖాళీలు ఉన్నాయి).
గమనిక : అభ్యర్థులు ఏదైనా ఒక రాష్ట్రానికి మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.
అర్హత : 2018 జనవరి 1 నాటికి గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి బ్యాచిలర్ డిగ్రీ లేదా కేంద్ర ప్రభుత్వం గుర్తించిన తత్సమాన విద్యార్హత ఉండాలి. 2018 జనవరి 1 నాటికి ఇంటిగ్రేటెడ్ డ్యూయల్ డిగ్రీ (ఐడీడీ) పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
వయసు : 2018 జనవరి 1 నాటికి 20-28 ఏళ్లు. (1990 జనవరి 2 - 1998 జనవరి 1 మధ్య జన్మించి ఉండాలి). ఎస్సీ, ఎస్టీలకు 5 ఏళ్లు; ఓబీసీలకు 3 ఏళ్లు; పీడబ్ల్యూడీ అభ్యర్థులకు 10 ఏళ్ల పాటు గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు ఉంటుంది. వీరితో పాటు ప్రభుత్వం గుర్తించిన ఇతర మినహాయింపు వర్గాలకు నిబంధనల మేరకు వయో సడలింపు ఉంది.
ఎంపిక ప్రక్రియ : ఎంపిక ప్రక్రియలో మొత్తం 3 దశలుంటాయి. ఇందులో భాగంగా మొదట ప్రిలిమినరీ ఆన్‌లైన్ టెస్ట్ ఉంటుంది. ఇందులో నిర్దేశిత మార్కులు సాధించిన వారికి ఆన్‌లైన్‌లో మెయిన్ పరీక్ష నిర్వహిస్తారు. ఇందులోనూ కటాఫ్ మార్కులు సాధించిన అభ్యర్థులకు తుదిగా తాను ఎంచుకున్న అఫిషియల్/ స్థానిక భాష సంబంధిత పరీక్ష ఉంటుంది. దీనిలో రాష్ట్ర అధికార భాషను రాయడం, మాట్లాడటం, అర్థం చేసుకునే నైపుణ్యాలను పరీక్షిస్తారు. పదో తరగతి/ ఇంటర్‌లో సదరు సబ్జెక్టును చదివి ఉంటే ఎటువంటి భాష ప్రావీణ్య పరీక్షలు లేకుండానే ఎంపిక చేస్తారు.
ప్రిలిమినరీ ఎగ్జామినేషన్ : ఆన్‌లైన్ విధానంలో 100 మార్కులకు ఉంటుంది. ప్రశ్నలు మల్టిపుల్ చాయిస్ విధానంలో ఉంటాయి. పరీక్ష సమయం 60 నిమిషాలు. ప్రతి కేటగిరీ నుంచి ఖాళీలకు 10 రెట్ల మందిని మెయిన్ పరీక్షకు ఎంపిక చేస్తారు.
మెయిన్ : పరీక్ష ఆన్‌లైన్ విధానంలో ఉంటుంది. ప్రశ్నలను మల్టిపుల్ చాయిస్ విధానంలో ఉంటాయి. మొత్తం 190 ప్రశ్నలు 200 మార్కులకు ఉంటుంది. సమయం 2.40గంటలు.
ప్రిలిమినరీ, మెయిన్ పరీక్షల్లో సబ్జెక్ట్‌వైజ్‌గా ప్రత్యేకంగా సెక్షనల్ సమయం ఉంటుంది. రుణాత్మక మార్కులు ఉంటాయి. తుది ఎంపికలో ప్రిలిమ్స్‌లో సాధించిన మార్కులను పరిగణలోకి తీసుకోరు.

ముఖ్య సమాచారం

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేది : 2018 ఫిబ్రవరి 10
ఫీజు : ఎస్సీ, ఎస్టీ, ఎక్స్‌సర్వీస్ కేటగిరీ అభ్యర్థులకు దరఖాస్తు ఫీజు రూ.100; జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.600.
ప్రిలిమ్స్ టెస్ట్ : 2018 మార్చి/ ఏప్రిల్
మెయిన్ పరీక్ష : 2018 మే 12
వెబ్‌సైట్: www.sbi.co.in/career

విశాలాంధ్ర బిజినెస్

21.66 ▲ సెన్సెక్స్	2.30 ▲ నిఫ్టీ	250 ▲ బంగారం (విజయవాడ)	800 ▲ వెండి	డాలరు Vs రూపాయి	ముడి చమురు ▲
36,161.64	11,086.00	28,850 (22 క్యారెట్లు, 10 గ్రాములు)	40,200 (కిలో (రూపాయల్లో))	63.69	69.96 (బ్రెంట్ ధర (డాలర్లలో..))

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
ఎస్‌బీఐ	330.60	3.62
అదానీ పోర్ట్స్	451.55	2.41
టీసీఎస్	3,254.80	2.38
డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్	2,611.80	1.89
ఎస్ బ్యాంక్	366.00	1.66

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
భారతి ఎయిర్‌టెల్	491.00	-6.51
టాటా మోటార్స్	417.75	-3.46
ఐసీఐసీఐ బ్యాంక్	359.10	-2.60
టాటా మోటార్స్(డీ)	238.60	-2.20
టాటా స్టీల్స్	780.95	-2.13

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	63.84	63.69
యూరో	78.04	78.58
పౌండ్	88.50	89.75
ఆస్ట్రేలియా డాలర్	51.01	51.33
సింగపూర్ డాలర్	48.34	48.54

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	29,590	31,647
చెన్నై	28,870	30,877
బెంగళూరు	28,290	30,257
ముంబై	29,590	31,647
విజయవాడ	28,850	31,400

నష్టాల్లో విజయ బ్యాంకు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ విజయ బ్యాంకు డిసెంబరు 31,2017 నాటికి ముగిసిన మూడవ త్రైమాసికంలో 79.56 కోట్ల నికరలాభంతో 65.45 శాతం క్షీణించిందని తాజా నివేదిక వెల్లడించింది. 2016-17 సంవత్సరంలో అక్టోబరు-డిసెంబరు త్రైమాసికానికి రూ.230.28 కోట్లు నికరలాభాన్ని నమోదుచేసింది. బ్యాంకు మొత్తం ఆదాయం 7.09శాతం క్షీణించి రూ.3450.81 కోట్లుకు పరిమితమైంది. గత సంవత్సరం ఇదే కాలానికి రూ.3714.37 కోట్లు నమోదుచేసినట్లు బిఎస్ఇ ఫైలింగ్‌లో విజయబ్యాంకు వెల్లడించింది. ఈ త్రైమాసికంలో విజయబ్యాంకు (పన్ను మినహా) నిబంధన 62.35శాతం పెరిగి రూ.676.92 కోట్లు కాగా,గత ఏడాది రూ.416.95 కోట్లు నమోదుచేసింది. బ్యాంకు స్థూల నిరర్ధక ఆస్థులు ఇదే కాలానికి 6.17శాతం పెరిగగా గత సంవత్సరం ఇదే కాలానికి 6.98శాతం నమోదుచేసింది. నికర ఎన్‌పీలు కూడా ఈ త్రైమాసికంలో 3.99శాతానికి పడిపోయాయి.విజయ బ్యాంకు షేర్లు 0.87శాతం వద్ద ట్రేడయ్యి బిఎస్ఇ రూ.68.45 నమోదు చేసింది.

టీసీఎస్ మార్కెట్ విలువ

రూ.6లక్షల కోట్లు

న్యూఢిల్లీ: ఐటీ దిగ్గజ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ అరుదైన ఘనత సాధించింది. ఈ కంపెనీ మార్కెట్ విలువ రూ.6లక్షల కోట్ల మైలురాయిని బుధవారం చేరుకోవడంతో టీసీఎస్ మార్కెట్ విలువ రూ. 6,12,696.46కోట్లుగా నమోదైంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ తర్వాత ఈ మైలురాయిని చేరుకున్న రెండో కంపెనీ టీసీఎస్ కావడం విశేషం. ఇటీవల రిలయన్స్ కూడా రూ.6లక్షల కోట్ల మైలురాయిని చేరుకుంది. అయితే మార్కెట్ విలువ పరంగా రిలయన్స్‌తో పోలిస్తే టీసీఎస్ దేశంలోనే అత్యంగా విలువగల సంస్థగా నిలిచింది. నేటి మధ్యాహ్నం ట్రేడింగ్‌లో రిలయన్స్ మార్కెట్ విలువ రూ.6,11,096.56కోట్లుగా ఉంది. టీసీఎస్, రిలయన్స్ తర్వాత హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (రూ.5,08,576.16కోట్లు), ఐటీసీ (రూ.3,41,332.79కోట్లు),హెచ్‌డీఎఫ్‌సీ(రూ.3,03,382.63కోట్లు) అత్యంత విలువ గలిగిన కంపెనీల జాబితాలో తొలి ఐదు స్థానాల్లో ఉన్నాయి. ప్రస్తుతం బీఎస్‌ఈ, ఎన్ఎస్ఈలో టీసీఎస్ షేర్లు 2శాతానికి పైగా లాభంతో కొనసాగుతున్నాయి.

మ్యాన్ ట్రక్స్ నుంచి క్లాసిక్ రేంజ్

విశాలాంధ్ర బ్యూరో–హైదరాబాద్: జర్మనీకి చెందిన ప్రముఖ మ్యాన్ ట్రక్స్ ఇండియా తాజాగా బాస్ క్లాసిక్ రేంజ్‌ను ఆవిష్కరించింది. దీనిని రెండు మోడల్స్‌లో తీర్చిదిద్దారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ సమీపంలో గల పీతంపూర్‌లోని మ్యాన్ ట్రక్స్ ఉత్పాదక ప్లాంట్ లో ఈ వాహనాలను తయారుచేశారు. ఈ సందర్భంగా మ్యాన్ ట్రక్స్ ఇండియా చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జార్జ్ మమ్మేర్టెజ్ మాట్లాడుతూ, ఈ కాంప్లినెంట్ బీఎస్ఐవీ సీఎల్ఏ బస్సు మ్యాన్ బ్రాండ్ నుంచి అత్యధిక సామర్థ్యంతో రూపొందిందన్నారు. ప్రయాణికుల రక్షణ, వినియోగ అవసరాలకు అనుగుణంగా దీనిని తీర్చిదిద్దామని, మ్యాన్ కంపెనీ నిత్యం వినూత్న ఉత్పాదనల దిశగా దృష్టి సారిస్తుందన్నారు.

మోటుమర్రి-విష్ణుపురం మార్గంలో

ప్రయాణికుల రైళ్లేవీ!?



జగ్గయ్యపేటలోని రైల్వే యార్డ్

- సిమెంటు, సరుకు రవాణాకే పరిమితం
- 6 నెలల క్రితమే అందుబాటులోకి రైలుమార్గం
- సికింద్రాబాద్-విశాఖ మధ్య 60 కి.మీ. తగ్గనున్న దూరం
- మీనమేషాలు లెక్కిస్తున్న రైల్వేశాఖ
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : దక్షిణ మధ్య రైల్వేలో రాజకీయ జోక్యం, చాలీచాలని నిధులతో రైల్వే ప్రాజెక్టులు నత్తనడకన సాగుతుంటే... పూర్తయిన మార్గాల్లో ప్రయాణికుల రైళ్లను నడిపేందుకు రైల్వేశాఖ మీనమేషాలు లెక్కిస్తోంది. వందలు, వేలాది కోట్ల వ్యయంతో నిర్మించిన కొన్ని మార్గాల్లో నామమాత్రంగానే రైళ్లను నడుపుతోంది. ముఖ్యంగా మోటుమర్రి-జగ్గయ్యపేట-విష్ణుపురం సెక్షన్‌లో సిమెంటుతోపాటు ముడిసరుకు రవాణా రైళ్లు మాత్రమే పరుగులు తీస్తున్నాయి. తమ ప్రాంతాలకు రైలు సదుపాయం వస్తుందని సంతోషించిన రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు ఏళ్లు గడుస్తున్నా ఒక్క రైలు కూడా ఏర్పాటు కాకపోవడంతో తీవ్ర నిరాశ, నిస్పృహలకు లోనవుతున్నారు. ఈ కొత్తమార్గం నవ్యాంధ్రలో కృష్ణాజిల్లా, తెలంగాణలో నల్గొండ జిల్లా మీదుగా వెళుతోంది. జగ్గయ్యపేట పరిసరాల్లోని సిమెంటు పరిశ్రమల కోసం రెండు దశాబ్దాల క్రితమే విజయవాడ-కాజీపేట సెక్షన్‌లోని మోటుమర్రి నుంచి జగ్గయ్యపేటకు నూతనంగా రైలు మార్గాన్ని నిర్మించారు. దీనిని నడికుడి-బీబీనగర్ సెక్షన్‌లో విష్ణుపురంతో అనుసంధానం చేయాలనే ప్రతిపాదనల మేరకు అంచెలంచెలుగా ఈ మార్గాన్ని పూర్తి చేశారు. జగ్గయ్యపేట-మేళ్లచెరువు మధ్య 19 కిలోమీటర్ల మార్గాన్ని 2012 మార్చి 23వ తేదీన ప్రారంభించారు. అలాగే విష్ణుపురం-జాన్‌పహాడ్ మధ్య 11 కిలోమీటర్ల మార్గాన్ని అదే సంవత్సరం జూన్ 22వ తేదీన అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇక మూడో దశలో భాగంగా మేళ్లచెరువు-మట్టంపల్లి మార్గాన్ని 2016 మార్చి 15వ తేదీన, చివరిదశలో మట్టంపల్లి-జాన్‌పహాడ్ మార్గాన్ని 2017 జూలై 19వ తేదీన ప్రారంభించారు. దీంతో మొత్తం 88 కిలోమీటర్ల పొడవు కలిగిన మోటుమర్రి-జగ్గయ్యపేట-విష్ణుపురం మార్గంలో సరుకు రవాణా రైళ్ల రాకపోకలు సాగుతున్నాయి. వాస్తవానికి మోటుమర్రి-జగ్గయ్యపేట మార్గం పూర్తయిన వెంటనే విజయవాడ నుంచి జగ్గయ్యపేటకు ప్యాసింజర్ రైలు నడపాలనే డిమాండు తెరపైకి వచ్చింది. అయితే విజయవాడ-హైదరాబాద్ నేషనల్ హైవేలో ఉన్న జగ్గయ్యపేటకు బస్సులు పెద్ద సంఖ్యలో ఉన్నందున గిట్టుబాటు కాదని రైల్వే అధికారులు అప్పట్లో ప్యాసింజర్ రైళ్లను నడిపేందుకు ఆసక్తి చూపలేదు. మోటుమర్రి-విష్ణుపురం మార్గం 6 నెలల క్రితం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చినం దున విజయవాడ నుంచి జగ్గయ్యపేట, మేళ్లచెరువు, జాన్‌పహాడ్, విష్ణుపురం మీదుగా సికింద్రాబాద్‌కు ప్యాసింజర్‌తోపాటు ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడపాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు. ప్రస్తుతం గుంటూరు, నడికుడి మీదుగా సికింద్రాబాద్, కాజీపేట మీదుగా సికింద్రాబాద్ వైపు నడుస్తున్న ఎక్స్‌ప్రెస్ రైళ్లలో కొన్నింటిని నూతన మార్గం మీదుగా మళ్లించాలని సూచిస్తున్నారు. ఇటీవల గుంటూరు, విజయవాడ డివిజన్లలో పర్యటించిన దక్షిణ మధ్య రైల్వే జీఎం వినోద్ కుమార్ యాదవ్ కొత్త మార్గంలో ప్రయాణికుల రైళ్లను నడిపేందుకు అనుమతించాలని కోరుతూ రైల్వేబోర్డుకు లేఖ రాసినట్లు విలేకరుల సమాశంలో వెల్లడించారు. ప్రస్తుతం విజయవాడ నుంచి కాజీపేట మీదుగా సికింద్రాబాద్‌కు 351కి.మీ., గుంటూరు, నడికుడి మీదుగా అయితే 314 కి.మీ., జగ్గయ్యపేట, విష్ణుపురం మీదుగా 319 కి.మీ. దూరం ఉంది. ఈ మార్గం మీదుగా రైళ్లను నడిపినట్లయితే సికింద్రాబాద్- విశాఖపట్నం మధ్య సుమారు 60 కి.మీ. వరకూ దూరం తగ్గుతుంది. తద్వారా సమయంతోపాటు టికెట్ చార్జీలు ఆదా కాగలవన్న అశాభావాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు.

ఎర్రగుంట్ల మీదుగా కడపకు...

అమరావతి రాజధానిని రాయలసీమతో రోడ్డు, రైలు, విమాన మార్గాలతో అనుసంధానం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు పదే పదే చెబుతున్నారు. కడప, కర్నూలు, అనంతపురం నుంచి అమరావతికి ఎక్స్‌ప్రెస్ హైవేలను నిర్మించాలని ఇప్పటికే నిర్ణయించారు. విజయవాడ నుంచి అనంతపురం జిల్లాలోని ధర్మవరం మధ్య 2016 జూలై 12న ట్రైవీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించారు. నంద్యాల-ఎర్రగుంట్ల మధ్య దాదాపు రూ. 1000 కోట్ల వ్యయంతో 123 కి.మీ. పొడవుతో నిర్మించిన నూతన మార్గం 2016 ఆగస్టు 23న అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం రెండు ప్యాసింజర్ రైళ్లు, విజయవాడ-ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌ను ఈ మార్గం మీదుగా మళ్లిస్తున్నారు. ఇన్నాళ్లు కడపకు రైలులో వెళ్లాలంటే గుంతకల్, గుత్తి మీదుగా చేరుకోవాల్సిన పరిస్థితి. అయితే నంద్యాల-ఎర్రగుంట్ల మార్గం నిర్మాణంతో గుంతకల్, గుత్తి వెళ్లకుండానే నేరుగా కడపకు చేరుకునే సదుపాయం కలిగింది. ఈ నేపథ్యంలో విజయవాడ నుంచి నేరుగా కడపకు ఎక్స్‌ప్రెస్ రైలును నడపాలని పలువురు డిమాండు చేస్తున్నారు. నంద్యాల-ఎర్రగుంట్ల సెక్షన్‌లోని మద్దూరు, బనగానపల్లె, కోయిలకుంట్ల, సంజమల, నొస్సం, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు ప్రాంతాలకు చెందిన వారు తక్కువ సమయంలోనే రాజధాని చేరేందుకు అవకాశం కలుగుతుందని సూచిస్తున్నారు. ఈ విషయమై ప్రజాప్రతినిధులు రైల్వేమంత్రిత్వశాఖతో చర్చలు జరపాలని కోరుతున్నారు.

విజ్ఞానం

22శాతం భారతీయుల్లో

మలబద్ధక సమస్య



22శాతం మంది భారతీయులు మలబద్ధకంతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. వీరు ఈ విషయాన్ని బహిర్గతంగా చెప్పుకోడానికి సంశయిస్తారు. ఇది చాలా తీవ్రమైన విషయం అయినప్పటికీ ఈ విషయాన్ని దాచి ఉంచేందుకు ప్రయత్నిస్తున్నట్లు సర్వేలో వెల్లడైంది. ఈ సర్వేలో ముఖ్యంగా కలకత్తా వాసులు కాన్స్టిపేషన్‌కు ఎక్కువగా గురవుతున్నారు. 28శాతం మంది ఈ విషయాన్ని బహిరంగంగా ఒపప్పుకున్నారు. భారతీయ యువతలో 22శాతం మంది కాన్స్టిపేషన్ బారినపడగా, వీరిలో 13శాతం తీవ్రమైన మలబద్ధకంతో పలు సమస్యలకు లోనవుతున్నారు. 6శాతం మంది మలబద్ధకం కారణమైన పలు అనారోగ్యసమస్యలకు లోనవుతున్నట్లు గట్ హెల్త్‌సర్వే వెల్లడించింది. యువతతోపాటు మధ్య వయస్కులు, వయసుపైబడినవారిలో సైతం మలబద్ధకసమస్యలు ఉన్నట్లు తెలుస్తోంది. కలకత్తా ప్రజల జీవనవిధానం, డాక్టర్లను సంప్రదించ కుండా సెల్ఫ్ మెడిటేషన్ ఇది వ్యాధిని మరింత జటిలం చేస్తున్నట్లు వెల్లడైంది. కలకత్తా తరువాతి స్థానంలో చెన్నయ్ 24శాతం ప్రజల్లో ఈ సమస్య మరింత తీవ్రంగాఉంది. ఢిల్లీ వాసులో 23శాతం ఉండటానికి ప్రధాన కారణం జంక్‌ఫుడ్‌ను ఎక్కువగా తీసుకోవడమే...పాట్నా,అహ్మదాబాద్,ముంబై,లక్నో,హైద్రాబాద్ వాసుల్లో ఈ సమస్య ఒకింత తక్కువగానేఉంది. భారతీయులో జలుబు,కాఫ్ తరువాత స్థానం కాన్స్టిపేషన్‌తే..మంచినీరు తీసుకోకపోవడం, సెండెంటరీ లైఫ్‌స్టయిల్ ప్రధానకారణంగాఉన్నాయి.

1.ఆహారంలో ఫైబర్ శాతంఎక్కువగా ఉన్న బెర్రీలను తీసుకోవడం మంచిది. ఒక కప్పు బెర్రీల్లో 8గ్రాముల ఫైబర్ ఉంటుంది. బ్రేక్‌ఫాస్ట్‌లో ఓట్‌మీల్ ఆహారం, కప్పు పెరుగు ఉదరానికి మంచిదని సూచిస్తున్నారు. ముల్‌బెర్రీలు, స్ట్రాబెర్రీలు,గూస్‌బెర్రీలు ఈ కోవలేకే వస్తాయి.

2. విటమిన్ సి అధికంగా ఉన్న కమలాపండ్ల వినియోగంగా కాన్స్టిపేషన్‌కు సమస్యను నివారిస్తుంది. ఫైబర్ అధికంగా ఉండే కమలాలు జీర్ణక్రియకుమంచిదే..

3. గుండెకు ఆరోగ్యాన్ని చేకూర్చే బాదంలో ఉండే ప్రోటీన్లు,ఫైబర్ జీర్ణక్రియకు దోహదంచేస్తాయి. మెగ్నీషియం అధికంగా ఉండే బాదం వినియోగంతో ఇంటెస్టీన్‌లోని గట్ ప్రోబ్లమ్‌సుతొలగిస్తుంది.

4.పొట్టుఉన్న గోధుమపిండికూడా మలబద్ధక సమస్యలను తొలగిస్తుంది. గోధుమలపై ఉన్న పొట్టులో ఉండే ఫైబర్ పలు జీర్ణసమస్యలను నివారిస్తుంది.

జోరు తగ్గిన మార్కెట్లు

- దెరివేటివ్స్ ముగియనుండటంతో మదుపర్ల అప్రమత్తత
- భారీ నష్టాల్లో టెలికాం రంగం



ముంబై:జనవరి దెరివేటివ్స్ గురువారంతో ముగియనుండటం, వచ్చేవారం ప్రవేశపెట్టనున్న బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో మదుపర్లు తీవ్ర అప్రమత్తత పాటించడంతో దేశీయ మార్కెట్లు స్తబ్దతతో ముగిశాయి. గత ఐదు సెషన్లలో రికార్డుల్లో తేలియాడుతున్న మార్కెట్లు బుధవారం జోరు తగ్గినట్లు వెల్లడైంది. మదుపర్లు ట్రేడింగ్‌లో లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో మార్కెట్లు ప్రారంభంనుండే పెద్ద జోరు కనపడకపోవడంతో స్వల్ప లాభాలను నమోదుచేశాయి. బుధవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 21.66 పాయింట్లలాభంతో 0.06శాతంతో 36,161.64 పాయింట్లు నమోదుచేసింది. 50షేర్ల ఎన్ఎస్ఇ నిఫ్టీ 2.3 పాయింట్ల లాభంతో 0.02శాతం 11,086 పాయింట్లకు పరిమితమైంది. ఇంట్రాడేలో సెన్సెక్స్ ర్యాలీని సృష్టించి 36,268పాయింట్లు, నిఫ్టీ 11,110.10పాయింట్లతో అత్యంత గరిష్టాలను నమోదుచేసింది. బిఎస్ఇ సెక్టరల్ సూచీల్లో, ఐటి ఇండెక్స్ 1.53శాతం, పిఎస్‌యు 1.13శాతం, ఎఫ్ఎమ్‌సిజి 0.54శాం టెక్ 0.49శాతం లాభాల్లో ముగిశాయి. కన్స్యూమర్ డ్యూరబుల్స్ ఇండెక్స్ 2.08శాతం,మెటల్ 1.5శాతం, కాపిటల్ గూడ్స్ 0.66శాతం, ఆటో 0.65శాతం నష్టాల్లో నమోదయ్యాయి. సెన్సెక్స్ ప్రధానలబ్దిదారులుగా ఎస్‌బీఐ,ఆదానీ పోర్ట్సు,టిసిఎస్,ఐటిసి, యస్ బ్యాంకు కాగా నష్టాలు నమోదుచేసినవాటిల్లో భారతి ఎయిర్‌టెల్, టాటా మోటార్స్, ఐసిఐసిఐ బ్యాంకు, టాటా స్టీల్, యాక్సిస్ బ్యాంకు ఉన్నాయి. గ్రోత్ ఓరియంటెడ్ రంగాలు అత్యధికంగా నమోదుకాగా, ఐటి. పార్మా రంగాలు తీవ్ర ఒడిదుడుకులకు లోనయ్యాయి. తాజాగా వెల్లడించిన త్రైమాసిక ఫలితాలతో మదుపరులు ఐటిరంగంవైపు మళ్లినట్లు తెలుస్తోంది. గత పదిరోజులుగా సానుకూలంగా స్పందించిన ట్రేడింగ్, బడ్జెట్ సమావేశానికి ముందుగా కొంత లాభాలను నమోదుచేశాయి. నిఫ్టీ పార్మా ఇండెక్స్ వరుసగా నాలుగవ సెషన్‌లో అత్యధికంగా నమోదై 0.5శాతంతో వృద్ధిని నమోదుచేసింది. టెలికాం సర్వీసురంగం భారీగా పడిపోయింది.

టెలికాం దిగ్గజ సంస్థ భారతి ఎయిర్‌టెల్ షేర్లు భారీ నష్టాల్లో నమోదయ్యాయి. ఒక్కో షేరు విలువ 7శాతానికిపైగా పతనమైంది. బిఎస్ఇ బారోమీటర్ 54.30 పాయింట్లు నష్టపోయింది. గోజ్ 1,368.93 పాయింట్లతో ర్యాలీ సృష్టించింది. జపాన్ వెలుపల ఆసియా పసిఫిక్ షేర్లు 0.2శాతం లాభాల్లో ముగిశాయి. యెన్ పటిష్టం కావడంతో జపాన్ నిక్కీ 0.6శాతం నష్టాల్లో ముగిసింది. డౌ జోన్స్ ఇండస్ట్రియల్ యావరేజ్ 3.79 పాయింట్లతో 0.01శాతం, 6.17 పాయింట్ల లాభంతో ఎస్ అండ్ పి 500, నాస్డాక్ కాంపోజిట్ 52.26 పాయింట్లు లాభాల్లో ముగిసాయి.



కార్గిల్ ఫిష్ ఫీడ్ ప్లాంట్ ప్రారంభం

విజయవాడ: భారతదేశంలో ఆక్వాకల్చర్‌కు కేంద్రంగా పేరొందిన ఆంధ్రప్రదేశ్‌లో చేపల మేత తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. విజయవాడ సమీపంలో ప్లాంట్‌ను నెలకొల్పింది. ఇప్పటివరకూ మాల్యూరి ఫుడ్స్ అండ్ ఫీడ్స్ పేరుతో నడుస్తున్న సంస్థను విలీనం చేసుకుంది. ఈ ప్రాంతంలో టోల్ మిల్లర్స్‌తో పని చేయనున్న కార్గిల్ ఏటా 30 వేల టన్నుల చేపల మేతను విక్రయించనుంది. ఈ ప్లాంట్ ఏటా 90 టన్నుల మేతను ఉత్పత్తి చేస్తుంది. రూ.70కోట్లతో ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్ ద్వారా 200 మందికి ఉపాధి లభిస్తుంది. కార్ప్, తిలాపియా తదితర వేడినీటి రకం చేపలకు మేతను ఉత్పత్తి చేస్తారు. ఈ సందర్భంగా కార్గిల్ ఆక్వాన్యూట్రిషన్ -దక్షిణాఫ్రికా మేనేజింగ్ డైరెక్టర్ చాద్ గౌగెర్ మాట్లాడుతూ, భారత దేశంలో ఆక్వారంగా వేగంగా అభివృద్ధి చెందుతోందని, ఆంధ్రప్రదేశ్, బెంగాల్, తమిళనాడు, ఒడిశా రాష్ట్రాల ఆక్వారైతులకు అత్యుత్తమ సేవలు అందించే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు. భారత్‌తో పాటు ఆసియా దేశాల్లో ఆక్వా ఫీడ్ వ్యాపారాన్ని విస్తరించటమే కార్గిల్ లక్ష్యం అన్నారు. త్వరలోనే ప్రపంచ దేశాల్లో భారత్‌కు మంచి ప్రాచూర్యం లభిస్తుందన్నారు. కార్గిల్ ఆక్వా న్యూట్రిషన్ ప్రెసిడెంట్ ఇనార్ వాఘ్నే మాట్లాడుతూ, తమ సంస్థ అత్యుత్తమ నాణ్యమైన మేతను అందిస్తుందని, దీంతో మంచి దిగుబడులు వస్తాయన్నారు. భారతదేశం ఇచ్చిన మంచి అవకాశంతో ఆసియాలోనే తమ సంస్థ కీలక పాత్ర పోషిస్తుందన్నారు.

వాయు కాలుష్య కోరల్లో భారత్

పర్యావరణ నిర్వహణ సూచీలో 177వ స్థానంలో భారత్

న్యూఢిల్లీ: భవిష్యత్‌లో భారత్ వాయు కాలుష్యం కాటుకు గురికాక తప్పేలా లేదు. పట్టణాలు, నగరాల్లో మితిమీరిన వాహనాల వినియోగం.. గ్రామాలు, మారుమూల ప్రాంతాల్లో ఇంకా దర్శనమిస్తున్న కట్టెలు, బొగ్గుల పొయ్యిలు.. ఇలా నిత్యం దేశంలో ప్రతిచోటా గాలి కలుషితమవుతూనే ఉంది. అటవీ ప్రాంతాలు కనుమరుగు కావడం కూడా కాలుష్యానికి మరో కారణం. వాయు కాలుష్యాన్ని అరికట్టేందుకు, అడవుల సంరక్షణకు భారత దేశంలో అమలవుతున్న కార్యాచరణ చాలా తక్కువే. అందుకే పర్యావరణాన్ని రక్షించే దేశాల జాబితాలో మనం అట్టడుగు స్థానంలో ఉన్నాం. 2018 సంవత్సరానికిగానూ.. పర్యావరణ నిర్వహణ సూచీ(ఎన్విరాన్‌మెంటల్ పర్‌ఫార్మెన్స్ ఇండెక్స్-ఈపీఐ) జాబితాలో భారత్ 177వ స్థానంలో ఉంది. మొత్తం 180 దేశాలతో ఈ జాబితా తయారు చేయగా.. మనం చివరి ఐదవ స్థానం సంపాదించడం విచారకరం. 2016తో పోలిస్తే దేశ ర్యాంకు బాగా పడిపోయింది. రెండేళ్ల క్రితం ఈ జాబితాలో భారత్ 141వ స్థానంలో ఉంది. ప్రపంచ ఆర్థిక సదస్సు (డబ్ల్యూఈఎఫ్) సహకారంతో యాలే, కొలంబియా యూనివర్సిటీలు సంయుక్తంగా ప్రతి రెండేళ్లకోసారి పర్యావరణ నిర్వహణ దేశాల జాబితాను విడుదల చేస్తుంటాయి. ఎకో సిస్టమ్, వాయు నాణ్యత, తాగునీరు, పారిశుద్ధ్యం, కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గార శాతం, అడవుల పరిరక్షణ తదితర 24 అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ జాబితాను తయారు చేస్తారు. ఈ ఏడాది విడుదల చేసిన జాబితాలో స్విట్జర్లాండ్ తొలి స్థానం దక్కించుకుంది. ఆ తర్వాత ఫ్రాన్స్, డెన్మార్క్, మాల్టా, స్వీడన్ దేశాలు తొలి ఐదు స్థానాల్లో నిలిచాయి. ఈ జాబితాలో బ్రిటన్ 6, జర్మనీ 13, ఇటలీ 16, కెనడా 25, అమెరికా 27వ స్థానం దక్కించుకున్నాయి. చైనా, పాకిస్థాన్ కంటే భారత్ ఈ జాబితాలో వెనుకబడే ఉన్నది. చైనాకు 120, పాకిస్థాన్‌కు 169వ ర్యాంక్ వచ్చాయి. ఇక బంగ్లాదేశ్ 179, నేపాల్ 176వ స్థానంలో నిలిచాయి. పేద ప్రజల గ్యాస్ కనెక్షన్ల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఉజ్వల యోజన పథకం గురించి ఈ నివేదికలో ప్రస్తావించారు.

రాజకీయ విరాళాలపై ఐటీ ఆంక్షలు

రూ.2వేలకు మించి నగదు విరాళాలు వద్దు



న్యూఢిల్లీ:రాజకీయ పార్టీలకు ఇచ్చే నగదు విరాళాలపై ఆదాయ పన్ను శాఖ (ఐటీ) తాజాగా ఆంక్షలు జారీ చేసింది. ప్రధానంగా నగదు లావాదేవీలను తగ్గించడానికి అన్నట్లుగానే ఈ ఆంక్షలు/సూచనలు ఉన్నాయి. ఈక్రమంలో 'నగదు రహితం- స్వచ్ఛంగా ఉండండి' (గో కాష్‌లెస్ - గో క్లీన్) నినాదంతో ఒక ప్రచార ప్రకటనను ఐటీ శాఖ విడుదల చేసింది. రాజకీయ పార్టీలకు విరాళాలు ఇవ్వాలనుకునే వారంతా రూ.2వేలకు మించి నగదు రూపంలో విరాళాలు చెల్లించ వద్దని మంగళవారం విజ్ఞప్తి చేసింది. అక్రమ నగదు లావాదేవీలను అరికట్టే చర్యల్లో భాగంగా ఈ సూచన చేస్తున్నట్లు చెప్పింది. రాజకీయ పార్టీలకు భారీ మొత్తంలో నగదు విరాళాలు చెల్లించే క్రమంలో అక్రమ నగదు చలామణి అవుతోందని ఐటీ శాఖ తెలిపింది. ఎన్నికల విరాళాల చెల్లింపులకుగాను తాము జారీ చేసే ఎలక్టోరల్ బాండ్లను వినియోగించుకోవాలని వివిధ వర్గాలకు విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపింది.

రాజకీయ విరాళాలకు సంబంధించిన ఈ విధాన నిర్ణయాన్ని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) తీసుకున్న తరువాత ఐటీ శాఖ జారీ చేసిన తొలి సూచన ఇదే. ఏదేని ఒక సందర్భాన్ని లేదా లావాదేవీని పురస్కరించుకుని రోజులో ఒక సారికి మించి ఒక వ్యక్తి నుంచి రూ.2లక్షల నగదు లావా దేవీలను అనుమతించవద్దని సూచించింది. స్థిరాస్తి మార్పిడి/బదలాయింపు లావాదేవీకీ రూ.20వేలకు మించి నగదు చెల్లింపులు /స్వీకారాలు జరపవద్దని సూచించింది. వ్యాపార, వృత్తి నిర్వహణలో భాగంగా జరిగే వ్యయానికి సంబంధించిన చెల్లింపులు జరిపేటపుడు రూ.10వేలకు మించిన నగదు లావాదేవీలు జరపవద్దని సూచించింది.

గోల్డెన్ హార్వెస్ట్ రైస్ బ్రాండ్ ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో–హైదరాబాద్: ఫ్యూచర్ కన్స్యూమర్ లిమిటెడ్ (ఎఫ్‌సిఎల్) సంస్థ "గోల్డెన్ హార్వెస్ట్ రైస్ బ్రాండ్"ను ఆవిష్కరించింది. ఈ రకం బియ్యాన్ని దక్షిణాదిలోని అత్యుత్తమ వరి పొలాల నుండి సేకరిస్తున్నారు. బియ్యంలోని ప్రతి గింజను అత్యుత్తమ స్విస్ సాంకేతికతతో పరిశీలించి, ప్రాసెస్ చేస్తున్నట్లు ఫ్యూచర్ గ్రూప్ సీఈఓ కిశోర్ బియానీ తెలిపారు. దీనికి బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ నటుడు రానా దగ్గుపాటి వ్యవహరిస్తున్నారు. హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో వీరిరువురు పాల్గొన్నారు. ఫ్యూచర్ కన్స్యూమర్ తన బ్రాండ్‌కు సంబంధించి దక్షిణ భారతదేశంలోనే రెండు అతిపెద్ద భారీ చిత్ర నిర్మాణ సంస్థలైన సురేష్ ప్రొడక్షన్, అన్నపూర్ణ స్టూడియోలతో జట్టు కట్టి దక్షిణాది సంస్కృతిలో ఆహారం యొక్క ప్రాధాన్యతపై ఒక యాడ్ చిత్రాన్ని నిర్మించినట్లు బియానీ తెలిపారు. గోల్డెన్ హార్వెస్ట్ రూ.1200 కోట్ల విలువైన బ్రాండ్. తృణధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు, డ్రై ఫ్రూట్ల వంటి పోషకాహార ఉత్పత్తులను అందిస్తోంది. బ్రాండ్ విస్తృత శ్రేణికి చెందిన 350కి పైగా ఆహార ఉత్పత్తులను అందించడం ద్వారా ప్రతి భారతీయ కుటుంబాన్ని చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. గోల్డెన్ హార్వెస్ట్ సోనా మసూరి రైస్ 10కేజీలు, 25 కేజీల ప్యాక్‌లో ఐదు శ్రేణుల్లో లభిస్తున్నాయి.



ఈ శ్రేణుల్లో సుప్రీమ్, పాపులర్, ఎకానమీ, క్లాసిక్, ప్రీమియమ్, స్టాండర్ట్ క్వాలిటీ రైస్ ఉన్నాయి, ఇవి రూ.600 నుంచి రూ.1900 ధరల శ్రేణితో అందుబాటులో ఉన్నాయి. బిగ్ బజార్, నీల్‌గిరి, హెరిటేజ్ స్టోర్లలో ప్రత్యేక కమ్యూనిటీ ఫీడింగ్ కార్యక్రమాలతో స్టోర్లను సందర్శించే వారికి ఈ బియ్యానికి సంబంధించిన ఆహారాన్ని రుచి చూపించడం జరుగుతుందన్నారు. రానా మాట్లాడుతూ, గోల్డెన్ హార్వెస్ట్ సోనా మసూరిపై యాడ్ ఫిల్మ్ చేయడం ఎప్పటికీ తనకు ప్రత్యేకమేనన్నారు.

పాతికేళ్ల కుర్రాళ్ల

బడ్జెట్ హోటల్స్

ఏదైనా కొత్త ప్రాంతానికి టూర్ వెళ్లినప్పుడు అక్కడ మంచి హోటల్స్ ఉన్నాయో లేవో చూస్తాం. ముందుగా వాటిలో రూమ్‌ల ఖరీదు గురించి తెలుసుకుంటాం. ఎక్కువ రోజులు ఉండాల్సివస్తే బడ్జెట్ హోటల్ తప్పనిసరి.. ఐదు నక్షత్రాల హోటల్లో దిగితే పట్టపగలే చుక్కలు కనిపిస్తాయి. ఈ సమస్యకు చెక్ పెట్టాలనుకున్నారు ఇద్దరు యువ ఇంజినీర్లు. ప్రమాణాల విషయంలో రాజీపడకుండా మధ్యతరగతి జీవులకు అందుబాటులలో బడ్జెట్ హోటల్స్ ఏర్పాటు చేశారు. తిరుగులేని పరిశుభ్రత, ఏ చీకూచింతాలేని భద్రత, మర్యాదపూర్వక సిబ్బందిని నిర్వహిస్తూ కస్టమర్లను ఆకట్టుకుంటున్నారు.



మనదేశంలో బడ్జెట్ హోటల్స్ అనేది చాలా తాజా అంశం. మధ్యతరగతి హోలిడే ట్రావెలర్స్ కోసం ఇవి ఏర్పాటయ్యాయి. లాడ్జిల్లో సౌకర్యాలుండవు. పెద్ద హోటల్స్‌లో పర్సు గుల్ల అయిపోతుంది. అందుకే మధ్యేమార్గంగా బడ్జెట్ హోటల్స్ వచ్చాయి. ఐరోపా, ఆస్ట్రేలియాల్లో ఇవి చాన్నాళ్లనుంచే ఉన్నాయి. జోస్టల్, వైహెచ్ ఏఐ, ఇంటర్నేషనల్ ట్రావెలర్స్ హాస్టల్, ముస్టేచ్ హోటల్ మనదేశంలోని బడ్జెట్ హోటల్స్ గా చెప్పుకోవచ్చు.



ఆలోచన ఎలా వచ్చింది?

వేదాంత పేరుతో బడ్జెట్ హోటల్స్‌ను స్థాపించారు పాతికేళ్ల రిషబ్ గుప్తా, ఆదిల్. రిషబ్ ప్రఖ్యాత డెలాయిట్ కంపెనీలో, ఆదిల్ మెరిల్ లించ్‌లో కన్సల్టెంట్లుగా పనిచేశారు. రిషబ్ న్యూయార్క్‌లో, ఆదిల్ సిడ్నీలో సేవలందించారు. 2009లో ఇద్దరూ కలిసి ఆస్ట్రేలియాలో రెండు నెలలపాటు హోలిడే ట్రిప్‌కు వెళ్లారు. అక్కడ ఒక బడ్జెట్ హోటల్ లో దిగి- రోజుకు 20 డాలర్లు మాత్రమే అద్దె చెల్లించారు. అప్పుడే అనిపించింది భారత్ లోనూ అలాంటి బడ్జెట్ హోటల్ స్థాపించాలనుకున్నారు.

"ఆస్ట్రేలియా వెళ్లినప్పుడు బడ్జెట్ హోటల్ లేదా హాస్టల్ అంటే ఏమిటో మొదటిసారి తెలిసింది. మేం పెట్టిన డబ్బుకు న్యాయం జరిగిందనిపించింది. హోలిడేయర్స్ కోసం మన దేశంలోనూ ఏదో ఒకటి చేయాలనుకున్నాం. స్వదేశీయులు, విదేశీయులు తక్కువ ఖర్చుతోనే హోలిడే ట్రిప్స్ ఎంజాయ్ చేసేలా చేయాలన్నదే మా ఉద్దేశం" అని రిషబ్ వివరించారు.

వేదాంత పేరుతో తొలి హోటల్ ను కేరళలోని కోచిలో ఏర్పాటు చేశారు. ఖర్చు తక్కువ, సదుపా యాల్లో రాజీలేదు. దీంతో వేదాంత హోటల్‌కు మంచి డిమాండ్ ఏర్పడింది. ఖాతాదారులను మహారాజుల్లా చూడటం మొదలు పెట్టడంతో ఆదరణ మరింత పెరిగింది. వినియోగంలో లేని భవనాలు, నష్టాల్లో ఉన్న చిన్న హోటళ్లను లీజ్‌కు తీసుకుని వాటిని బడ్జెట్ హోటల్స్‌గా మారుస్తున్నారు. నగరాలు, టూరిస్ట్ స్పాట్‌లలో అందరికీ అందుబాటులో ఉండే ప్రాంతాలను ఎంచుకుని అక్కడ బడ్జెట్ హోటళ్లను స్థాపిస్తున్నారు.

హోటళ్ల ఏర్పాటు కోసం భారీగా ఆస్తులను కొనుగోలు చేయడం లేదు. అదే వేదాంత విజయ రహస్యం. 20 నుంచి 30 గదులు ఉండే హోటల్ ఏర్పాటుకు 45 లక్షల రూపాయలకన్నా ఎక్కువ పెట్టుబడి పెట్టడంలేదు. టెక్నాలజీ, హౌస్ కీపింగ్ సౌకర్యాలపై దృష్టి పెట్టారు. కేరళలో, తమిళనాడులో 18 వేదాంత బడ్జెట్ హోటల్స్ స్థాపించామని రిషబ్ చెప్పారు. సింగిల్‌గా ప్రయాణం చేసేవారికి డార్మెటరీ సదుపాయం, గ్రూపులుగా వెళ్లే కాలేజ్ విద్యార్థులకు హాల్స్ సౌకర్యం కల్పిస్తోంది వేదాంత.

వేగంగా విస్తరణ

వచ్చే రెండేళ్లలో కనీసం వంద బడ్జెట్ హోటళ్ల స్థాపనే లక్ష్యంగా పెట్టుకున్నారు. హైదరాబాద్, ముంబై, పుణెలాంటి మహా నగరాలకు విస్తరించేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. అంతేకాదు, పెద్దగా హోటల్ సదుపాయం లేని చిన్న పట్టణాలు, పర్యాటక- మత పరమైన ప్రదేశాలు, పారిశ్రామిక హబ్స్‌లో హోటళ్లు పెట్టనున్నారు.

"2018 నాటికి దేశంలలోనే అతిపెద్ద బడ్జెట్ హోటల్ గ్రూప్ గా మారడమే మా లక్ష్యం. 7 వేల 300 డార్మ్ బెడ్స్, 1900 ప్రైవేట్ రూమ్స్ అందుబాటులోకి తెస్తాం. 107 హోటళ్లు పెడతాం" అని రిషబ్ తమ లక్ష్యాన్ని వివరించారు.



భారత్‌లో హాలిడేస్ మార్కెట్

బడ్జెట్ హోటల్స్ ఓయో, ట్రీబో, జిప్ రూమ్స్ మనదేశంలో మంచి విజయం సాధించాయి. 2013లో ప్రారంభమైన జోస్టల్ అయితే అతి తక్కువ కాలంలోనే దూసుకుపోతోంది. వియత్నాంలోనూ జోస్టల్ స్టార్టప్ ఏర్పాటు చేసింది. త్వరలో బెర్లిన్‌కు చెందిన మెయినిజర్ గ్రూప్ దేశంలో బడ్జెట్ హోటల్స్ పెట్టేందుకు సన్నద్ధమవుతోంది. కాక్స్ అండ్ కింగ్స్ సంస్థ ఇందుకు సహకరిస్తోంది. పర్యాటకులను గౌరవంగా చూసుకోవాలేగానీ ఈ రంగంలో పురోగమించాలనుకునేవారికి తిరుగుండదు.



నిన్న నిరుపేద..

నేడు నెలకు సంపాదన రెండు లక్షలు

"మనీ కాంట్ బై హ్యాపీనెస్" అనేది పేరొందిన ఇంగ్లిష్ సామెత. అంటే డబ్బుతో సంతోషాన్ని కొనలేమని అర్థం. చాలామంది వ్యక్తిత్వ వికాస నిపుణులు ఇదే మాట చెబుతుంటారు. కానీ ఇప్పుడు డబ్బు చుట్టూ భూమి తిరుగుతోంది. డబ్బులేనిదే ఇంటి నుంచి కాలు బయటపెట్టలేం. డబ్బు లేకుంటే దుబ్బుకు కూడా కొరగారంటారు. 33 ఏళ్ల నందిని కూడా ఇలాంటి సమస్యలే ఎదుర్కొంది. రెండేళ్ల కిందటి వరకు రెండు పూటలు భోజనం దొరికితే చాలనుకుంది. చిన్నప్పుడు పేదరికంలో మగ్గిపోయింది. డాక్టర్ కావాలని కలలు కనేది. అయితే డబ్బులు లేకపోవడంతో పదో తరగతిలోనే చదువును ఆపేయాల్సివచ్చింది. అలాంటి నందిని జీవితాన్ని ఊబర్ కంపెనీ మార్చేసింది.

కుటుంబ నేపథ్యం

బెంగళూరు సమీపంలోని ఒక చిన్న గ్రామంలో పెరిగింది నందిని. ఆమె తండ్రి చిన్న ఆలయంలో పూజారిగా పనిచేసేవాడు. చాలీచాలని ఆదాయం. అందుకే పదో తరగతి తర్వాత స్కూల్ మాన్పించేసి పెళ్లి చేసేశారు. కొన్నాళ్లు గృహిణిగా ఉండిపోయింది. కానీ నందినికి సగటు ఇల్లాలిగా మిగిలిపోవడం ఇష్టం లేదు. ఏదో సాధించాలన్న తపన. భర్త శ్రీశాంత్ శాస్త్రి కూడా పూజారిగానే పనిచేసేవారు. వచ్చిన ఆదాయం తిండికి మాత్రమే సరిపోయేది. అందుకే చిన్నా చితకా పనులు చేసి తనవంతుగా కుటుంబానికి ఎంతో కొంత ఇచ్చేది.

సినిమా కష్టాలు

చిన్న చిన్న వ్యాపారాలు చేసి విజయం సాధించింది నందిని. ట్రావెల్ ఏజెన్సీ నడిపింది. పెయింటింగ్, హోమ్ ఇంటీరియర్ పనులు చేసింది. అప్పుడే పాప పుట్టింది. కొన్నాళ్లకు నందిని తండ్రి ఆకస్మికంగా చనిపోయారు. కష్టాలు ప్రారంభమయ్యాయి. తండ్రి మరణంతో చెల్లెలి బాధ్యత నందినిపైనే పడింది. ఆమె చదువు, పెళ్లి.. నందిని అప్పుల్లోకి దిగబడింది. ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది.

ఉబర్ దోస్త్

ఉబర్ దోస్త్ గురించి 2015లో నందినికి తెలిసింది. అందులో చేరి డ్రైవర్లను రిఫర్ చేస్తే డబ్బులొస్తాయని స్నేహితులు చెప్పారు. ఉబర్ రిఫరెల్ ప్రోగ్రాంకు తెలిసిన డ్రైవర్‌ను కేవలం రిఫర్ చేస్తే చాలు. అతను ఉబర్ తరఫున కొన్ని ట్రిప్స్ వేస్తే మనకు 3 వేల రూపాయలు వస్తాయి. ఈ స్కీం హైదరాబాద్‌లో కూడా ఉంది. సొంతకారు ఉన్నవారు ఉబర్‌లో పార్ట్ టైం డ్రైవర్లుగా చేరవచ్చు. ఇదేదో బాగానే ఉందనిపించింది నందినికి.

విజయబావుటా

ఉబర్‌లో చేరాక కాలం కలిసి వచ్చింది. తెలిసిన డ్రైవర్లను ఉబర్‌లో చేర్పించింది. డ్రైవర్ ఉద్యోగం కావాలా అంటూ- సిటీలో పోస్టర్లు అంటించింది. తర్వాత ఫుల్ టైం డ్రైవర్లను రిఫర్ చేసే కార్యక్రమం చేపట్టింది. నందిని పడ్డ కష్టం ఫలించింది. ఇప్పటివరకు 600 మంది డ్రైవర్లను రిఫర్ చేసింది. బెంగళూరులో ఒక చిన్న ఆఫీసు ఏర్పాటు చేసుకుంది. తనకు సహాయకులుగా నలుగురు ఉద్యోగులను నియమించుకుంది. అడ్మినిస్ట్రేషన్, ఫీల్డ్ వర్క్‌లో వారు సాయం చేస్తుంటారు. ఇప్పుడు నెలకు రెండు లక్షల రూపాయలు సంపాదిస్తోంది. అప్పులన్నీ తీర్చేసి బెంగళూరులో సొంతంగా ఇల్లు కట్టుకుంది. తన కుమార్తెను ప్రఖ్యాత ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదివిస్తోంది.

భర్త సహకారంతో..

తన భర్త సహకారం వల్లే తానిప్పుడు ఈ స్థాయికి చేరుకున్నానని చెబుతోంది నందిని. కష్టాల్లో ఉన్నప్పుడల్లా భర్త సహకరించేవారని చెప్తోంది. "నేనున్న రంగంలో చాలామంది అబ్బాయిలతో మాట్లాడాలి. వారితోనే కలిసి పనిచేయాలి. నా భర్త ఎప్పుడూ ఒక్కమాట కూడా అనలేదు. అందుకే నేను పూర్తిగా పనిమీద ధ్యాస పెట్టగలిగాను. మా అమ్మ నాతోనే ఉంటూ నా కుమార్తెను చూసుకుంటోంది. నా విజయ రహస్యం అంటారామె. ఉబర్ సీఈఓ ట్రావిస్ కలానిక్‌ను ఎప్పుడో ఒకరోజు కలవాలనేది నందిని కల. వ్యాపారాన్ని ప్రారంభించాలంటే చదువే అవసరం లేదని- ధైర్యం, సహనం ఉంటే చాలు మహిళలు ఏ రంగంలోనైనా దూసుకుపోవచ్చంటోంది నందిని.

రెండవ తరంలో మరపురాని నటి



తెలుగు చలన చిత్ర చరిత్రలో రెండో తరానికి చెందిన కథానాయికలు నలుగురూ (సావిత్రి, జానకి, జమున, కృష్ణకుమారి) ఒకటి రెండు సంవత్సరాల తేడాలో (1950-53) సినీ రంగ ప్రవేశం చేశారు. ఎవరి ప్రత్యేకత వారిదే అన్న విధంగా తొలినాళ్లలోనే వారికి చక్కటి వైవిధ్యమున్న పాత్రలు ధరించే అవకాశాలు లభించాయి. 1951లో సౌందరరాజన్‌వారి 'నవ్వితే నవరత్నాలు' చిత్రం ద్వారా పరిచయమైన కృష్ణకుమారి అంతకు ముందు సంవత్సరం 'షావుకారు' ద్వారా నాయికగా పరిచయమైన జానకికి స్వయానా చెల్లెలు.

1953లో తాతినేని ప్రకాశరావు యస్.ఎ.టి. వారి 'పిచ్చి పుల్లయ్య'లో ప్రాముఖ్యంగల కథానాయిక వేషం వేయించారు కృష్ణకుమారి చేత అందులో రామారావు కాంబినేషన్లో చక్కని నటన ప్రదర్శించిన కృష్ణకుమారి ఆ తరువాత సంవత్సరమే పినిశెట్టిగారి 'పల్లెపడుచు' చిత్రంలోనూ అంతకు మించి బి.యస్.రెడ్డిగారి 'బంగారు పాప'లోనూ కథానాయికగా నటించటంతో ఆమెలోని ఆర్టిస్టుకు పరిశ్రమలో మంచి గుర్తింపు వచ్చింది. ఏ పాత్ర ధరించినా చాలా బాలెన్స్‌డ్‌గా నటించే మంచి నటి అని ముద్ర పడింది. ఆ తరువాత రేలంగి కాంబినేషన్లో 'ఇలవేల్పు'లో హాస్యపాత్రలో విఠలాచార్యగారి 'జయ విజయ' జానపదంలో నటించినా 'అభిమానం'లో చలం సరసన, 'దేవాంతకుడు'లో ఎన్టీఆర్‌తో నాయికగా నటించినా కథానాయికగా 'కృష్ణకుమారి' గ్లామర్‌స్టార్ కంటే మంచి టాలెంటు గల ఆర్టిస్టు అని నిరూపించిన చిత్రం కె.ప్రత్యగాత్మగారి 'భార్యాభర్తలు' (1961). అందులో అభిమానంగల టీచరు శారదగా ఆమె చూపిన నటన ముఖ్యంగా శోభనం గదిలో భర్త సమీపించినప్పుడు చూపిన అసహనం ఆ తరువాత వచ్చి వేడుకలో పాల్గొని 'ఏమని పాడెదనోయీవేళ' అన్న వీణ పాట పాడినప్పుడు చూపిన భావాలు శ్రీశ్రీ పాట భావానికి చక్కటి రూపాన్నిచ్చాయి. క్లిష్టమైన పాత్రకు నూటికి నూరుపాళ్లు న్యాయం చేసి ప్రేక్షకుల చేత శభాష్ అనిపించుకొన్నారు. ఆ వెంటనే 1962లో వచ్చిన 'కులగోత్రాలు'లోని భూమిక కూడా చెప్పుకోదగినదే.



1963లో వచ్చిన 'లక్షాధికారి', బందిపోటు, ఎదురీత, కానిస్టేబుల్ కూతురు' చిత్రాల్లో ఆమె వేసిన పాత్రల్లో ఎంతో వైవిధ్యం వుంది. అయితే కానిస్టేబుల్ కూతురులోని భూమిక నటిగా కృష్ణకుమారి ప్రతిభను మరోసారి చాటి చెప్పింది. ప్రభుత్వ బహుమతి పొందిన జగపతివారి 'అంతస్తులు'లో నాయికగా నటించారు. మరో బంగారు అవకాశం మళ్లీ ఆమెకు 1967లో లభించింది. ఉమ్మడి కుటుంబం, భువనసుందరి కథ, రహస్యం, చిక్కడు- దొరకడు, స్త్రీ జన్మ చిత్రాల్లో వైవిధ్యమున్నపాత్రలు ధరించారు. 1968లో 'వరకట్నం' చిత్రంలో నాయికగా గ్లామరస్ పాత్ర పోషించిన తరువాత కథానాయిక పాత్రలు ఇంచుమించు తగ్గిపోగా 1970 తర్వాత వయసు మళ్లిన పాత్రలు బహు తక్కువగా నటించగలిగారు. దాదాపు వంద సినిమాల్లో నటించారు. సినీ రంగం నుంచి రిటైరయ్యాక, రీ ఎంట్రీ చేయలేదనే చెప్పాలి.



ఫిబ్రవరి 2న 'టచ్ చేసి చూడు'



మాస్ మహారాజా రవితేజ హీరోగా నటించిన చిత్రం 'టచ్ చేసి చూడు'. బేబీ భవ్య సమర్పణలో లక్ష్మీ నరసింహా ప్రొడక్షన్స్ పతాకంపై నల్లమలుపు శ్రీనివాస్ (బుజ్జి), వల్లభనేని వంశీ సంయుక్తంగా నిర్మించిన చిత్రమిది. విక్రమ్ సిరికొండ ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. రాశీఖన్నా, సీరత్ కపూర్ నాయికలు. ఈ సినిమా సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని యు/ఎ సర్టిఫికేట్‌ను పొందింది. ఫిబ్రవరి 2న చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా... నిర్మాతలు నల్లమలుపు శ్రీనివాస్ (బుజ్జి), వల్లభనేని వంశీ మాట్లాడుతూ 'టచ్ చేసి చూడు' చిత్రం సెన్సార్ పూర్తయ్యింది. సినిమాకు 'యు/ఎ' సర్టిఫికేట్ వచ్చింది. ఈ వారంలో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహిస్తాం. ఇటీవల సోషల్ మీడియా ద్వారా విడుదల చేసిన పాటలకు, టీజర్‌కు ట్రెమండస్ రెస్పాన్స్ వస్తోంది. రవితేజ చాలా స్టైలిష్‌గా కనిపిస్తున్నారని సర్వత్రా అందరూ ప్రశంసిస్తున్నారు. మాకు చిరకాల మిత్రుడైన రవితేజతో ఈ సినిమా నిర్మిస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. మాస్ మహారాజా ఇమేజ్‌కి తగ్గట్టుగా ప్రముఖ రచయిత వక్కంతం వంశీ అద్భుతమైన కథను తయారు చేశారు. ఫిబ్రవరి 2న సినిమా విడుదలవుతుంది. చూసిన ప్రతి ఒక్కరికీ తప్పకుండా నచ్చుతుంది అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం : జామ్ 8, కథ : వక్కంతం వంశీ, స్క్రీన్ ప్లే : దీపక్ రాజ్, మాటలు : శ్రీనివాస్ రెడ్డి, అడిషనల్ డైలాగ్స్: రవిరెడ్డి మల్లు,కేశవ్, ఎడిటింగ్ : గౌతం రాజు, ఆర్ట్: రమణ, ఛాయాగ్రహణం : చోటా.కె.నాయుడు, నిర్మాతలు : నల్లమలుపు శ్రీనివాస్ (బుజ్జి) , వల్లభనేని వంశీ, స్క్రీన్ ప్లే ,దర్శకత్వం : విక్రమ్ సిరికొండ.

ఎనర్జిటిక్‌గా ఉండే 'ఇంటిలిజెంట్' : నిర్మాత సి.కల్యాణ్

సుప్రీమ్ హీరో సాయిధరమ్ తేజ్ కథానాయకుడిగా సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రై. లిమిటెడ్ పతాకంపై సెన్సేషనల్ డైరెక్టర్ వి.వి.వినాయక్ దర్శకత్వంలో ప్రముఖ నిర్మాత సి.కళ్యాణ్ నిర్మిస్తున్న భారీ చిత్రం 'ఇంటిలిజెంట్'. ఈ సినిమా ఫిబ్రవరి 9న విడుదలవుతుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో సి.కల్యాణ్ మాట్లాడుతూ ఈ సినిమాను ఫిబ్రవరి 9న విడుదల చేస్తున్నాం. మా సినిమా దేనికీ పోటీ కాదు. సంక్రాంతికి బాలయ్య సినిమా 'జై సింహా'తో హిట్ కొట్టాం. ఫిబ్రవరిలో ఈ సినిమా వస్తుంది. మాస్, ఎంటర్‌టైనర్‌గా ఉంటుంది. ఫ్యామిలీలకు కూడా నచ్చుతుంది. నేను గర్వంగా చెప్పుకునే సినిమా అవుతుంది. నిన్ననే నాకు దర్శకుడు ఈ సినిమాను చూపించారు. చాలా బాగా నచ్చింది. యువతకు, వినాయక్ ఫ్యాన్స్‌కి నచ్చే సినిమా అవుతుంది. రిపీట్ ఆడియన్స్ ఎక్కువగా వస్తారు. డ్యాన్సులు, మూవ్‌మెంట్స్ చాలా బాగా చేశాడు తేజ్. 2018 మా సీకే ఎంటర్‌టైన్‌మెంట్ అవుతుంది. వినాయక్ ఎంటర్‌టైన్‌మెంట్, మాస్ ఎలిమెంట్స్‌తో ఎనర్జిటిక్‌గా ఉండే సినిమా ఇది. ఇంటలిజెంట్‌గా వస్తున్నాం. ఇంటలిజెంట్‌గా కొడతాం అని చెప్పారు.



సప్తగిరి మాట్లాడుతూ వినాయక్ నాకు మంచి కేరక్టర్ ఇచ్చారు. మిగిలిన దర్శకుల సినిమాలు చేసేటప్పుడు కాలేజీకి వెళ్లినట్టు ఉంటుంది. కానీ వినాయక్‌గారి సినిమాల షూటింగ్ అయితే ఎగ్జామ్ లాగా రెండు గంటలే ఉంటుంది. మన పని పూర్తయిన తర్వాత అక్కడ మనం ఉండటానికి ఆయన ఒప్పుకోరు. వెళ్లి వేరే సినిమాలు చేసుకోమంటారు.

వినాయక్ మాట్లాడుతూ సి.కల్యాణ్ సంస్థలో సినిమా చేయమని మా నాన్న ఎప్పుడూ చెప్పేవారు. నాకు ఆయన సంస్థలో పనిచేయడం చాలా ఆనందంగా ఉంది. మా నాన్న కోరిక నెరవేరింది. ఆయన నిర్మాతగా అనిపించలేదు. మా అన్నయ్యలాగా అనిపించారు. సెట్లో ఇద్దరం అన్నదమ్ములం ఉన్నట్టు అనిపించింది. కృష్ణ సినిమాలాగా ఇందులోనూ అన్ని అంశాలు ఉంటాయి. తేజ్ చాలా బాగా చేశాడు. తను ఎంత ఎదిగినా అన్నయ్యలాగా ఇలాగే ఉండాలి. 'కొండవీటిదొంగ'లోని చమక్కు చమక్కు పాటను ఇందులో రీమిక్స్ చేశాం. తేజ్ వేసిన స్టెప్పులు చూస్తే చాలా ఆశ్చర్యంగా అనిపించింది. శివ ఆకుల మంచి కథ ఇచ్చారు. మా కాంబినేషన్‌లో హిట్ సినిమా అవుతుంది. సాయిధరమ్ తేజ్ మాట్లాడుతూ సినిమా ఎప్పుడు మొదలు పెట్టామో, ఎప్పుడు అయిపోయిందో తెలియలేదు. అనుకున్న టైమ్‌కి పూర్తి చేశాం. ఖైదీ నెంబర్ 150 అయిన తర్వాత వినాయక్ నాతో సినిమా చేయడం చాలా ఆనందంగా ఉంది. మంచి పాత్ర కుదిరింది.

లావణ్య త్రిపాఠి మాట్లాడుతూ సినిమా మొదలు పెట్టడానికి ముందు చాలా భయమేసింది. కానీ సెట్స్‌లో చాలా సరదాగా చేశాను అని చెప్పారు. శివ ఆకుల మాట్లాడుతూ కృష్ణ, లక్ష్మీ, నాయక్‌ని మించి హిట్ అవుతుంది. సి.కల్యాణ్ నన్ను నాలుగేళ్లుగా ఎంకరేజ్ చేస్తున్నారు. మా మామ వినాయక్ నాకు అన్నీ. తేజ్ చాలా కష్టపడే మనస్తత్వం ఉన్నవాడు. డైరెక్టర్ మీద నమ్మకంతో మోనిటర్ కూడా చూడకుండా సినిమా చేశారు అని చెప్పారు.

సాయిధరమ్‌తేజ్, లావణ్య త్రిపాఠి, నాజర్, బ్రహ్మానందం, పోసాని కృష్ణమురళి, ఆకుల శివ, కాశీ విశ్వనాథ్, ఆశిష్ విద్యార్థి, షాయాజీ షిండే, రాహుల్‌దేవ్, దేవ్‌గిల్, వినీత్‌కుమార్, జె.పి. పృథ్వీ, రుబాబు, కాదంబరి కిరణ్, విద్యుల్లేఖా రామన్, సప్తగిరి, తాగుబోతు రమేష్, భద్రం, నల్ల వేణు, రాహుల్ రామకృష్ణ, వెంకీ మంకీ, రాజేశ్వరి నాయర్, సంధ్యా జనక్, ఫిష్ వెంకట్, శ్రీహర్ష, శివమ్ మల్హోత్రా, రవిరామ్ తేజ, తేజారెడ్డి నటిస్తున్న ఈ చిత్రానికి కథ, మాటలు: శివ ఆకుల, సినిమాటోగ్రఫీ: ఎస్.వి. విశ్వేశ్వర్, సంగీతం: థమన్, ఎడిటింగ్: గౌతంరాజు, నిర్మాత: సి.కళ్యాణ్, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: వి.వి.వినాయక్.

భరతవర్ష క్రియేషన్స్ ప్రొడక్షన్ నెం.1 ఆరంభం

భరతవర్ష క్రియేషన్స్ పతాకంపై నూతన నటీ నటులతో చెన్నకుని శెట్టి(కుమార్) దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రొడక్షన్ నెం.1 చిత్రం పూజా కార్య క్రమాలు ఫిలింఛాంబర్‌లో జరిగాయి. దర్శకులు సము ద్ర, తెల%శీ%గాణ ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామ కృష్ణగౌడ్, సెక్రటరీ సాయి వెంకట్, జి.వి.ఆర్ 4 మ్యూ జిక్ అధినేత వి. గోపాలకృష్ణ మురళీ తదితలు పాల్గొన్నారు. ప్రముఖ దర్శకులు సముద్ర మాట్లాడుతూ.. సరి కొత్త ఆలోచనలతో.. యంగ్ అండ్ డైనమిక్ టీం రూపొందిస్తున్న ఈ చిత్రం తప్పకుండా ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది అన్నారు.

తెలంగాణ ఫిలించాంబర్ అధ్యక్షులు ప్రతాని రామకృష్ణ గౌడ్, సాయివెంకట్ మాట్లాడుతూ... ఈ మూవీ దర్శకుడు మంచి టాలెంటెడ్‌గా కనిపిస్తున్నారు. పూజా కార్యక్రమాలతో ప్రారంభమైన ఈ చిత్రం విజయోత్సవ సభను జరుపుకునే దాకా వెళుతుందనే నమ్మకం ఉంది. మంచి అభిరుచి ఉన్న టీంలా కనపడుతున్నారు. నా సపోర్ట్ ఎప్పుడూ ఉంటుంది అన్నారు. దర్శకుడు చెన్నకునిశెట్టి (కుమార్) మాట్లాడుతూ.. మైథలాజికల్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రంలో నూతన నటీ నటులతో పాటు పాపులర్ క్యారెక్టర్ ఆర్టిస్టులు సాంకేతిక నిపుణులు ఈ చిత్రానికి వర్క్ చెయనున్నారు. వినోదంతో పాటు, విస్మయానికి గురి చేసే కథాంశమిది. త్వరలోనే చిత్రీకరణను ప్రారంభించనున్నామన్నారు. జి.వి.ఆర్ 4 మ్యూజిక్ అధినేత వి.గోపాలకృష్ణ మాట్లాడుతూ.. టీం అందరి సమష్టి కృషితో ఈ చిత్రం అందరినీ అకట్టుకునే రీతిలో తెరకెక్కుతుందని బలంగా నమ్ముతున్నాం. కొత్త ట్రెండ్‌ను సృష్టించే అన్ని అంశాలు మా స్క్రిప్ట్‌లో ఉన్నాయి అన్నారు. భరతవర్ష క్రియేషన్స్ బ్యానర్‌లో తొలి చిత్రంగా తెరకెక్కే ఈ చిత్రం టీమ్ అందరికీ మంచి పేరును తీసుకురావాలని అతిథులు, చిత్ర యూనిట్ సభ్యులు ఆకాంక్షించారు.



రంగస్థలం టీజర్ అంచనాలు పెంచింది

మెగాపవర్ స్టార్ రామ్ చరణ్, లెక్కల మాస్టారు సుకుమార్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న క్రేజీ ప్రాజెక్ట్ 'రంగస్థలం 1985'. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్నఈ చిత్రంలో సమంత కథానాయికగా నటించగా జగపతిబాబు.. ఆది పినిశెట్టి కీలక పాత్రలు పోషిస్తున్నారు. సుకుమార్ ఆస్థాన సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ చిత్రానికి సంగీతం అందిస్తున్నాడు. మార్చి 30న ఈ మూవీ విడుదల కానుండగా, ఇప్పటి వరకు చిత్రానికి సంబంధించి బయటకి వచ్చిన ఫోటోస్ ఫ్యాన్స్‌లో భారీ ఎక్స్‌పెక్టేషన్స్ పెంచుతున్నాయి. గత చిత్రాల కంటే ఈ మూవీలో రామ్ చరణ్ సరికొత్తగా కనిపిస్తున్నాడు.ఇక తాజాగా చిత్ర టీజర్ విడుదల చేశారు మేకర్స్. చెవిటి వ్యక్తిగా చిట్టిబాబు పాత్రలో రామ్ చరణ్ అదరగొట్టాడు. పల్లెటూరి నేపథ్యంలో అందమైన ప్రేమ కథా చిత్రంగా ఈ మూవీ తెరకెక్కినట్టు తెలుస్తుంది. అనసూయ ఈ మూవీలో రంగమ్మత్తగా కనిపించనున్నట్టు సమాచారం.

ఢిల్లీ వాయు కాలుష్యంపై ఉన్నత స్థాయి కమిటీ నివేదిక

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో గడ్డి, చెత్తను దగ్ధం చేయడంపై దాఖలైన ఒక ప్రజాప్రయోజన వ్యాజ్యానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వ ఉన్నతస్థాయి కమిటీ తన నివేదికను సుప్రీంకోర్టులో బుధవారం సమర్పించింది. గడ్డిని దగ్ధం చేయడంపై పరిష్కారాలు, సలహాలు ఇచ్చేందుకు ఆరోగ్య, వ్యవసాయ శాఖల నుంచి టాస్క్‌ఫోర్స్ నిపుణులను నియమించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు గత ఏడాది ఆదేశించింది. ఈ ఆదేశం నేపథ్యంలో ఈ కేసులో పిటిషనర్ అందించిన సలహాలతో సహా ఒక సమగ్ర పరిష్కారాన్ని చేపట్టవచ్చని సుప్రీంకోర్టు న్యాయవాది ఆర్.కె.కపూర్ పేర్కొన్నారు. దేశ రాజధానిలో వాయు కాలుష్య సమస్యను అధిగమించేందుకు ఆదేశాలివ్వాలని కోరుతూ భారత ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని బెంచ్ ముందుకు ఈ న్యాయవాది గత ఏడాది నవంబరు 13న వాయు కాలుష్య సమస్యను తీసుకువచ్చారు. నిర్మాణానికి సంబంధించిన దుమ్ము, ధూళి, గడ్డిని దగ్ధం చేయడంపై తక్షణ చర్యలను కపూర్ కోరారు.

సీబీఐ కోర్టు ఆదేశాలపై అప్పీలు చేస్తాం : తేజస్వియాదవ్

పాట్నా : దాణా కుంభకోణంలో సీబీఐ కోర్టు తీర్పుపై హైకోర్టులో అప్పీలు చేస్తామని లాలూ ప్రసాద్‌యాదవ్ కుమారుడు, తేజస్వియాదవ్ వెల్లడించారు. బీజేపీ, ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ ఆర్జేడీ నేత లాలూకు ఉన్న మాస్‌ఫాలోయింగ్‌ని ఓర్వలేక దురుద్దేశంతో ఆయనను కేసులో ఇరికించారని విమర్శించారు. కోర్టు తీర్పుకు కట్టుబడి ఉన్నామని, అయితే సీబీఐ కోర్టు తీర్పే తుది తీర్పుకాదని, హైకోర్టుకు అవసరమైతే సుప్రీంకోర్టుకు కూడా వెళతామన్నారు. ఈ కేసును బీజేపీ-ఆర్ఎస్ఎస్ చేసిన కుట్రగా ఆయన రాజ్‌భవన్ వెలుపల విలేకర్లకు వివరించారు. ఈ ఏడాది డిసెంబరులో బీహార్ ఎన్నికలు జరపాలని అనుకుంటున్నారని అందువల్లే బీజేపీ నాయకులు, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌లు రాష్ట్రంలో పర్యటనలు కొనసాగిస్తున్నారన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం కావాలనే ఆర్జేడీపై న్యాయసమస్యలు సృష్టిస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు రోజురోజుకు క్షీణిస్తున్నాయని,దళితులు, అణగారిన వర్గాలపై దాడులు ఎక్కువయ్యాయని తేజస్వి, పార్టీ నాయకులు గవర్నర్ సత్యపాల్ మాలిక్‌కు విజ్ఞాపనా పత్రం సమర్పించారు.

సర్కార్ల పహారాలో...

కర్ణిసేన విధ్వంసం...!

- థియేటర్లు, వాహనాల దహనం
- బీజేపీపాలిత రాష్ట్రాల్లోనే ఆగడాలు
- పద్మావత్ విడుదలపై బలప్రయోగం




విశాలాంధ్ర - న్యూఢిల్లీ : బీజేపీ సర్కారు రాష్ట్రాల కనుసన్నల్లోనే పద్మావత్ వ్యతిరేక మూకలు రెచ్చిపోతున్నాయి. ఈ చిత్రాన్ని ఎట్టి పరిస్థితిలోనూ ప్రదర్శించాల్సిందేనని, శాంతిభద్రతలను విధిగా కాపాడాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించినా... బీజేపీ సర్కార్లు సరిగా స్పందించక పోవటంతో...గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లో రాజ్‌పుత్ కర్ణిసేన ఆగడాలకు అంతు లేకుండా పోయింది. సినిమా థియేటర్లను ధ్వంసం చేయటం, రాస్తారోకోలతో రవాణావ్యవస్థను స్తంభింప చేస్తుంటే... బీజేపీ సర్కార్లు కళ్లప్పగించి చూడటంతో... గుజరాత్‌లో హింసాత్మకఘటనలు చోటుచేసుకున్నాయి. భారీగా ఆస్తినష్టం జరిగింది, ఈ సినిమా విడుదలను అడ్డుకుంటామని హెచ్చరించిన కర్ణిసేన అన్నంత పని చేసింది. గుజరాత్, అహ్మదాబాద్‌లో సినిమా ప్రదర్శిస్తున్న థియేటర్లు, షాపింగ్ మాల్స్‌పై దాడులకు దిగారు. సినిమా విడుదలకు సిద్ధమౌతున్న హిమాలయ, అహ్మదాబాద్ వన్ మాల్స్, మరో సినిమా థియేటర్‌ను కర్ణిసేన మూకలు తగలపెట్టేశాయి. పార్కింగ్ ప్రదేశాల్లో, రోడ్లపై ఉన్న సుమారు 150 వాహనాలకు ఆందోళనకారులు నిప్పు పెట్టారు. రంగంలోకి దిగిన పోలీసులు, పరిస్థితి అదుపు తప్పడంతో గాల్లోకి కాల్పులు జరిపారు. ఆందోళన కారులను చెదరకొట్టారు. ఇదే రీతిలో సూరత్, బరోడా, రాజ్‌కోట్, ఆనంద్ జిల్లాల్లోనూ కర్ణిసేన మూకలు రెచ్చిపోయాయి. దీనిపై రాష్ట్ర డీజీపీ అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. అదనపు బలగాలను రంగంలోకి దించారు. అంతేకాకుండా సినిమా ప్రదర్శింపబడుతున్న థియేటర్లకు భద్రత పెంచారు. ఆందోళనలపై స్పందించిన గుజరాత్ సీఎం రూపానీ శాంతి పాటించాలంటూ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అల్లర్లకు సంబంధించిన వీడియోని గుజరాత్ పోలీసులు విడుదల చేశారు. ఈ వీడియో ఉన్న వ్యక్తులు తమను ఎవరూ గుర్తుపట్టకుండా మాస్క్‌లు ధరించి థియేటర్లపై రాళ్లతో దాడులకు పాల్పడగా మరికొంత మంది రోడ్డుపై ఉన్న వాహనాలకు నిప్పుపెట్టారు. తొలుత కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించిన కర్ణిసేన కార్యకర్తలు అనూహ్యంగా హింసకు పాల్పడ్డారు. అసాంఘిక శక్తులు ఈ ర్యాలీలో పాల్గొన్నట్టు గుజరాత్ హోంమంత్రి జడేజా ప్రకటించారు. బుధవారం 100 మందిపై పోలీసులు కేసులు పెట్టారు. గుజరాత్‌లో ఈ హింసాత్మక ఘటన చోటు చేసుకున్న గంటల్లోనే ఇతర బీజేపీ పాలిత రాష్ట్రాలకు వ్యాపించింది. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, హర్యానా, రాజస్థాన్‌లలో కర్ణిసేన కార్యకర్తలు ఆందోళనలకు దిగారు. కాన్పూర్‌లో ఓ షాపింగ్‌మాల్‌లోకి ప్రవేశించిన ఆందోళనకారులు, అక్కడి సిబ్బందిపై దాడలకు పాల్పడ్డారు. సినిమా ప్రదర్శించొద్దంటూ అక్కడున్న సినిమా పోస్టర్లను చించిపడేశారు. ఇండోర్, మొరేనా, గ్వాలియర్‌లలో ఆందోళనలు నిర్వహించారు. ఉజ్జయినీలో ఓ థియేటర్‌పై దాడికి యత్నించిన వారిని స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

గురుగ్రామ్‌లో అల్లర్లను అదుపు చేయాడానికి 144 సెక్షన్ విధించారు. పరిస్థితి అదుపులోకి వచ్చేంత వరకూ ఎవరూ గుంపులుగా తిరగొద్దంటూ అహ్మదాబాద్ పోలీసులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. అల్లర్లపై కేసు నమోదు చేసిన పోలీసులు, సీసీటీవీ పుటేజీ ఆధారంగా నిందితుల కోసం గాలిస్తున్నారు. వరుస ఆందోళనల నేపథ్యంలో థియేటర్ యజమానులు సినిమా ప్రదర్శించట్లేదంటూ బయట బోర్డులు పెట్టారు. రాజస్థాన్‌లో చిత్తోర్‌గడ్ కోటను మరోసారి ప్రభుత్వం మూసివేసింది. వేలాది మందితో ఆత్మాహుతికి పాల్పడుతామని కర్ణిసేన ప్రకటించిన నేపథ్యంలో ఈ కోటను ముందస్తుగా మూసివేశారు. ఇక మహారాష్ట్ర పోలీసులు రంగంలోకి దిగారు. ముందస్తుగా 50 మంది కర్ణిసేన కార్యకర్తలను అరెస్టు చేశారు. ఔరంగాబాద్, కొల్హాపూర్, నాసిక్ తదితర సమస్యాత్మక ప్రాంతాల్లో భారీగా పోలీసులు మోహరించారు. పద్మావత్‌కు వ్యతిరేకంగా 1900 మంది మహిళలు ఆత్మాహుతి చేసుకుంటారని ప్రకటించిన కర్ణిసేన చీఫ్‌ను మంగళవారం రాత్రి పోలీసులు అరెస్టు చేశారు. ఢిల్లీ - జైపూర్ జాతీయ రహదారిని ఆందోళనకారులు దిగ్బంధనం చేశారు. గుర్‌గ్రామ్-వజీర్-పటౌడీ రోడ్డునూ బ్లాక్ చేశారు. ఇదిలా ఉంటే... పద్మావత్ చిత్ర విడుదలకు అనుమతి ఇచ్చినందుకు పార్లమెంటును, సుప్రీంకోర్టును పేల్చివేస్తామని ప్రకటించిన అఖిలభారతీయ క్షత్రియ మహాసభ అధ్యక్షుడు భవనేశ్వర్‌సింగ్‌పై దేశద్రోహం కేసు నమోదు చేశారు.

ఎన్నికల ప్రక్రియలో

దివ్యాంగుల భాగస్వామ్యానికి నిర్దిష్ట చర్యలు

ప్రధాన ఎన్నికల కమిషనర్ ఓ.పి.రావత్



న్యూఢిల్లీ : ఎన్నికల ప్రక్రియలో దివ్యాంగులు నామమాత్రంగా కాకుండా ఒక అర్థవంతమైన భాగస్వామ్యం కలిగి ఉండేందుకు నిర్దిష్ట చర్యలు అవసరమని ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) ఓ.పి.రావత్ తెలిపారు. బుధవారం ఇక్కడ ఎన్నికల ప్రక్రియలో దివ్యాంగ, ప్రత్యేక వైకల్య ప్రజలను చేర్చడంపై అంతర్జాతీయ సదస్సును ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ భారత్ వంటి ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికలు వచ్చినపుడు అటువంటి ప్రజల ప్రాధాన్యతలను కేంద్ర స్థానంగా తీసుకోవాల్సి ఉంటుందన్నారు. 'ఎన్నికలలో మాత్రమే కాకుండా, పాలనాపరమైన అంశాలన్నింటిలో వారి(దివ్యాంగుల) అర్థవంతమైన, ఫలప్రదమైన భాగస్వామ్యం కోసం వాస్తవ చర్యలు, నిజమైన సాధికారతకు సంబంధించి నామమాత్రపు చర్యల నుంచి మేము దూరంగా ఉంటాం' అని సీఈసీ పేర్కొన్నారు. అభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞాన పరిణామం వేగంతో మార్పు కూడా వేగంగా జరుగుతుందన్నారు. ఈరోజు అందుబాటులో ఉన్నది రేపు ఉండకపోవచ్చని తెలిపారు. అందువల్ల అటువంటి ప్రజల సాధికారత నిర్ధారణకు సమయం ఆసన్నమైందని, ప్రపంచ వృద్ధికి, సంఘటిత అభివృద్ధికి ప్రజాస్వామ్య కసరత్తులో వారి భాగస్వామ్యం అవసరమన్నారు. సీఈసీ మాట్లాడుతూ ఎన్నికల జాబితాలో నమోదుకు, పోలింగ్ కేంద్రాలకు సులభంగా వెళ్లేందుకు సాంకేతిక పరిజ్ఞానం, సులభతరం చేయడం ద్వారా దివ్యాంగులు లేదా ప్రత్యేక వైకల్య ప్రజలకు అన్ని రాష్ట్రాల ఎన్నికల సంఘాలు, ఎన్నికల కమిషన్ మార్గాలను ఏర్పాటు చేసిందన్నారు. ఎన్నికల కమిషనర్ అశోక్ లావాస్ మాట్లాడుతూ ఎన్నికల్లో పాల్గొనేందుకు దివ్యాంగులు అడ్డంకులు ఎదుర్కొంటున్నారని, వారికి సాధికారత కల్పించేందుకు ఆ అడ్డంకులను తొలగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. మరో ఎన్నికల కమిషనర్ సునీల్ అరోరా మాట్లాడుతూ ఈ దిశగా ఎన్నికల సంఘాలు మరిన్ని చర్యలు చేపట్టడానికి ప్రయత్నిస్తున్నాయన్నారు.

నెహ్రూ కన్నా శాస్త్రి మిన్న

ఆరెస్సెస్ విషయమై అద్వానీ

న్యూఢిల్లీ: మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రిని ఆరెస్సెస్ నాయకులు పొగడటం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా ఉంది. గత సంవత్సరం ఆరెస్సెస్ అధిపతి మోహన్ భగవత్ ఈ ఏడాది ఎల్కే అద్వానీ బాహాటంగా శాస్త్రిని ప్రశంశించడం గమనార్హం. ఆరెస్సెస్ విషయంలో మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కన్నా మరో మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి హుందాగా వ్యవహరించారని బీజేపీ అగ్రనేత ఎల్కే అద్వానీ పేర్కొన్నారు. అంకిత భావం కలిగిన గొప్ప కాంగ్రెస్ నాయకునిగా శాస్త్రిని ఆయన అభినందించారు. ఆరెస్సెస్ అనగానే నెహ్రూ ఒకింత విద్వేష భావం వెలిబుచ్చేవారన్నారు.

"నాదేశం : నా జీవితం' పేరిట సిద్ధమైన అద్వానీ ఆత్మకథలోని కొంత భాగాన్ని ఆరెస్సెస్ అధికార పత్రిక ఆర్గనైజర్‌లో ప్రచురించారు. ఇందులోని వివరాల ప్రకారం నెహ్రూ, శాస్త్రిల వైఖరులను అద్వానీ పైమేరకు పోల్చారు. పత్రిక సహాయ సంపాదకుని హోదాలో మాజీ ప్రధాని శాస్త్రిని ఎపుడు కలిసినా చాల సౌమ్యంగా, హుందాగా మాట్లాడేవారన్నారు. గత సంవత్సరం ఆరెస్సెస్ అధిపతి మోహన్‌భగవత్ కూడా అద్వానీ తరహాలోనే 'లోక నేత'గా లాల్ బహదూర్ శాస్త్రిని పొగిడిన సంగతి తెలిసిందే.

బీజేపీ వల్లే ఆ నిర్ణయం

25 ఎంపీ, 150 అసెంబ్లీ సీట్లే లక్ష్యం : శివసేన



ముంబై: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగా బరిలోకి దిగుతామన్న నిర్ణయానికి బీజేపీయే కారణమని శివసేన విమర్శించింది. ఆపార్టీ మిత్రద్రోహానికి పాల్పడుతోందన్నారు.మొఘలుల నుంచి మరాఠా వీరుడు ఛత్రపతి శివాజీ రాజ్యాధికారం చేజిక్కించుకున్నప్పుడు ప్రజలంతా స్వాతంత్ర్యం కావాలని కోరారని, శివసేనను కూడా ప్రజలు అదే తరహాగా అడుగుతున్నారన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో మిత్రపక్షాన్ని పక్కనబెట్టి 380పైగా సీట్లను బీజేపీ గెలుచుకోవాలని అమిత్‌షా ఆదేశించినప్పుడు ఎవరూ ఎందుకు ప్రశ్నించలేదని, ఎన్నికల ఫలితాలతో ప్రమేయం లేకుండా సమాజ అభ్యున్నతికి శివసేన కట్టుబడి ఉందని పార్టీ పత్రిక సామ్నా సంపాదకీయంలో స్పష్టం చేసింది. లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో బీజేపీ పొత్తుపెట్టుకోబోమని, దీనిపై ఎవరూ ఆశ్చర్యపోనక్కర్లేదన్నారు. రాష్ట్రం, కేంద్రాల్లో బీజేపీకి మిత్రపక్షంగా ఉండగానే ఆపార్టీ నాయకుడు కీ.శే ప్రమోద్ మహాజన్ శివసేనను తప్పించాలన్నప్పుడు ఎవరూ ఎందుకు మాట్లాడలేదన్నారు. మా మార్గంలో మేము ముందుకు కొనసాగాలను కుంటున్నామని సామ్నాలో వెల్లడించారు. మొఘలుల నుంచి ఛత్రపతి రాజ్యాన్ని స్వాధీనం చేసు కున్నప్పుడు అతిపెద్ద స్థాయిలో ముస్లిం రాజరికం కొనసాగుతుందని,అయితే ప్రజలు తన వెనుక ఉన్నారని నమ్మిన శివాజీ భయపడకుండా తన ప్రయత్నాన్ని కొనసాగించారన్నారు. అదేదారిలో సేన అధినేత కీ.శే.బాల్ థాకరే ముందుకెళ్లారని, ప్రజలకు మంచిది అను కున్నదే తాము చేస్తామన్నారు. సేన కార్యవర్గ సమావేశం మంగళవారం జరిగింది. దీనిలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు ఒంటరిగా వెళ్లటానికి నిర్ణయం తీసుకున్నామన్నారు. 48 ఎంపీ స్థానాల్లో 25 సీట్లు, 288 అసెంబ్లీ స్థానాల్లో 150 సీట్లను శివసేన లక్ష్యంగా పెట్టుకుంది. నోట్లరద్దు, జీఎస్టీ, రైతుల ఆత్మహత్యలు, సరిహద్దుల్లో పాక్ ఉగ్రదాడులపై బీజేపీ తీరును శివసేన ఎండగడుతూనే ఉంది.

మోడీని అనుసరించండి

పాక్‌కు ముఫ్తీ విన్నపం



శ్రీనగర్ : భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య కొనసాగుతున్న శత్రుత్వంపై జమ్మూకాశ్మీర్ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. ఎన్నాళ్లిలా కొట్లాడుకుంటాం.. కలిసి జీవించడాన్ని నేర్చుకుందామన్నారు. అదే సమయంలో పేదరికంపై పోరు కీలకమని, ఈ విషయంలో మోడీ సలహాలను పాకిస్థాన్ అనుసరించడం సబబుగా ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. బుధవారం శాసనమండలిని ఉద్దేశించి మాట్లాడిన ఆమె తన అభిప్రాయాలను వెల్లడించారు. 'మనలో మనం కొట్లాడుకోవడం కన్నా పేదరికాన్ని నిర్మూలించేందుకు ఐక్యంగా పోరాడదాం. ఈ వ్యవహారంలో మోడీ సలహాలు, సూచనలను పాకిస్థాన్ అనుసరించాలని కోరుకుంటున్నాను. కలిసి జీవించడాన్ని మనం నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బంకర్లను ఏర్పాటు చేసుకోవడం శాశ్వత పరిష్కారం కాదు' అని ముఫ్తీ అన్నారు. జమ్మూలోని సరిహద్దు జిల్లాల్లో బంకర్ల ఏర్పాటు చేసేందుకు నిధులను కేంద్ర హోంశాఖ మంజూరు చేసినట్టు సీఎం పేర్కొన్నారు. నియంత్రణ రేఖ వెంబడి తరచూ జరిగే కాల్పుల విషయమై మంగళవారం జమ్మూకాశ్మీర్ అసెంబ్లీ అట్టుడికింది. ప్రతిపక్షాలైన నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ), కాంగ్రెస్ పార్టీలు ఈ వ్యవహారంలో రాష్ట్రప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నించాయి. భారత్, పాకిస్థాన్ సరిహద్దు వద్ద కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులపై ఆందోళన వ్యక్తంచేశాయి. సరిహద్దు కాల్పుల నియంత్రణతో పాటు సరిహద్దు ప్రజలకు భద్రత కల్పించడంతో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని దుయ్యబట్టాయి. ఇందుకు నిరసనగా అసెంబ్లీ నుంచి వాకౌట్ చేశాయి. ఈనెల 17 నుంచి కొనసాగుతున్న సరిహద్దు కాల్పుల్లో ఇద్దరు బీఎస్‌ఎఫ్ జవాన్లు, మరో ఇద్దరు ఆర్మీ జవాన్లతో సహా మొత్తం పది మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 40 మంది గాయపడ్డారు.

మేయర్ల ఎంపికలో దూరంగా ఉంచడంపై సిద్ధు అసంతృప్తి

చండీగఢ్ : మేయర్ స్థానాలకు అభ్యర్థుల ఎంపికలో రాష్ట్ర ప్రభుత్వం, పార్టీ తన అభిప్రాయాలను కోరకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందినట్టు పంజాబ్ పంచాయతీరాజ్‌శాఖ మంత్రి నవజోత్ సింగ్ సిద్ధు బుధవారం తెలిపారు. అమృతసర్ మేయర్ ఎన్నికకు సంబంధించిన అధికారిక కార్యక్రమానికి సిద్ధూతోపాటు 15 మంది మున్సిపల్ కౌన్సిలర్లు దూరంగా ఉండటంతో రాష్ట్ర కాంగ్రెస్‌కు ఇబ్బందికరమైన పరిస్థితి ఎదురైంది. గత ఏడాది బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి మారిన సిద్ధూ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాను పంచాయతీరాజ్‌శాఖ మంత్రిని అయి నప్పటికీ ఒక నెల రోజుల నుంచి పాటియాలా, జలంధర్, అమృత్‌సర్ మేయర్ అభ్యర్థుల ఎన్నికపై జరుగుతున్న చర్చలు జరుగుతున్నా అటు ప్రభుత్వంగాని, ఇటు పార్టీగానీ తన సూచనలు కోరలేదని, ఇది తనను చాలా బాధించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

గోరఖ్‌పూర్, ఫుల్పూర్ ఉప ఎన్నికకు

బీజేపీ, విపక్షాలు రెడీ

లక్నో : ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్యల నియోజకవర్గాలైన ఫుల్పూర్, గోరఖ్‌పూర్ లలో లోక్‌సభ ఉప ఎన్నికలకు రంగం సిద్ధమైంది. అధికార బీజేపీతో పాటు విపక్షాలు ఎన్నికలకు సిద్ధమౌతున్నాయి. మార్చిలో ఉప ఎన్నికలు జరగనున్నట్టు ఈసీ ఇటీవల ప్రకటించడం తెలిసిందే. గత అసెంబ్లీ ఎన్నికల్లో వలె బీజేపీ ఈసారి కూడా క్లీన్‌స్వీప్ చేస్తున్న ప్రచారం ఉంది. మొత్తం 403 స్థానాల్లో 325 సీట్లను బీజేపీ, దాని మిత్రపక్షాలు గెలుచుకున్నాయి. సిట్టింగ్ ఎంపీలు యోగి ఆదిత్యనాథ్ (యూపీ సీఎం), కేశవ్ ప్రసాద్ మౌర్య (యూపీ డిప్యూటీ సీఎం)ల ఎన్నిక నేపథ్యంలో ఈ రెండు స్థానాలు ఖాళీ అయ్యాయి. గోరఖ్‌పూర్, ఫుల్పూర్ స్థానాలను దక్కించుకునేందుకు బీజేపీతో పాటు విపక్షాలు గట్టి కసరత్తు చేస్తున్నాయి. బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నికల కోసం విపక్షాలైన ఎస్పీ, బీఎస్పీలు డిమాండు చేస్తున్నాయి. 'ఎల్లప్పుడూ ఎన్నికలకు సిద్ధంగా ఉండే పార్టీ బీజేపీ. ఇది కేడర్ ఆధారిత పార్టీ. ఈ ఎన్నికల్లోనూ గెలుపు బీజేపీదే' అని పార్టీ రాష్ట్ర ప్రతినిధి రాకేష్ త్రిపాఠి విశ్వాసం వ్యక్తంచేశారు. ఉమ్మడి అభ్యర్థిని నిలబెట్టడంలో విపక్షాలు విఫలమయ్యాయంటూ ఎద్దేవా చేశారు. ఈ ఉప ఎన్నిక 10నెలల యోగి ప్రభుత్వానికి పెనుసవాల్ అని ఎస్పీ అధికార ప్రతినిధి సునీల్ సింగ్ సంజన్ అన్నారు. గోరఖ్‌పూర్, ఫుల్పూర్లలో తమ పార్టీ ఒంటరిగా పోటీ చేస్తోందని తెలిపారు. రాష్ట్రంలో మహిళలపై దాడులు పేట్రేగిపోవడంతో ప్రజలు బంబేలెత్తిపోయి ఉన్నారని, ఇటీవల పరిస్థితులు రైతులను నిర్ఘాంతపర్చాయని, వీటి ప్రభావం ఎన్నికలపై ఉంటుందని చెప్పారు. ఈ నేపథ్యంలో కాషాయ పార్టీకి అవకాశాలు సన్నగిల్లినట్టు తెలిపారు. కాంగ్రెస్ ప్రతినిధి అశోక్ సింగ్ మాట్లాడుతూ ఈసారి బీజేపీ ఘోరంగా విఫలమవుతుందని, రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణిస్తుండడంతో ప్రజలు విసిగి పోయారని, ఈసారి బీజేపీ గెలుపు కష్ట సాధ్యమైన విషయమని అన్నారు.

స్మగ్లర్ల దాడిలో జర్నలిస్ట్‌కు గాయాలు

షిల్లాంగ్ : మేఘాలయలోని వెస్ట్ ఖాసీ హిల్స్ జిల్లాలో టింబర్ స్మగ్లర్ల దాడిలో ఓ జర్నలిస్ట్ గాయపడిన సంఘటన ఇది. బిప్లావ్ డే అనే ఫ్రిలాన్స్ జర్నలిస్ట్ టింబర్ అక్రమ రవాణాపై వివరాలు సేకరించేందుకు తన డ్రైవర్, మిత్రుడుతో కల్సి అథియాబరీ ప్రాంతానికి వెళ్లినప్పుడు కొందరు స్మగ్లర్లు ఆయనపై దాడి చేశారు. ఈ ఘటనలో బిప్లావ్ డే కెమెరా, మొబైల్ ధ్వంసమైనట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు జిల్లా ఎస్పీ జీడీ ఖర్వాంలంగ్ పేర్కొన్నారు.

బాలికలకు మమత బెనర్జీ శుభాకాంక్షలు

కోల్‌కతా: జాతీయ బాలికాదినోత్సవం సందర్భంగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ బాలికలకు ట్వీట్టర్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. తమ రాష్ట్రం ప్రవేశపెట్టిన కన్యశ్రీ పథకం అంతర్జాతీయ గుర్తుంపుతో పాటు మార్గదర్శంగా మారిందని ఆమె అన్నారు. జాతీయ బాలికాదినోత్సవం ప్రతి ఏటా జనవరి 24న జరుపుకుంటారు. బాలికలు తమ విద్యను మధ్యలోనే ఆపేయకుండా కొనసాగించేందుకు, 18 ఏళ్ల ప్రాయం వరకు పెళ్లి ప్రస్తావన లేకుండా ఉండేందుకు పశ్చిమ బెంగాల్ కన్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టింది.

బాధిత పోలీసు కుటుంబానికి రూ.1 కోటి చెక్కు

చెన్నై: రాజస్థాన్‌లో గత నెల ఓ దోపిడి కేసులో అనుమానితులను అరెస్టు చేసేందుకు ప్రయత్నించిన తమిళనాడు పోలీసు ఇన్స్‌స్పెక్టర్ పెరియ పాండియన్ దొంగల చేతిలో దారుణంగా హత్య గావించబడిన సంఘటన సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. బాధిత ఇన్స్‌పెక్టర్ భార్య బానురేఖకు తమిళనాడు ముఖ్యమంత్రి కే.పళనిస్వామి రూ.1కోటి చెక్కును అందజేశారు. మదురవోయల్ పోలీసు స్టేషన్‌లో పాండియన్ లా అండ్ ఆర్డర్ ఇన్స్‌స్పెక్టర్‌గా ఉండేవారు.

పేదలకు ఎఫ్ఐఆర్ నమోదు అసాధ్యం : ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ: పేదలు ఎఫ్ఐఆర్ నమోదు చేయించడం అసాధ్యమేనని ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్యానించింది. జూన్ 2016 నుంచి తన కుమార్తె అత్తారింటి నుంచి కనిపించక పోవడంపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయక తాత్సారం చేసిన ఘటనపై ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తన కుమార్తె అత్తింటి హింసకు గురై, కనిపించక పోయినప్పుడు తాను పడిన వేదనను ఆ మహిళ కోర్టుకు సోదాహరణంగా వివరించింది. తక్కువ కట్నంపై తన కుమార్తెను వారు శారీరకంగా హింసించే వారని ఆ మహిళ కోర్టుకు వివరించింది.

కాల్వలో పడిన బస్సు: నలుగురి మృతి

సంబల్‌పూర్ : ఒడిశాలోని సంబల్‌పూర్ జిల్లాలో ఓ బస్సు బ్రిడ్జిపై నుంచి కాల్వలో పడిన దుర్ఘటనలో నలుగురు మరణించగా 32 మంది గాయపడ్డారు. మంగళవారం రాత్రి సంబల్‌పూర్ నుంచి రాయిరంగపూర్‌కు వెళ్లుతున్న బస్సు గౌడపల్లి గ్రామం వద్ద ప్రయాణిస్తున్నప్పుడు బ్రిడ్జిపై నుంచి కాల్వలో పడినట్టు పోలీసులు తెలిపారు. డ్రైవర్ అదుపుతప్పడమే ప్రమాదానికి కారణమని వారు పేర్కొన్నారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు.

కిరణ్‌బేడీపై రాష్ట్రపతి, ప్రధాన మంత్రికి ఫిర్యాదు

పుదుచ్చేరి: పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్ బేడి అప్రజాస్వామిక కార్యకలాపాలపై రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్, ప్రధాని నరేంద్ర మోడీని కలవనున్నట్టు రాష్ట్ర ముఖ్యమంత్రి వీ.నారాయణసామి తెలిపారు. కిరణ్ బేడి ప్రభుత్వ పాలనలో జోక్యం చేసుకుంటున్నారని నారాయణసామి విమర్శించారు. తన మంత్రివర్గ సహచరులు, ఎమ్మెల్యేల బృందంతో రాష్ట్రపతి, ప్రధానితో పాటు హోం శాఖ మంత్రిని కలుసుకోనున్నట్టు ఆయన తెలిపారు. ప్రజాస్వామ్యంగా ఎన్నికైన ప్రభుత్వంపై కిరణ్ జోక్యం చేసుకోవడం తగదని కాంగ్రెస్ నేతలు గుర్రుగా ఉన్నారు.

బడ్జెట్‌పై సీనియర్ నేతలతో రాహుల్ సమాలోచన

న్యూఢిల్లీ: త్వరలో కేంద్రం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌పై వ్యూహరచనకు అఖిల భారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ, పార్టీ సీనియర్ నేతలతో సమావేశమైయారు. వ్యూహాత్మకంగా వ్యవహరించి, కేంద్రాన్ని ఇరుకున పెట్టేందుకు తగిన ప్రణాళికలు రచించే విషయంపై చర్చించారు. పార్లమెంట్‌లో జనవరి 29 నుంచి ఫిబ్రవరి 9 వరకు బడ్జెట్ సెషన్ మొదటి సమావేశం జరగనుంది. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వపు చివరి బడ్జెట్ కావడంతో ఈ సమావేశాలు ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి.

యోగిపై అనుచిత వ్యాఖ్యలు : ఎస్పీ నేతపై ఎఫ్ఐఆర్

బారబంకీ: ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు సమాజ్‌వాది నేత , మాజీ ఎంపీపై ఎఫ్ఐఆర్ నమోదు అయిన సంఘటన ఇది. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను జైలు పాలైన ఓ బాబాతో పోల్చుతూ ఎస్పీ నేత కమ్లా ప్రసాద్ రావత్ చేసిన వ్యాఖ్యలపై హిందు యువ వాహినీ జిల్లా ఇంచార్జ్ రవి సింగ్ దరియాబాద్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఎస్పీ నేత వ్యాఖ్యలు ప్రజల మనోభావాలను గాయపర్చాయని ఆయన అన్నారు.

జెండా ఎగురవేయనున్న ఆరెస్సెస్ ఛీఫ్

తిరువనంతపురం: కేరళలోని పాలక్కాడ్ జిల్లాలో సంఘ్ కార్యకర్తల ఆధ్వర్యంలో నడుస్తున్న ఓ స్కూల్లో ఆరెస్సెస్ ఛీఫ్ మోహన్ భగవత్ గణతంత్ర దినోత్సహం సందర్భంగా మువ్వన్నెల జెండా ఎగురవేయనున్నారు. గణతంత్ర దినోత్సవన అన్ని ప్రభుత్వ స్కూళ్లు, విద్యా సంస్థల్లో తప్పని సరిగా జెండా ఎగురవేయాలని సీపీఎం ఆధ్వర్యంలోని ఎల్డీఎఫ్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. విద్యా సంస్థల అధినేతలు ఆ రోజున జెండా ఎగురవేయడంతో పాటు జాతీయ గీతాన్ని తప్పని సరిగా పాడాలని ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసింది.

రెండేళ్లలో 25 మంది పౌరుల మృతి

జమ్మూ: వాస్తవాధీన రేఖ వెంబడి పాకిస్థాన్‌తో జరిగిన కాల్పుల్లో 2016-17లో 25 మంది పౌరులు మరణించారని, 163 మంది గాయపడ్డారని జమ్మూకాశ్మీర్ ప్రభుత్వం తెలిపింది. ఎమ్మెల్సీలు అలీ మొహమ్మద్ దార్, షౌకత్ హుసైన్ గనై అడిన ప్రశ్నలకు లిఖితపూర్వక సమాధానంలో రెవెన్యూ శాఖ మంత్రి అబ్దుల్ రెహ్మాన్ వీరి, 2016లో జమ్మూలో ఇద్దరు మరణించారని తెలిపారు. సాంబాలో ఆరుగురు, రజౌరీలో ఇద్దరు, పూన్చ్‌లో ముగ్గురు మరణించారని తెలిపారు.

విదర్భకు రాష్ట్ర హోదా ఇవ్వండి

న్యూఢిల్లీ: రానున్న పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో శివసేన ఒంటరిగా పోటీ చేసేందుకు సన్నద్ధం అవుతున్న పరిస్థితుల్లో బీజేపీ వాగ్దానమైన 'ప్రత్యేక రాష్ట్రంగా విదర్భను అమలు చేసితీరాలని బీజేపీ ఎమ్మెల్యే ఆషీశ్ దేష్‌ముఖ్ అన్నారు. విదర్భకు రాష్ట్ర హోదాను వ్యతిరేకించిన శివసేన మిత్రపక్షం నుంచి వైదలగుతున్నందున ఇక ప్రభుత్వం ప్రత్యేక రాష్ట్రంకు ఏర్పాటు చేయాల్సిందేనని ఆయన డిమాండు చేశారు.

ఎన్నికల గుర్తుపై సమాధానం ఇవ్వండి: హైకోర్టు

న్యూఢిల్లీ : రెండాకుల గుర్తు పెండింగ్‌లో ఉన్నందున తనకు పార్టీకు పేరు, ఎన్నికల గుర్తును కేటాయించాలని టీటీవీ దినకరన్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు ఎన్నికల సంఘం స్పందనను కోరింది. ఏ పార్టీకి రెండాకుల గుర్తును కేటాయించాలనే విషయంపై సమాధానం కోరుతూ ముఖ్యమంత్రి ఈకే. పళనీస్వామి, ఉప ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వంకు జస్టిస్ రేఖ పల్లి నోటీసులు పంపారు. తదుపరి విచారణకు ఫిబ్రవరి 6న కేసును వాయిదా వేశారు.

చిత్తోడ్ కోట మూత

జయపుర్: రాజస్థాన్ జయపురలోని చిత్తోడ్ కోట మూతపడింది. వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఈ కోట మూతపడడం ఇది రెండోసారి. ఏడో శతాబ్దిలో నిర్మించిన ఈ కోటను యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించింది.రాజ్‌పుత్ రాణి పద్మిణి చరిత్రను సినిమాలో వక్రీకరించారని రాజ్‌పుత్‌లు పలు రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. పద్మావత్ సినిమా విడుదల చేస్తే చిత్తోడ్ కోట ముందు ఆత్మాహుతి చేసుకుంటామని వేలాది మంది రాజ్‌పుత్ మహిళలు హెచ్చరిస్తున్నారు. అయితే రాజస్థాన్‌లో సినిమా విడుదల చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. శాంతిభద్రతల సమస్య వచ్చే అవకాశం ఉన్నందున సినిమాను నిషేధించాలని రాజస్థాన్ చేసిన అప్పీల్‌ను కోర్టు తిరస్కరించింది.

విజయవాడ రైల్వేస్టేషన్‌లో ఎగ్జిక్యూటివ్ లాంజ్



విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : దక్షిణ మధ్యరైల్వేలో తొలిసారి ఉన్నతశ్రేణి ప్రయాణికుల సౌకర్యార్థం విజయవాడ రైల్వేస్టేషన్ ఒకటో నంబరు ప్లాట్‌ఫామ్‌పై అధునాతన సౌకర్యాలతో ఎగ్జిక్యూటివ్ లాంజ్ ఏర్పాటు చేసినట్లు రైల్వే విజయవాడ డివిజనల్ మేనేజర్ ధనుంజయులు తెలిపారు. రైల్వేస్టేషన్‌లో బుధవారం ఆయన ఏసీ లాంజ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎగ్జిక్యూటివ్ లాంజ్‌లో ఐనాక్స్ థియేటర్స్‌లోని ఫ్రీ ఇంటర్ నెట్, శీతలపానీయాలు, టీ, పుస్తకాలు, టీవీ, న్యూస్ పేపర్స్, లాకర్, వాష్ రూమ్‌తోపాటు మహిళల కోసం ప్రత్యేక వెయిటింగ్ హాల్ ఏర్పాటు చేశామన్నారు. దీనిలో విశ్రాంతి తీసుకునే ప్రయాణికుల నుంచి మొదటి రెండు గంటలకు రూ.150 వసూలు చేస్తారు. అనంతరం ప్రతి గంటకు అదనంగా రూ. 50 ఉంటుందన్నారు. వీటితోపాటు నిర్ణయించిన ధరలకు ఆహార పదార్థాలు అందిస్తారన్నారు.

ఈ లాంజ్ నిర్మాణానికి ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) ఆధ్వర్యంలో 350 స్క్వేర్ ఫీట్‌లో కోటి రూపాయలు ఖర్చు చేశారన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎంలు ఎమ్.వి.ఎస్. రామరాజు, జి.సుమనా, ఐఆర్‌సీటీసీ గ్రూపు జనరల్ మేనేజర్ డి.నరసింగ్‌రావు, రైల్వేస్టేషన్ డైరెక్టర్ సి.హెచ్.సురేష్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



అరసవల్లిలో వైభవంగా రథసప్తమి వేడుకలు

విశాలాంధ్రబ్యూరో-శ్రీకాకుళం : ప్రపంచ ప్రసిద్ధిపొందిన శ్రీకాకుళం జిల్లా అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవాలయంలో రథసప్తమి వేడుకలు బుధవారం వైభవంగా జరిగాయి. మంగళవారం అర్ధరాత్రి 12 గంటల నుండి మొదలైన స్వామి వారి నిజరూప దర్శనానికి భక్తులు పోటెత్తారు. విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానంద స్వామి లాంఛనంగా స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి తొలి క్షీరాభిషేకాన్ని నిర్వహించారు. మహాక్షీరాభిషేకాన్ని ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ప్రభుత్వం తరపున హాజరైన దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ మూర్తి, ఈవో శ్యామలాదేవి, స్థానిక ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి సమక్షంలో పూర్తిచేశారు. ఉత్తరాంధ్రతో సహా, ఒడిశా రాష్ట్రం నుండీ భారీ ఎత్తున హాజరైన భక్తులకు ఎలాంటి అసౌకర్యంగా కలగకుండా 900 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రవాణా శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ప్రభుత్వ విప్ కూనరవికుమార్, ఎమ్మెల్యేలు గౌతు శివాజీ, బగ్గు రమణమూర్తి, కళావతితో పాటు కలెక్టర్ కె.ధనుంజయరెడ్డి, ఎస్పీ తివిక్రమవర్మ తదితరులు స్వామివారికి పూజలు నిర్వహించారు.

చిక్కుల్లో పక్కా ఇళ్ల బిల్లులు

- ఆఫీసుల చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణలు
- ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం
- ఉపాధి హామీ నిధుల మంజూరుకు బ్రేక్



విశాలాంధ్ర - విజయవాడ : అర్హులందరికీ పక్కా ఇల్లు కట్టిస్తామంటూ ప్రభుత్వ పెద్దల ప్రకటనలు క్షేత్ర స్థాయిలో అపహాస్యానికి గురవుతున్నాయి. ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వ భరోసాతో ఇల్లు నిర్మాణం చేపట్టిన పేద లబ్ధిదారులకు బిల్లులు సకాలంలో మంజూరు కాకపోవడంతో తలలు పట్టుకుంటున్నారు. బిల్లుల మంజూరు కోసం గృహనిర్మాణ సంస్థ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా ఫలితం లేకపోవడంతో తమ గోడు ఎవరికి చెప్పుకోవాలో తెలియక దిక్కులు చూస్తున్నారు. గృహ నిర్మాణ సంస్థ, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం అధికారుల మధ్య సమన్వయ లోపంతో లబ్ధిదారుల కష్టాలు కొనసాగుతున్నాయి. ఇటీవల కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో లబ్ధిదారులకు ఉపాధి హామీ పథకం ద్వారా బిల్లుల మంజూరు అంశం ప్రస్తావనకు వచ్చిన నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్వయంగా పరిష్కరించాలని సూచనలు చేసినా ప్రయోజనం కానరావడం లేదు. బిల్లుల చెల్లింపు బాధ్యత మాది కాదంటే, మాది కాదంటూ రెండు శాఖల అధికారులు వ్యాఖ్యానించడంతో లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. ఉదాహరణకు కృష్ణాజిల్లా ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద 16,750 ఇళ్లు నిర్మించాలని నిర్ణయించారు. వీటిలో 15,791 గృహాల నిర్మాణాలకు అనుమతులు కూడా ఇచ్చారు. ఒక్కో గృహానికి ప్రభుత్వం రూ.1.50 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. గృహ నిర్మాణంలో పని చేసినందుకు, ఇటుకల తయారీలో కూలీల పని దినాలు లెక్కించి రూ.55 వేలు ఉపాధి హామీ నిధులు ఇవ్వాలని నిర్ణయించారు. ఇదే లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తోంది. ఇంటి నిర్మాణం పూర్తి చేసిన లబ్ధిదారులు తమకు బిల్లులు ఇవ్వాలని గృహ నిర్మాణ సంస్థ అధికారుల వద్దకు వెళితే ఉపాధి పథకం ద్వారా వచ్చే రూ.55 వేలతో తమకు సంబంధం లేదని వారు తెగేసి చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బిల్లులు మంజూరు చేస్తూ మిగిలిన రూ.55 వేలు ఇచ్చే అధికారం తమకు లేదని చెప్పడంతో లబ్ధి దారులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే జిల్లాలో 3,145 గృహాలు పూర్తయ్యాయి. రూఫ్ లెవల్ దశలో 1,933, పునాదులు పూర్తి చేసిన, పునాదుల దశలో 8,500 గృహాలు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ముందస్తుగా నిర్మాణాలు పూర్తి చేసిన లబ్ధిదారులకు బిల్లులు పెండింగ్‌లో ఉంచడంతో మిగిలిన పేదలు నిర్మాణాలు చేపట్టేందుకు వెనుకంజ వేస్తున్నారు. ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం లబ్ధిదారుల నుంచి తీవ్రమైన ఒత్తిడి రావడంతో గతేడాది నవంబరులో ఉపాధి నిధుల నుంచి ఇచ్చే రూ.55 వేలకు సంబంధించి బిల్లులు తయారుచేసే పనులను గృహ నిర్మాణ సంస్థ అధికారులకు అప్పగించారు. ఉపాధి కూలీలకు జాబ్ కార్డుల ఆధారంగా పని దినాలు చూపించి కొంత మేర బిల్లులు తయారు చేశారు. గృహనిర్మాణశాఖ అధికారులు చూపిన కూలీల లెక్కల్లో మరణించిన వారు కూడా పనులు చేసినట్లు చూపిన విషయం ఆధార్ కార్డు ఆధారంగా బయటపడటంతో ఆ బాధ్యతల నుంచి హౌసింగ్ శాఖ అధికారులను తొలగించారు. దీంతో బిల్లుల చెల్లింపులు నిలిచి పోయాయి. బిల్లుల బాధ్యతను ఉపాధి అధికారులే చూడాలని లబ్ధిదారులకు గృహ నిర్మాణశాఖ అధికారులు చెప్పడంతో తలలు పట్టుకుంటున్నారు. ఉపాధి పథకం అధికారులు ఈ బిల్లుల వైపు కన్నెత్తి చూడకపోవడంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది. ఉపాధి నిధుల నుంచి చెల్లించాల్సిన రూ.55 వేల బిల్లును ఎవరు చేయాలనే అంశంపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోలేదు. గృహనిర్మాణ శాఖ, ఉపాధి పథకం అధికారుల మధ్య నెలకొన్న వివాదంతో బిల్లులకు బ్రేక్ పడింది. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం చొరవ చూపాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



ఆర్టీసీ కార్మికులందరికీ సమన్యాయం

విశాలాంధ్ర-విశాఖపట్నం : నాలుగు జిల్లాల్లోని ఆర్టీసీ కార్మికులందరికీ సమన్యాయం అందిస్తామని ఆర్టీసీ విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ) రామకృష్ణ స్పష్టం చేశారు. విశాఖలోని ఈడీ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆర్టీసీ ఈయూ నేతలు పలిశెట్టి దామోదరావు, జోనల్ కార్యదర్శి భానుమూర్తి ఆయనతో భేటీ అయ్యారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. విశాఖ రీజియన్ అధికారులు, సూపర్‌వైజర్ల పక్షపాత వైఖరిని నేతలు ఈడీ దృష్టికి తీసుకొచ్చారు. మధురవాడ, స్టీల్‌సిటీ డిపోలో బస్సుల సంఖ్య పెంచాలని, విశాఖ డిపోలో 55 ఏళ్ల వయస్సు దాటిన వారిని బదిలీ చేయకుండా చూడాలని, విశాఖ రీజియన్‌లోని కార్మికులందరికీ యూనియన్లతో సంబంధం లేకుండా న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈడీ స్పందించి ఆర్టీసీ కార్మికుల సమస్య పరిష్కారానికి అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఈయూ జోనల్ నాయకులు కె.జె సుభాకర్, అల్లూ సురేష్‌నాయుడు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యుత్తమ సేవలు

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాసరావు

విశాలాంధ్ర-తెనాలి : ఆధునిక సౌకర్యాలతో ప్రభుత్వ వైద్యశాలలో పేదలకు మెరుగైన సేవలు అందుబాటులోకి తీసుకొచ్చినట్టు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాసరావు అన్నారు. రూ.18.50 కోట్లతో జిల్లా వైద్యశాలలో నూతనంగా నిర్మించిన మాతా శిశు సంక్షేమ కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. తొలుత ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంగా ప్రభుత్వ వైద్యశాలలో సౌకర్యాలు కల్పిస్తున్నామని, ఈ క్రమంలో తెనాలి జిల్లా వైద్యశాలలో రూ.15.50కోట్లతో రూపుదిద్దుకునన మాతా శిశు సంక్షేమ కేంద్రం జిల్లాకే తలమానికమన్నారు. మంచి సంకల్పంతో వైద్యుల సేవలతో తెనాలిలో ఓపి 1500లకు పెరిగిందని, ప్రతినెలా 300 వరకు కాన్పులు జరగటం ఎంతో స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు, రానున్న రోజుల్లో తల్లిబిడ్డల వైద్య విభాగం ద్వారా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయన్నారు. ప్రభుత్వ సెక్టారులో తెనాలి ఆస్పత్రికి ఓ గుర్తింపు రానుందన్నారు. ఈ ప్రాంతంలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు అవకాశం కల్పిస్తామన్నారు. రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్మన్ నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ ప్రతి జిల్లా కేంద్రంలో మహిళల వైద్య అవసరాలకు తల్లిబిడ్డల సంక్షేమ కేంద్రాల అవసరం ఉందన్నారు. ఎమ్మెల్యే రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ నాడు 150 పడకలతో ప్రారంభమైన వైద్యశాల 300 పడకల స్థాయికి చేరడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైద్యశాల సూపరింటెండెంట్ సనత్‌కుమారి, మార్కెట్ యార్డు ఛైర్మన్ గడవర్తి సుబ్బయ్య, మున్సిపల్ ఛైర్మన్ పెండేల వెంకట్రావు, హాస్పటల్ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ వంకాయలపాటి అబ్బయ్య, ఆర్డీవో జి.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మారే ప్రసక్తే లేదు



విశాలాంధ్ర-కోడుమూరు : కాంగ్రెస్ పార్టీ నుంచి దూరమయ్యే ప్రసక్తే లేదని కేంద్ర మాజీ మంత్రి కోట్ల జయ సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. కర్నూలు జిల్లా కోడుమూరులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీన జరిగిన ఎంపీపీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఏకగ్రీవంగా ఎంపీపీ స్థానం దక్కించుకోవడంతో పార్టీకి పూర్వ వైభవం వచ్చిందన్నారు. రాష్ట్రంలో 2019 ఎన్నికలకు ఇక్కడి నుంచే కాంగ్రెస్ విజయకేతనంతో జెండా ఎగుర వేశామన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో ప్రజలు విసుగు చెందడంతో కాంగ్రెస్‌కు పట్టం కట్టారన్నారు. గ్రామాలను అభివృద్ధి చేస్తామని, ఉద్యోగాలు ఇప్పిస్తామని టీడీపీ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చినప్పటికీ ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. రైతాంగం సంక్షోభంలో చిక్కుకుందని, పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలోనే వెనుకబడిన కర్నూలు జిల్లాలో ఒక్క చెరువును నీటితో నింపలేదని, ఇక్కడి నుంచి నీళ్లు తీసుకువెళ్ళి అనంతపురం జిల్లా చెరువులు నింపుతుంటే కర్నూలు జిల్లా నేతలు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు లక్కసాగరం లక్ష్మిరెడ్డి, నాయకులు కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, సర్పంచ్ సీబీ లత, సింగిల్‌విండో అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీకాంత్ మృతి జర్నలిస్టులకు తీరని లోటు



విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ప్రముఖ పాత్రికేయులు గుర్రంకొండ శ్రీకాంత్ మృతి జర్నలిజం సమాజానికి తీరని లోటని ఇండియన్ జర్నలిస్టుల యూనియన్ (ఐజేయూ) ఉపాధ్యక్షులు అంబటి ఆంజనేయులు అన్నారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (ఏపీయూడబ్ల్యూజే) కృష్ణా అర్బన్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం యూనియన్ అధ్యక్షులు జి.రామారావు అధ్యక్షతన విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శ్రీకాంత్ సంస్మరణ సభ జరిగింది. తొలుత ఆయన చిత్రపటానికి యూనియన్ నాయకులు, జర్నలిస్టులు పూల మాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా అంబటి ఆంజనేయులు మాట్లాడుతూ జర్నలిస్టుగా, కవిగా, రచయితగా విభిన్న కోణాల్లో శ్రీకాంత్ సమాజానికి అందించిన సేవలు శ్లాఘనీయమన్నారు. అనేక మంది జర్నలిస్టులను తీర్చిదిద్దిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. జర్నలిస్టులకు ఆయన చెప్పిన పాఠాలను పుస్తక రూపంలో తీసుకురావాలన్నారు. యూనియన్ రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఎస్.కె.బాబు మాట్లాడుతూ తెలుగుభాషపై పట్టున్న వ్యక్తి శ్రీకాంత్ అన్నారు. ప్రగతిశీల భావాలు కలిగిన అభ్యుదయవాది శ్రీకాంత్ లాంటి వ్యక్తులు నేటి సమాజానికి ఎంతో అవసరమన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలలో ఆయన తీర్చిదిద్దిన 400 నుంచి 500 మంది జర్నలిస్టులు వివిధ పత్రికలు, టీవీ చానళ్లలో ఉన్నత స్థాయిల్లో పనిచేయడం స్ఫూర్తి దాయకమన్నారు. ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా విభాగం రాష్ట్రఅధ్యక్షులు చందు జనార్దన్, ఏపీ యూడబ్ల్యూజే రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి కె.జయరాజ్, ఉపాధ్యక్షులు మచ్చా రామలింగారెడ్డి, సీనియర్ నాయ కులు ఎస్.వి.ఎస్. చలపతిరావు, కృష్ణా అర్బన్ యూని యన్ కార్యదర్శి దారం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఐజీగా గోపాలరావు బాధ్యతల స్వీకారం



విశాలాంధ్ర-గుంటూరు క్రైం : దక్షిణ కోస్తా మండలం, గుంటూరు రేంజి డీఐజీ కేవీవీ గోపాలరావుకు ఐజీ పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసిన నేపథ్యంలో బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు అర్బన్, గుంటూరు రూరల్, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు దక్షిణకోస్తా మండలం గుంటూరు రేంజి పరిధిలో ఉన్నాయి. నూతన బాధ్యతలు స్వీకరించిన గోపాలరావును ఆయన కార్యాలయంలో గుంటూరు అర్బన్ జిల్లా ఎస్పీ సీహెచ్ విజయారావు, కృష్ణాజిల్లా ఎస్పీ సర్వశ్రేష్ఠత్రిపాఠితోపాటు పలువురు పోలీసులు అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం ఐజీ గోపాలరావు డీజీపీ కార్యాలయానికి పయనమయ్యారు.

సినీపాటల రచయిత చంద్రబోస్‌కు వేటూరి పురస్కారం



విశాలాంధ్ర-పాయకరావుపేట : వేటూరి సుందరరామ్మూర్తి జయంతిని పురస్కరించుకొని ఏటా సాహితీరంగ ప్రముఖులకు ఇస్తున్న వేటూరి పురస్కారాన్ని ఈ ఏడాది సినీ పాటల రచయిత చంద్రబోస్‌కు ఇవ్వనున్నట్లు వేటూరి సాహితీపీఠం వ్యవస్థాపక కార్యదర్శి కలగ రామజోగేశ్వర శర్మ ప్రకటించారు. విశాఖ జిల్లా పాయకరావుపేటలో బుధవారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. వేటూరి సాహితీ పీఠం, శ్రీప్రకాష్ ఎడ్యుకేషనల్, కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీన తుని వేదికగా ఈ పురస్కారం అందజేయనున్నామన్నారు. వేటూరి సాహితీ పీఠం శాశ్వత గౌరవాధ్యక్షులు, సినీనటులు తనికెళ్ల భరణి, వ్యవస్థాపక అధ్యక్షులు, వ్యాపారవేత్త చక్కా సూర్యనారాయణ, అధ్యక్షులు శ్రీప్రకాష్ విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు హాజరవుతారని శర్మ పేర్కొన్నారు.

నూతన పెన్షన్ విధానం రద్దు చేయకుంటే

నిరవధిక సమ్మెకు సిద్ధం

రైల్వే మజ్దూర్ యూనియన్ నేత జీఎన్ శ్రీనివాసరావు



విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రైల్వే కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు రైల్వే వ్యవస్థకు పెనుప్రమాదకరంగా మారాయని, ఉద్యోగి ప్రాథమిక హక్కు అయిన పెన్షన్‌ను నిర్వీర్యం చేస్తూ నూతన పెన్షన్ విధానం తీసుకురావడం దారుణమని రైల్వే మజ్దూర్ యూనియన్ విజయవాడ డివిజనల్ సెక్రటరీ జీఎన్ శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త విధానాన్ని తక్షణం ఉపసంహరించకపోతే నిరవధిక సమ్మెకు వెళ్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ ఆల్ ఇండియా రైల్వేమెన్ ఫెడరేషన్, సౌత్‌సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ పిలుపు మేరకు బుధవారం విజయవాడ రైల్వే డివిజనల్ కార్యాలయం ఎదుట అన్ని విభాగాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రైల్వేలో 2004 జనవరి ఒకటో తేదీ తరువాత చేరిన ఉద్యోగులను జాతీయ పెన్షన్ విధానంలో చేర్చడం ద్వారా ఉద్యోగవిరమణ తరువాత ఎటువంటి ప్రయోజనాలు ఉండకపోగా, పెన్షన్ రాదన్నారు. ఉద్యోగులు తమ వేతనంలో 10శాతం పెన్షన్ అకౌంట్‌కు జమచేయాల్సి వస్తుందన్నారు. పాత పెన్షన్ విధానంలో ఉద్యోగులు కేవలం 8.33 శాతం మాత్రమే చెల్లించేవారని, నూతన విధానంలో ఉద్యోగుల నుంచి వసూలు చేసిన మొత్తం షేర్ మార్కెట్‌లో పెట్టుబడిగా పెట్టడంతో ఎలాంటి భద్రత లేకుండా పోతుందన్నారు. అలాగే ఫ్యామిలీ పెన్షన్ సదుపాయం లేకపోవడం ప్రమాదకరమన్నారు. ఉద్యోగ విరమణ సమయంలో వచ్చే నగదుపై పన్నులు విధించడం దారుణమన్నారు. రైల్వేలో ఖాళీ పోస్టులను తక్షణం భర్తీ చేసి ఉద్యోగులపై పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. 7వ వేతన సంఘం వచ్చిన తరువాత పెన్షన్ మార్పులు సకాలంలో పూర్తి చేయాలని, అకౌంట్స్ సిబ్బంది, పర్సనల్ ఆఫీసు సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడంతోపాటు రన్నింగ్ సిబ్బంది బకాయిలు చెల్లించాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే నిరవధిక సమ్మెకు వెనకాడేది లేదన్నారు. ఈ నిరసనలో జోనల్ ఉపాధ్యక్షులు పి.రాంగోపాల్, కోశాధికారి ఆర్.ఎం.లక్ష్మి, సహాయ కార్యదర్శులు ఐ.శ్రీనివాసరావు, డి.శ్రీనివాస్, రామగుప్తా, లీల తదితరులు పాల్గొన్నారు.



'ఈ-నామ్' అమలుకు మౌలిక సదుపాయాలు

గుంటూరు మిర్చి యార్డు ఛైర్మన్ మన్నవ సుబ్బారావు

విశాలాంధ్ర-గుంటూరు జిల్లాపరిషత్ : గుంటూరు మిర్చి యార్డులో ఈ-నామ్ విధానం అమలుకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేస్తున్నట్లు గుంటూరు మిర్చి యార్డు ఛైర్మన్ మన్నవ సుబ్బారావు తెలిపారు. ఈ-నామ్ ద్వారా కొనుగోలు, అమ్మకాల పరిశీలనకు బుధవారం స్థానిక మిర్చి యార్డుకు వచ్చిన ఆయిల్ సీడ్స్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.కె.శ్రీవత్సవ యార్డు కార్యాలయంలో సుబ్బారావుతో సమావేశమయ్యారు. సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో ముందస్తుగా అన్ని సదుపాయాల ఏర్పాటు చేస్తున్నట్టు సుబ్బారావు వివరించారు. సర్వర్ డౌన్ కాకుండా చూస్తున్నామన్నారు. యార్డులో మిర్చి నాణ్యత పరిశీలనకు లాబోరేటరీ, ఆర్గానిక్ పంటల విక్రయానికి ప్రత్యేక ప్లాట్‌ఫాం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. శ్రీవత్సవ మాట్లాడుతూ ఈ-నామ్‌కు సంబంధించి నాణ్యతా ప్రమాణాల పరిశీలనకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖాధికారులు జి.వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, యార్డు ఇన్‌ఛార్జ్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు

- రెండువేల మంది పోలీసులతో బందోబస్తు
- 6 లక్షల మంది జనాభా రావచ్చని అంచనా
- మూడు జిల్లాల అధికారులతో కలెక్టర్ సమీక్ష



విశాలాంధ్ర - శ్రీశైలం: కర్నూలు జిల్లాలోని శ్రీశైలం మహాక్షేత్రంలో ఫిబ్రవరి 6వ తేదీ నుంచి జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ ఎస్. సత్యనారాయణ బుధవారం దేవస్థానం పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో కర్నూలు, ప్రకాశం, మహబూబ్ నగర్ జిల్లాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కర్నూలు జిల్లా ఎస్పీ గోపీనాథ్‌జెట్టి, జాయింట్ కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ శ్రీశైలం తరలివచ్చే భక్తులు, శివస్వాములకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. పాతాళగంగ వద్ద బారికేడ్లు పటిష్టంగా ఉండాలన్నారు. పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు వీలైనంత ఎక్కువ సంఖ్యలో తాత్కాలిక గదులు ఏర్పాటు చేయాలన్నారు. గజ ఈతగాళ్లను సిద్ధం చేయాలన్నారు. కాలినడకన వచ్చే భక్తులకు నీటి వసతి, అన్నదాన శిబిరాల వద్ద ట్యాంకర్లను ఏర్పాటు చేయాలన్నారు. నాగలూటి, భీముని కొలను, పెచ్చెరువు, కైలాసద్వారం వద్ద మెడికల్ క్యాంపులను ఏర్పాటుచేయాలని, భక్తులు సేద తీరేందుకు చలువ పందిళ్ళు వేయాలన్నారు. రహదారుల వెంట సూచిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లకు రేడియం స్టిక్కర్లు, పెయింటింగ్ వేయాలన్నారు. పరిశుభ్రతకు 1150 మంది పారిశుద్ధ్య సిబ్బందిని నియమించామన్నారు. ఎస్పీ గోపీనాథ్‌జెట్టి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో 2వేలకుపైగా పోలీస్ సిబ్బంది విధులు నిర్వహిస్తారన్నారు.

ప్రేమికుల వివాదం విషాదాంతం

- అమ్మాయి తండ్రి అనుమానాస్పద మృతి
- అబ్బాయి తల్లి ఆత్మహత్యాయత్నం

విశాలాంధ్ర-టెక్కలి : ప్రేమజంట మధ్య తలెత్తిన వివాదం చిలికి చిలికి గాలివానగా మారి ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం మిగిల్చింది. ప్రేమికురాలి తండ్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా, ప్రియుడి తల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన బుధవారం శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో చోటు చేసుకుంది. టెక్కలి మండలంలోని తొలుసూరుపల్లి గ్రామానికి చెందిన వమ్మరవిల్లి జోగారావు(55) కుమార్తెకు, టెక్కలి పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన దుంపల కళ్యాణ్ మధ్య కొన్నేళ్లుగా ప్రేమ వ్యవహారం నడుస్తున్నది. ఇటీవల కళ్యాణ్‌కు ఉద్యోగం రావడంతో ఢిల్లీలో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ వ్యవహారంలో ఇరు కుటుంబాల మధ్య వివాదం పోలీస్‌స్టేషన్‌లో నడుస్తున్నది. సంక్రాంతి సెలవులకు కళ్యాణ్ స్వగ్రామం రావడంతో వీరి ప్రేమ వివాదం తీవ్రస్థాయికి చేరింది. కళ్యాణ్ పెళ్ళికి నిరాకరించినట్లు సమాచారం. కళ్యాణ్ విధుల్లో భాగంగా ఢిల్లీ వెళ్ళిపోతున్న నేపథ్యంలో అమ్మాయి తండ్రి జోగారావు తన గృహంలో బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయం ఆ నోట ఈ నోట తెలుసు కున్న కళ్యాణ్ తల్లి దుంపల నిర్మల తన ఇంట్లో ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు. ఆమె ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందు తున్నారు. తొలుసూరుపల్లి గ్రామ పెద్దలు కొందరితో బుధవారం అర్ధరాత్రి వరకూ రాజీయత్నాలు చేసినట్టు తెలుస్తున్నది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ప్రభుత్వ బ్యాంకులకు

మూలధన సాయం రూ.88 వేల కోట్లు

ఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి దేశవ్యాప్తంగా ప్రభుత్వ బ్యాంకులకు రూ.88,139 కోట్లు అదనపు మూలధన సాయాన్ని కేంద్రం అందించనుంది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బుధవారం వెల్లడించారు. అన్ని అవ సరాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే ఈ మొత్తాన్ని కేటాయించినట్లు తెలిపారు. ఈ బ్యాంకుల్లో ఐడీబీఐ బ్యాంకుకు అత్యధికంగా రూ.10,610 కోట్లు ఇవ్వనున్నారు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రూ.8,800 కోట్లు, బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రూ.9,232 కోట్లు అందించనున్నారు. ప్రభుత్వ రంగ బ్యాంకులు నిరర్థక ఆస్తులు, మొండి బకాయిలతో సమస్యలు ఎదుర్కొంటున్నాయని, వాటిని ముందు స్థితికి తీసుకొచ్చేందుకు రూ.2.1 లక్షల కోట్లతో బ్యాంక్ రీక్యాపిటలైజేషన్ తీసుకొస్తున్నట్లు గతేడాది అక్టోబరులో ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. 2017-18, 2018-19 ఆర్థిక సంవత్సరాల్లో ఈ మొత్తం మూలధనాన్ని బ్యాంకులకు ఇవ్వనున్నారు.

ఏయే బ్యాంకులకు ఎంతంటే..

ఐడీబీఐ బ్యాంకు రూ.10,610కోట్లు, ఎస్‌బీఐ రూ.8,800 కోట్లు, బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.9,232 కోట్లు, యూకో బ్యాంక్ రూ.6,507 కోట్లు, పంజాబ్ నేషనల్ బ్యాంక్ రూ.5,473 కోట్లు, బ్యాంక్ ఆఫ్ బరోడా రూ.5,375 కోట్లు, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.5,158 కోట్లు, కెనరా బ్యాంక్ రూ.4,865 కోట్లు, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ రూ.4,694 కోట్లు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండి యా రూ.4,524 కోట్లు, ఓరియంటల్ బ్యాంక్ రూ.3,571 కోట్లు, దేనా బ్యాంక్ రూ.3,045 కోట్లు, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర రూ.3,173 కోట్లు, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.2,634 కోట్లు, కార్పొరేషన్ బ్యాంక్ రూ.2,187 కోట్లు, సిండి కేట్ బ్యాంక్ రూ.2,839 కోట్లు, ఆంధ్రాబ్యాంక్ రూ.1,890 కోట్లు, అలహాబాద్ బ్యాంక్ రూ.1,500 కోట్లు, పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ రూ. 785 కోట్లు.

ఏపీకి ఎయిర్ క్రాఫ్ట్-సి 295

సీఎంతో ఎయిర్ బస్ డిఫెన్స్ సీఈవో డిర్క్‌హోక్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : భారత్‌లో తమ ట్రాన్స్‌పోర్ట్ ఎయిర్ క్రాఫ్ట్ సి-295 ఉత్పాదక సంస్థను ప్రారంభిస్తామని ఎయిర్ బస్ డిఫెన్స్ సీఈవో డిర్క్‌హోక్ తెలిపారు. ఇందుకు అనుమతులను సమకూర్చుకుంటున్నామని తెలిపారు. బుధవారం దావోస్‌లో ఆయన సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు. టాటా ఎయిర్ బస్‌తో సంయుక్త భాగస్వామ్యంలో చేస్తున్న ఈ ప్రాజెక్టును ఈ ఏడాది ఆఖరులోగా ఎట్టి పరిస్థితుల్లోనూ నెలకొల్పుతామని చెప్పారు. వివిధ దేశాల్లో వున్న తమ ఉత్పాదక యూనిట్లను ఒక సారి సందర్శించాలని ఆయన ముఖ్యమంత్రిని ఆహ్వానించగా, తక్షణమే అన్ని అనుమతులిచ్చి ఉత్పాదక కేంద్ర స్థాపనకు సహకరిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. తర్వాత వేదాంత సంస్థ ఛైర్మన్ అనిల్ అగర్వాల్ ముఖ్యమంత్రిని కల్సి తమకు భారత్‌లో బోస్టన్ తరహాలో ఒక విశ్వవిద్యాలయం టౌన్‌షిప్‌ను నెలకొల్పే ఉద్దేశం వుందని తెలిపారు. ఏపీలో ఏర్పాటు చేస్తే అందుకు అవసరమైన పూర్తి సహకారాన్ని అందజేస్తామని సీఎం తెలిపారు. విశాఖ నగరంలో జంట శిఖరాలను నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే వేదాంతకు భూమిని కేటాయించి అనుమతులు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. పారిశ్రామికవేత్తలను ఆకర్షించడంలో ఏపీ ప్రభుత్వం తీసుకుంటున్న చొరవను ఈ సందర్భంగా అనిల్ అగర్వాల్ ప్రశంసించారు.

అసెంబ్లీకి వైసీపీ దూరం ?



బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

బుగ్గన అస్పష్ట సమాధానం

ఫిరాయింపుదారులకు మంత్రి పదవులా? : విష్ణుకుమార్‌రాజు



విష్ణుకుమార్‌రాజు

విశాలాంధ్ర-అమరావతి : రెండురోజులుగా జరుగుతున్న పీఏసీ సమావేశాలకు హాజరైన సంస్థ ఛైర్మన్, వైసీపీ ఎమ్మెల్యే బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, పీఏసీ సభ్యుడు, బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజులు బుధవారం మీడియాతో మాట్లాడిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో సంచలనం కలిగించాయి. వివరాలు ఇలా ఉన్నాయి. వచ్చేనెల జరగనున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హాజరయ్యే పరిస్థితి కన్పించటం లేదు. ఈసారి అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతారా అని ప్రశ్నించగా ఏమో అని బుగ్గన దాటేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ముఖ్యనేతగా ఉన్న బుగ్గన అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యే అంశంపై స్పష్టత ఇవ్వకపోవడంతో బడ్జెట్ సమావేశాలకు వైసీపీ దూరమవుతుందన్న వ్యాఖ్యలు వినిపించాయి. బుగ్గన ఈ వాఖ్య చేసినప్పుడు విష్ణుకుమార్‌రాజు కూడా అక్కడే ఉన్నారు. గడిచిన అసెంబ్లీ సమావేశాలను వైయస్సార్‌సీపీ బహిష్కరించింది. అసెంబ్లీని బహిష్కరించాలన్న వైయస్ జగన్ నిర్ణయాన్ని పలురాజకీయ పక్షాలు తప్పుబట్టాయి. అయినా జగన్ అసెంబ్లీకి హాజరు కాకుండా ప్రజా సంకల్పయాత్ర పేరుతో పాదయాత్రలు చేపట్టారు. 60 ఏళ్ల ఆంధ్ర చరిత్రలో ప్రతిపక్ష సభ్యులు లేకుండా అసెంబ్లీ సమావేశాలు జరగటం అదే తొలిసారి. బడ్జెట్ సమావేశాల కన్నా ప్రతిపక్షం హాజరవుతుందని ఇప్పటివరకు అందరూ భావిస్తూ వచ్చారు. దీనికి తోడు బడ్జెట్ సమావేశాలు చాలా కీలకమైనవి. కొత్త నియోజకవర్గాల పెంపు జరిగే అవకాశాలు ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. పోలవరం నిధులు, కేంద్ర ప్రాజెక్ట్‌లకు నిధులు, నదుల అనుసంధానం, రాజధాని నిర్మాణం లాంటి ప్రధాన అంశాలు ఉన్నాయి. పైగా ఈ ఏడాది అక్టోబరు, నవంబరులోనే ముందస్తు ఎన్నికలు జరిగే అవకాశం ఉందని రాజకీయవర్గాల్లో ప్రచారం సాగుతోంది. అదేసాగితే వచ్చేనెలలో జరిగే బడ్జెట్ సమావేశాలు ఇప్పుడున్న శాసనసభ్యులకు చివరి బడ్జెట్ సమావేశాలు అవుతాయి. మొత్తం మీద రాజేంద్రనాథ్‌రెడ్డి వ్యాఖ్యలతో వైసీపీ అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యే అంశంపై స్పష్టత లేకుండా పోయింది. ఇదిలా ఉండగా అక్కడే ఉన్న విష్ణుకుమార్‌రాజు రాజకీయంగా ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లో మీకిష్టమైన అంశాలు ఏమిటని మీడియా ప్రశ్నించగా ప్రతిపక్షంతో సహా అందరు సభ్యులు శాసనసభకు హాజరు కావటం తనకు నచ్చిన అంశంగాను, ఫిరాయింపు ఎమ్మెల్యేలను మంత్రులుగా చేయటం నచ్చని అంశంగాను చెప్పుకొచ్చారు. ఎమ్మెల్యేలు పార్టీ మారటాన్ని తానేమీ తప్పుపట్టనని, ఒకపార్టీ ఎమ్మెల్యేగా గెలిచి మరోపార్టీలో మంత్రులుగా చేయటం తనకు నచ్చని అంశమని విష్ణుకుమార్‌రాజు చెప్పారు. మంత్రులైన వారు ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేసి ఉంటే బాగుండేదన్నారు. తెలుగుదేశం మిత్ర పక్షమైన బీజేపీ సభ్యుడుగా ఉన్న విష్ణుకుమార్‌రాజు టీడీపీలోకి ఫిరాయించిన వైసీపీ ఎమ్మెల్యేలను మంత్రులు చేయటాన్ని వ్యతిరేకించటం అక్కడున్న వారిని ఆశ్చర్యపరిచింది. మొత్తం మీద అటు బుగ్గన వ్యాఖ్యలు, ఇటు విష్ణుకుమార్‌రాజు వ్యాఖ్యలు రాజకీయవర్గాల్లో సంచలనం సృష్టిస్తున్నాయి.

అందాలనటి కృష్ణకుమారి ఇకలేరు...!



బెంగళూరు: అలనాటి అందాల నటి కృష్ణకుమారి(83) ఇక లేరు. కేన్సర్‌తో బాధ పడుతున్న ఆమె బుధవారం ఉదయం బెంగళూరులో తుదిశ్వాస విడిచారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విభిన్న పాత్రలు పోషించి మేటి నటిగా పేరొందారు. ఎన్టీఆర్, అక్కినేని నాగేశ్వరరావు సహా కాంతారావు, కృష్ణంరాజు, జగ్గయ్య, హరనాథ్ వంటి అగ్ర హీరోలందరితోనూ ఆమె నటించారు. ఆమె మరణించారన్న వార్త తెలియగానే సినిమా ప్రముఖులు, అభిమానులు దిగ్భ్రాంతికి లోనయ్యారు. కృష్ణకుమారి పశ్చిమ బెంగాల్‌లోని నైహతిలో 1933, మార్చి 6న జన్మించారు. షావుకారు జానకి ఈమె చెల్లి. కృష్ణకుమారి సుమారు 110 పైగా తెలుగు సినిమాల్లో నటించారు. బెంగళూరుకు చెందిన అజయ్ మోహన్‌ను వివా హం చేసుకున్నారు. వీరికి దీపిక అనే కుమార్తె ఉన్నారు. 1951లో 'నవ్వితే నవరత్నాలు' సినిమాతో సినీ రంగంలోకి అడుగు పెట్టిన ఆమె... అగ్ర కథానాయికిగా ఎదిగారు. పిచ్చి పుల్లయ్య, కులగోత్రాలు, చదువుకున్న అమ్మాయిలు, డాక్టర్ చక్రవర్తి, ఆప్తమిత్రులు, అంతస్తులు, శ్రీకృష్ణావతారం, చిక్కడు దొరకడు, వరకట్నం, బంగారు భూమి, బందిపోటు తదితర సినిమాల్లో నటించారు. పల్లెపడుచు, పాతాళభైరవి, బంగారు పాప చిత్రాలతో కృష్ణకుమారి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. తెలుగులో దేవాంతకుడు, భార్యాభర్తలు, కుల గోత్రాలు, ఇలవేల్పు, వినాయక చవితి, వీరకంకణం, పెళ్లి కానుక, నిత్యకల్యాణం పచ్చతోరణం, వాగ్దానం, లక్షాధికారి, పునర్జన్మ వంటి హిట్ చిత్రాలతోపాటు కన్నడ, తమిళ, మలయాళ చిత్రాల్లోనూ నటించారు. ఉమ్మడి కుటుంబం, భువన సుందరి కథ చిత్రాల్లో వైవిధ్యమైన పాత్రలు పోషించి ప్రేక్ష కుల హృదయాల్లో చెరగని ముద్రవేసుకున్నారు. కృష్ణ కుమారి మూడు సార్లు జాతీయ అవార్డులు అందుకున్నారు. రాష్ట్ర స్థాయిలో పలు నంది అవార్డులతోపాటు కాంచనమాల, సావిత్రి, ఎన్టీఆర్ అవార్డులు అందుకున్నారు. బ్రిటన్‌లోని బర్మింగ్‌హాం సంస్థ జీవితకాల సాఫల్య పురస్కారంతో సత్కరించింది. అలనాటి అగ్రనటులతో కలిసి నటించారు. రెండు దశాబ్దాలపాటు చిత్రసీ మలో ఆమె కొనసాగారు. బెంగళూరులో ఆమె స్థిరపడ్డారు.

'మా', బాలకృష్ణ సంతాపం : సుప్రసిద్ధ నటీమణి కృష్ణకుమారి మృతి పట్ల 'మా' తీవ్ర సంతాపం ప్రకటించింది. ఆమె కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపింది. అలాగే ఆమె మృతి పట్ల నందమూరి బాలకృష్ణ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆమె కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు.

గజల్‌కు బెయిల్ - విడుదల

విశాలాంధ్ర బ్యూరో- హైదరాబాద్: గజల్ శ్రీనివాస్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరైంది. లైంగిక వేధింపుల కేసులో చంచల్‌గూడ జైల్లో ఉన్న ఆయన బుధవారం బయటకు వచ్చారు. శ్రీనివాస్‌కు రూ.10వేల నగదు పూచీకత్తుతో పాటు, ప్రతి బుధ, ఆదివారాల్లో పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ ముందు విధిగా హాజరు కావాలని కోర్టు స్పష్టంగా ఆదేశించింది. ఈ కేసులో ఏ2 నిందితురాలుగా ఉన్న పార్వతికి కూడా ముం దస్తు బెయిల్‌ను మంజూరైంది. ఉద్యోగినిని లైంగి కంగా వేధించిన కేసులో గజల్ శ్రీనివాస్‌ను పంజా గుట్ట పోలీసులు ఈనెల 2న అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మెట్రోపాలిటన్ న్యాయస్థానంలో బెయిల్ కోసం దాఖలు చేసిన పిటిషన్ తిరస్కరణకు గురవ్వడంతో ఈ నెల 12న నాంపల్లి సెషన్స్ కోర్టులో గజల్ తరపు న్యాయవాది బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. రిమాండ్‌లోని గజల్‌కు బెయిల్ మంజూరు చేయాలంటూ ఆయన తరపు న్యాయవాది వేసిన పిటిషన్‌పై మంగళవారం విచారణ జరిగింది. గజల్‌కు బెయిల్ ఇవ్వవద్దంటూ పంజాగుట్ట పోలీసులు కౌంటర్ వ్యాజ్యం దాఖలు చేశారు. బెయిల్ దొరికితే సాక్ష్యాలు తారుమారు అవుతాయని పోలీసుల తరపు న్యాయవాది వాదించారు. ఈ కేసులో రెండో నిందితురాలిగా ఉన్న పార్వతిని ఇప్పటి వరకు ఎందుకు అరెస్టు చేయలేదంటూ కోర్టు పోలీసులను ప్రశ్నించింది. పరారీలో ఉన్నందున సాధ్యంకాలేదని పోలీసుల తరపు న్యాయవాది కోర్టుకు విన్నవించారు. గజల్ బెయిల్‌తోపాటు పార్వతి ముందస్తు బెయిల్ పిటిషన్లపై విచారణ జరిగిన అనంతరం కోర్టు బుధవారం బెయిల్ మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

త్రిపుర ఎన్నికలకు నోటిఫికేషన్

అగర్తల : ఫిబ్రవరి 18న త్రిపుర రాష్ట్ర శాసనసభ ఎన్నికల నిర్వహణ కోసం ఎన్నికల కోసం బుధవారం నోటిఫికేషన్ జారీ చేసింది. మార్చి 3న ఓట్ల లెక్కింపును జరపనుండగా మార్చి 5వ తేదీకి ఎన్నికల ప్రక్రియ మొత్తం పూర్తికానుంది. అన్ని పోలింగ్ కేంద్రాలలో ఈవీఎంలు, ఓటరు-వెరిఫైడ్ పేపర్ ఆడిట్ ట్రయిల్(వీవీపీఏటీ)లను వినియోగించనున్నారు. కాగా 60 మంది సభ్యుల శాసనసభ పదవీ కాలం మార్చి 14న ముగియనుంది. మొత్తం 60 స్థానాలకుగాను 10 నియోజకవర్గాలు ఎస్సీ అభ్యర్థులకు, 20 స్థానాలు ఎస్టీ అభ్యర్థులకు రిజర్వు చేశారు. 2013లో నిర్వహించిన గత శాసనసభ ఎన్నికల నుంచి 5.6 శాతం పెరగడంతో 3,214 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. పోలింగ్‌కు కనీసం వారం రోజుల ముందు ఫొటో కలిగిన ఓటరు స్లిప్పులను పంపిణీ చేయనున్నారు. కాగా రాష్ట్రంలో ఎన్నికల ఫొటో గుర్తింపు కార్డు(ఈపీఐసీ) వంద శాతం పూర్తయ్యింది. రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో మొత్తం 25,69,216 మంది ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

ఫిబ్రవరి 3 నుంచి 5 వరకు

అమరావతిలో బౌద్ధ ఉత్సవాలు : అఖిల ప్రియ

విశాలాంధ్ర-అమరావతి : బౌద్ధ బోధనలతో విలసిల్లిన అమరావతిలో బుద్ధుడి అఖండ నామ స్మరణతో ప్రపంచ రికార్డు సృష్టించేందుకు పర్యాటక శాఖ సన్నద్ధమవుతోంది. విశ్వశాంతి కోసం అమరావతి బౌద్ధ సాంస్కృతిక ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని ఏపీ పర్యాటకశాఖ మంత్రి భూమా అఖిల ప్రియ వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ ప్రప్రథమంగా 1000 మంది బౌద్ధ భిక్షువులతో ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని, ఇది ప్రపంచ రికార్డు కాబోతోందన్నారు. వెలగపూడి అమరావతి సచివాలయంలో పర్యాటక శాఖ మంత్రి అఖిల ప్రియ, కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, ఏపీటీడీసీ ఎండి హిమాన్షు శుక్లాతో కలిసి మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఫిబ్రవరి 3 నుంచి 5 వరకు విజయవాడలో అమరావతి బౌద్ధ సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. హీనయాన బౌద్ధ ధర్మం పుట్టిన నవ్యాంధ్రను సాంస్కృతిక రాజధాని గా చాటి చెప్పడమే ఈ ఉత్సవాల లక్ష్యమని ఆమె వివరించారు. ఈ ఉత్సవాలకు దేశ విదేశాల నుంచి భారీగా బౌద్ధ భిక్షు వులు, ప్రముఖులు తరలివస్తార న్నారు. అమరావతి బౌద్ధ స్తూపంతో పాటు నాగార్జునకొండ, తొట్లకొండ, అనుపు, వంటి బౌద్ధారామాలను వారు సందర్శిస్తారని దీంతో విదేశీ టూరిజానికి ఉపకరిస్తుందని అఖిల ప్రియ వివరించారు. కార్యక్రమంలో బౌద్ధ గురువుల సందేశాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని ,ఫిబ్రవరి 4న విశ్వశాంతి కోసం బౌద్ధ భిక్షువులు ప్రార్ధనలు చేస్తారని తెలిపారు. కొలంబో నుంచి తొలి బౌద్ధ సన్యాసిని భిక్కున్ని కుసుమ కూడా వస్తున్నారని టిబెట్‌తో పాటు మలేషియా, సింగపూర్, శ్రీలంక, అమెరికా తరదితర దేశాల నుంచి బౌద్ధ గురువులు వస్తున్నారని, వీరితో కలిసి ఆన్‌లైన్‌లో వేల మంది దేశ, విదేశీయులు మంత్రోచ్చరణలో పాల్గొంటారని వివరించారు. ఇంత పెద్ద ఎత్తున బౌద్ధ భిక్షువుల సమ్మేళనం, ప్రార్ధనలు జరగడం ప్రపంచ రికార్డని , వీటిలో ప్రజలంతా పాల్గొనవచ్చని మంత్రి వెల్లడించారు. టూరిజం శాఖ కార్యదర్శి ముకేష్ కుమార్ మీనా మాట్లాడుతూ, గతేడాదికంటే విదేశీ పర్యాటకుల సంఖ్య ఈ ఏడాది 11 శాతం పెరిగిందన్నారు. నవ్యాంధ్రకు పర్యాటకుల రాక పెరిగిందని, అయితే, విదేశీ పర్యాటకులు ఎక్కువ మంది వస్తే, తద్వారా రాష్ట్రానికి ఆదాయం మరింత పెరుగుతుందన్నారు. ఒక పగటి టూరిస్ట్ వల్ల తలసరి రూ.830 ఆదాయం వస్తే, దినసరి పర్యాటకుడితో రూ. 3,300 ఆదాయం పెరుగుతుందన్నారు. విదేశీ టూరిస్టుల వల్ల రూ.1.50 లక్షల వరకు విదేశీ మారకం మనకు లభిస్తుందని మీనా వివరించారు. విజయవాడలో నిర్వహించే ఈ ఉత్సవాలకు బెంగళూరు, బుద్ధగయ, ధర్మశాల, హుబ్లీ తదితర ప్రాంతాల నుంచి తరలి వచ్చే బౌద్ధ భిక్షువుల కోసం వంద బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీటీడీసీ ఎం.డి. హిమాన్షు శుక్లా పేర్కొన్నారు.

వైభవంగా లేపాక్షి వేడుకలు

ఉత్సవ కార్యాచరణపై అధికారులతో బాలకృష్ణ సమీక్ష



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: లేపాక్షి ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహించాని నటుడు, హిందూపురం శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణ అధికారులను కోరారు. ఉత్సవాల కార్యచరణ, ప్రణాళికపై పర్యాటక, సాంస్కృతికశాఖ అధికారులు, అనంతపురం జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులతో విజయవాడలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో బుధవారం సమీక్షించారు. ఈ ఉన్నతస్థాయి సమావేశంలో రవాణాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్, పర్యాటక శాఖ కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా, ఏపీటీడీసీ ఎండీ హిమాన్షు శుక్లా, అనంతపురం జాయింట్ కలెక్టర్ రమామణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖేష్‌కుమార్ మీనా మాట్లాడుతూ సాంప్రదాయ విలువలు పాటిస్తూనే లేపాక్షి ఉత్సవాలను వైవిధ్యభరితంగా, వినూత్నంగా నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్దం చేసామన్నారు. ప్రత్యేకంగా చిన్నారులు, మహిళలను ఉల్లాసపరిచేలా చేపట్టే కార్యక్రమాలు ఒక జోన్‌లో, సాంప్రదాయ క్రీడా పోటీలు వేరొక జోన్‌గా నిర్వహించటం జరుగుతుందన్నారు.వారసత్వ జోన్‌లో దేవాలయాలకు సంబంధించిన అంశాలు ఉంటాయని మీనా స్పష్టం చేసారు. కార్యక్రమం నిర్వహణ కోసం ఇప్పటికే రూ. 2 కోట్లు మంజూరు చేసామని, నిధుల సమస్య లేకుండా వేడుకలను దిగ్విజయం చేయాలన్నదే పర్యాటక శాఖ ఉద్దేశ్యమన్నారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ లేపాక్షిలో ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా కనీసం 20 గదులకు తక్కువ కాకుండా వసతి గృహాన్ని నిర్మించవలసి ఉందని మీనా దృష్టికి తీసుకురాగా, 2017-2018 బడ్జెట్‌లో అందుకు అవసరమైన నిధులు కేటాయిస్తామన్నారు. ఈ సమావేశంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ ఆర్‌డి జి.గోపాల్, ఈఈ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ఏజీలో భారత చేరికపై అమెరికా అభినందనలు

న్యూఢిల్లీ : ఆస్ట్రేలియా గ్రూపులో నూతన సభ్యురాలు కానున్న భారత్‌కు అమెరికా బుధవారం అభినందనలు తెలిపింది. భారత ప్రభుత్వానికి సంబంధించిన అణ్వస్త్రవ్యాప్తి నిరోధక విశ్వసనీయత అద్భుతమని ఉద్ఘాటించింది. అణ్వస్త్ర వ్యాప్తి నిరోధంలో భారత్‌ను ఒక ప్రధాన భాగస్వామిగా పేర్కొంటూ, భారత్‌తో కలిసి పని చేయడానికి వాషింగ్టన్ ముందుకు వస్తుందని అమెరికా హోం వ్యవహారాల శాఖ పేర్కొంది. కాగా గతవారం ఆస్ట్రేలియా గ్రూపు(ఏజీ)లో భారత్ సభ్యురాలు కావడం ద్వారా క్లిష్టతర సాంకేతిక పరిజ్ఞానాన్ని పొందడంలో సహాయపడటంతో పాటు అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక రంగంలో తన విశ్వసనీయతను పెంచుకోవడానికి ఇది దోహదపడుతోంది. ఏజీలో ప్రవేశం నేపథ్యంలో క్షిపణి పరిజ్ఞాన నియంత్రణ వ్యవస్థ (ఎంటీసీఆర్), వాసెనార్ ఒప్పందం (డబ్ల్యూఏ), ఆస్ట్రేలియా గ్రూపు, అణ్వస్త్రవ్యాప్తి నిరోధకానికి చెందిన నాలుగు సభ్య దేశాలలో భారత్ మూడో సభ్య దేశం అయ్యింది.

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు రంగం సిద్ధం?



విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు నినాదంతో సాధించుకున్న ప్రతిష్టాత్మక విశాఖ స్టీల్ ప్లాంట్ (వీఎస్‌పీ) ప్రైవేటీకరణ జరిపేందుకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. వీఎస్పీలో 10శాతం వాటాల విక్రయానికి ప్రభుత్వం నిర్ణయించిందంటూ పార్లమెంటులో మంత్రి ప్రకటన చేయడం ప్రాథమిక సంకేతంగా భావించాల్సి వస్తోంది. వరుసగా రెండు సంవత్సరాలు నష్టాలు చవి చూసినందున వాటాల విక్రయానికి సిద్ధపడ్డామనేది ప్రభుత్వ సాధారణ వాదన. ఈ వాదనకు కొనసాగింపు ప్రైవేటీకరణ. 2015-16లో రూ.1,421 కోట్లు, 2016-17 రూ.1,236కోట్లు మేర వీఎస్పీకి నష్టాలు వాటిల్లినందునే ప్రైవేటీకరించేందుకు సిద్ధపడుతున్నామనేది ప్రభుత్వ వాదనగా ఉంది. అయితే, 2017 నవంబరు, డిసెంబరు మాసాల్లో అంచనాలను ప్లాంటు అందుకున్న వాస్తవాన్ని విస్మరించడమూ ప్రైవేటీకరణ కొనసాగింపుకేననే అభిప్రాయాన్ని బలపరుస్తోంది. ఆర్థికంగా పరిపుష్టంగా ఉన్న ప్రభుత్వ రంగసంస్థలను నష్టాల్లో ఉన్నాయన్న సాకుతో ప్రైవేటు శక్తులకు తెగనమ్మేందుకు ప్రభుత్వం ఉత్సాహం చూపుతున్న వైఖరిని ఇక్కడ వీఎస్పీ పరంగానూ అమలు చేయబూనుతోంది. ప్లాంటు తొలి దశ సామర్థ్యం 3.2మిలియను టన్నులు అంచనా వ్యయం రూ.8,652కోట్లు. ఇందులో ప్రభుత్వ పెట్టుబడి కేవలం రూ.4,889కోట్లు మాత్రమే. రెండవ దశ సామర్థ్యం 6.3మిలియను టన్నులు అంచనా వ్యయం రూ.12,300ల కోట్లు. ఈరెండవ దశ నిర్మాణ సామర్థ్యాన్ని రూ.4వేల అంచనా వ్యయంతో 7.3మిలియను టన్నులకు పెంచాలనేది యాజమాన్యం నిర్ణయంగా ఉంది. రెండవ దశలో ప్రభుత్వం చిల్లనయాపైసా కూడా పెట్టుబడి పెట్టలేదు మార్కెట్ నుంచి రుణాల సమీకరణ, అంతర్గత వనరుల సహాయంతోనే రెండవ దశ నిర్మాణ బాధ్యతను యాజమాన్యం జరిపింది.

ఆస్తుల విలువను తగ్గించి చూపడం: కంపెనీ నికర విలువను మదింపు చేసే క్రమంలోనే ప్రైవేటీకరణ వేగాన్ని గుర్తించవచ్చు. 1970లో ఎకరాకు రూ.12,500ల నష్టపరిహారం వంతున మొత్తం 22వేల ఎకరాలను ప్లాంటు కోసం సేకరించారు. వాటాలు విక్రయానికిగాను ఇదే లెక్కన ప్లాంటు నికర విలువ మదింపు చేయడం జరిగింది. ప్రస్తుతం ఈభూమి విలువ ఎకరా నాలుగు నుంచి ఐదు కోట్ల వరకు ఉంది. ఇదొక విధాన లోపమని చెప్పాలి. ప్లాంటు నికర విలువ రూ.4,889కోట్లుగా సెబీ అంచానా. ఇందులో 10శాతం అంటే రూ.489కోట్ల చిన్న మొత్తానికే ప్రైవేటు వ్యాపారులకు వాటాలు విక్రయించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్లాంటు వాస్తవ నికర విలువ సుమారు రూ.2లక్షల కోట్లు. ప్రభుత్వం అనుసరిస్తున్న పెట్టుబడుల ఉపసంహరణ, ప్రైవేటైజేషన్ ప్రక్రియలో అనేక ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తుల విలువ మదింపు తక్కువ చేయడమే పాలక పక్షాలు అనుసరిస్తున్న రాజకీయ, ఆర్థిక సూత్రంగా ఉంది. కాగా, కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్) కింద జరిపే వ్యయం కాక రూ.36వేల కోట్లను డివిడెండ్‌గా చెల్లించడం జరిగింది. విశాఖ స్టీల్ ప్లాంటనే ఒక ప్రభుత్వ రంగ సంస్థ ఉన్న కారణంగానే ఆంధ్రప్రదేశ్‌లో విశాఖ జిల్లా జీడీపీ రాష్ట్రంలోనే అత్యధికంగా నమోదు చేయగలిగింది. రాష్ట్రంలోని అన్ని మండలాల కంటే గాజువాక మండల ప్రజ సగటు తలసరి ఆదాయం ఎక్కువగానూ ఉంటోంది. ఏటా రూ.2,400కోట్లను సిబ్బందికి జీతాలుగా చెల్లిస్తోంది. మౌలిక సదుపాయాల రంగం సహా అనేక రంగాల్లోని అనేక బడా కార్పొరేట్ సంస్థల మొండిబకాయిలను ప్రభుత్వాలు రద్దు చేస్తూ వస్తున్న సంగతి తెలిసిందే. అదే మొత్తాలను ప్రభుత్వ రంగ సంస్థల ఆర్థిక ఇక్కట్లు తీర్చడానికి వెచ్చిస్తే అవి లాభదాయకతను సంతరించుకుంటాయి. అధికారంలోకి వచ్చిన ఏప్రభుత్వమూ ఈ పని చేయడం లేదు.

ప్రైవేటు రంగంలోని టాటాలు, మిట్టల్‌ల వంటి అనేక స్టీల్ ప్లాంట్లకు ఇనుప ఖనిజ గనులను ప్రభుత్వం కేటాయిస్తోంది. అదే తన అధీనంలోని వీఎస్పీ వంటి ప్రభుత్వ రంగ ప్లాంట్లకు గనుల కేటాయింపు జరపడానికి ప్రభుత్వం విముఖత చూపుతోంది. సొంత గనులు లేనందున ముడి సరుకు కొనుగోలుకు టన్నుకు రూ.2వేల నుంచి రూ.3,500ల వరకు వీఎస్పీ వెచ్చించాల్సి వస్తోంది. మార్కెట్ ధర ఎంత ఉంటే అంత మొత్తాన్ని చెల్లించాల్సి వస్తోంది. ప్రస్తుత ఉత్పత్తి సామర్థ్యం ప్రకారం వీఎస్పీకి సుమారు 7.5మిలియను టన్నుల ముడి ఇనుము అవసరం అవుతుంది. ఈలెక్కన ముడి సరుకు కోసం ఏటా రూ.1,500కోట్లను వెచ్చిస్తోంది. ఒక వంక వీఎస్పీ వంటి ప్రభుత్వ రంగ సంస్థలకు ముడి ఇనుము డిమాండ్‌గా ఉండగా గాలి జనార్ధన రెడ్డి వంటి ప్రైవేటు శక్తులకు కారు చౌకగా గనులు కేటాయిస్తున్నారు. రెండవది ప్లాంట్లకు సరఫరా చేసే విద్యుత్ టారిఫ్ పరిశీలిస్తే అభివృద్ధి చెందిన దేశాల కంటే సుమారు 50 నుంచి 100శాతం ఎక్కువ టారిఫ్ వసూలు చేస్తున్నారు. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే ముడి ఇనుము ప్రభావమూ దేశీయ మార్కెట్‌ను దెబ్బతీస్తోంది.

ప్రపంచంలో మూడవ అతి పెద్ద ఉక్కు తయారీదారుగా భారత్ ఉందని నీతి అయోగ్ సభ్యుడు వీకే సారస్వత్ ఇటీవల తెలిపారు. లాభదాయకతను నిలబెట్టుకునేందుకు వీఎస్పీ వంటి ప్రభుత్వ రంగ సంస్థలకు వాణిజ్య బ్యాంకులు చేయూతనిచ్చేందుకు ఆసక్తి చూపని పరిస్థితి ఉంది. ప్రైవేటు రుణాలపై వడ్డీ రూ.600ల కోట్లు, తరుగుదల వ్యయం రూ.900కోట్లు భరించాల్సిన పరిస్థితి వీఎస్పీకి తలెత్తుతోంది. ఈ విధానాలను ఒక దాని వెంట ఒకటి వరుసగా పరిశీలిస్తే ప్లాంటు నష్టాలకు ప్రభుత్వం అమలు జరిపే విధానాలే కారణమని తెలుస్తుంది. ఇతర ప్లాంట్లతో పోటీ పడే స్థాయిని నిలబెట్టడంలోనూ ఇదే అనాసక్తి కనిపిస్తోంది. మార్కెటింగ్ ప్రక్రియలోనూ ప్రైవేటు కార్పొరేట్ల లాభదాయకతకు అనుగుణంగా అనుసరించే విధానాలు వీఎస్పీ వంటి ప్లాంట్లకు గొడ్డలి పెట్టుగా మారాయి. చిన్న లోపాలను సకాలంలో సరిదిద్దక పోవడం పెద్ద లోపాలకు ద్వారాలు తెరిచే విధానాలను అనుసరిస్తున్న కారణంగానే విశాఖ స్టీలు ప్లాంటును ప్రైవేటీకరించాల్సిన పరిస్థితి ఎదురవుతోందని గ్రహించాలి.

పెట్రోల్లా.. లిక్కర్ (మొదటిపేజీ తరువాయి)

కోట్ల ఆదాయం లభించే అవకాశం ఉంది. గత సంవత్సరం డిసెంబరు నాటికే 75 శాతం ఆదాయాన్ని ఎక్సైజ్‌శాఖ ఆర్జించినట్లు ఇటీవల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ కమిషనర్ డాక్టర్ పీ లక్ష్మీనరసింహం తెలిపారు. మిగిలిన మూడు నెలల్లో మరో 25 శాతం లక్ష్యాన్ని అధిగమిస్తామన్నారు. అన్నట్లుగానే మద్యం అమ్మకాల ఆదాయం పరుగులు పెడుతోంది. ఈ నెల 23వ తేదీకే రాష్ట్రంలోని 13 జిల్లాల్లో మద్యం అమ్మకాల ద్వారా ప్రభుత్వానికి రూ.13,915.18 కోట్ల ఆదాయం లభించింది. ఇప్పటి వరకు 2.93 కోట్ల ఐఎంఎల్ కేసులు, 1.80 కోట్ల బీరు కేసులు సేల్ అయ్యాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయానికి మద్యం అమ్మకాల ద్వారా రూ.11,384.29 కోట్ల ఆదాయం లభించింది. గత సంవత్సరంతో పోల్చితే ఈ ఏడాది రూ.2,530.88 కోట్ల ఆదాయం అదనంగా సమకూరింది. ఎక్సైజ్‌శాఖ లెక్కల ప్రకారం 2016-17 ఆర్థిక సంవత్సరంలో మద్యం అమ్మకాల ద్వారా రూ.13,641.54 కోట్ల ఆదాయం లభించింది. అయితే ఈ నెల 23వ తేదీనాటికే గత ఏడాది ఆదాయం కంటే రూ.275 కోట్ల అధిక ఆదాయం లభించింది.

పెట్రో పన్నుతో మందు పోటీ

రాష్ట్ర ప్రభుత్వానికి పన్నుల రూపంలో పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరుతోంది. పలు రకాల ఉత్పత్తులపై వాణిజ్యపన్నులశాఖ పన్నులను విధిస్తుంది. వాణిజ్య పన్నులశాఖ ఆదాయం ప్రధానంగా పెట్రో ఉత్పత్తుల ద్వారా ఇప్పటి వరకు సుమారు రూ.5 వేల కోట్ల ఆదాయం వస్తోంది. అదే సమయంలో మద్యంపై విధించే పన్ను ద్వారా రూ.4,500 కోట్ల మేర ఆదాయం లభించింది. దీనినిబట్టి పెట్రో పన్నుతో మందు పోటీ పడుతున్నట్లు స్పష్టమవుతోంది. వాణిజ్య పన్నుల శాఖకు ఇప్పటి వరకు రూ.18,197 కోట్ల ఆదాయం లభిస్తే, అందులో రూ.9, 500 కోట్లు పెట్రో ఉత్పత్తులు, మద్యం అమ్మకాలపై విధించిన పన్నుల వాటా కావటం విశేషం. మద్యాన్ని ప్రధాన ఆదాయ వనరుగా చూడటంలేదని ప్రభుత్వం పదే పదే చెబుతున్నా, వాస్తవానికి ఆదాయ వనరుగానే భావించటం గమనార్హం.

విశాఖ, తూర్పు గోదావరి టాప్

మద్యం అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయంలో విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాలు టాప్‌లో కొనసాగుతున్నాయి. గత సంవత్సరం ఏప్రిల్ నుంచి ఈ ఏడాది జనవరి 23వ తేదీ వరకు జరిగిన అమ్మకాల్లో విశాఖజిల్లా రూ.1,529.86 కోట్ల ఆదాయంతో రాష్ట్రంలో మొదటిస్థానంలో నిలవగా, తూర్పు గోదావరి జిల్లా రూ.1,507.50 కోట్ల ఆదాయంతో రెండోస్థానంలో ఉంది. గత ఏడాది డిసెంబరు 31వ తేదీ రాత్రి రాష్ట్రవ్యాప్తంగా రూ.100 కోట్లపైనే మద్యం అమ్మకాలు జరగ్గా, సంక్రాంతి సందర్భంగా మూడు రోజులలో సుమారు రూ.250 కోట్ల అమ్మకాలు జరిగాయి. ఈ రెండు సందర్భాల్లోనూ తూర్పు గోదావరి, విశాఖ జిల్లాలు మొదటి స్థానంలో ఉండటం విశేషం. కృష్ణాజిల్లా రూ.1,405.94 కోట్ల ఆదాయంతో మూడోస్థానంలో, గుంటూరు రూ.1,351.05 కోట్లతో నాలుగోస్థానంలో ఉండగా, చిత్తూరు జిల్లాకు రూ.1,331.65 కోట్లు పశ్చిమ గోదావరికి రూ.1,294.37 కోట్లు, నెల్లూరుకు రూ.994.88 కోట్లు, కర్నూలుకు రూ.833.58 కోట్లు, అనంతపురం జిల్లాకు రూ.829.34 కోట్లు, ప్రకాశం జిల్లాకు రూ.770.27 కోట్లు ఆదాయం లభించగా, విజయనగరం జిల్లాలో రూ.722.97 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు,, కడపలో రూ.675.31 కోట్ల శ్రీకాకుళంలో రూ.671.23 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరిగాయి.

సెమీస్‌కు ఫెదరర్



మెల్‌బోర్న్: డిఫెండింగ్ చాంపియన్ రోజర్ ఫెదరర్ బుధవారం జరిగిన మ్యాచ్‌లో థామస్ బెర్డిచ్‌పై 7-6, 6-3, 6-4 తేడాతో గెలుపొంది సెమీస్‌లోకి ప్రవేశించాడు. రెండో సీడ్‌లో ఉన్న ఫెదరర్ ఈ మ్యాచ్ ఆడేందుకు 2 గంటల 14 నిమిషాలు పట్టింది. శుక్రవారం జరిగే మ్యాచ్‌లో సౌత్ కొరియా అన్‌సీడ్ చుంగ్ హయాన్‌తో తలపడనున్నాడు. 19 గ్రాండ్‌స్లామ్‌ల విజేతైన ఫెదరర్ మెల్‌బోర్న్‌లో బెర్డిచ్‌ప జరిగిన ఐదు మ్యాచ్‌లలో ఒక్కటి కూడా ఓడిపోలేదు. 105 మ్యాచ్‌లలో తాజాగా ఫెదరర్ సాధించిన ఈ విజయం 92వది. 'ఫస్ట్ సెట్ గెలిచినందుకు సంతోషించాను. చివర వరకూ అదే ఒత్తిడి కొనసాగించా' అని తెలిపాడు. దూకుడుగా ఆడాలనుకున్నా. దాన్ని గమనించిన థామస్ దానికి తగ్గట్టుగానే ఆడాడు' అని వివరించాడు.

మిక్స్‌డ్ డబుల్స్ సెమీస్‌లో బోపన్నా-టైమా బాబ్స్ జోడీ

భారత్‌కు చెందిన రోహన్ బోపన్నా-టైమా బ్స్ మిక్స్‌డ్ డబుల్స్‌లో బుధవారం సెమీస్‌లో ప్రవేశించారు. బోపన్నా-బాబ్స్ జోడీ కొలంబియన్‌లైన జుయాన్ సెబాస్టియన్ క్యాబెల్ అబిగైల్ స్పెర్స్ జంటపై ఈ విజయం సాధించారు. ఈ ఆట ఆడేందుకు వీరికి గంట 15 నిమిషాలు పట్టింది. దీనికి కోసం చాలా శ్రమించాల్సి వచ్చింది.



రాజకీయాలే అడ్డంకి: అక్తర్



న్యూఢిల్లీ: రెండు దేశాల్లోని ప్రస్తుత రాజకీయాల కారణంగా యాషెస్ తరహాలో భారత్×పాక్ మ్యాచ్‌లు చూడలేక పోతున్నామని పాకిస్థాన్ మాజీ పేసర్ షోయబ్ అక్తర్ ఆవేదన వ్యక్తం చేశాడు. రెండు దేశాల ఆటగాళ్ల, బోర్డులు మ్యాచ్‌లకు సుము ఖంగానే ఉన్నా రని వెల్లడించారు. ముంబై పేలుళ్ల నేపథ్యంలో 2008 నుంచి దాయాది దేశాలు పూర్తిస్థాయి ద్వైపాక్షిక సిరీ స్‌లు ఆడని సంగతి తెలిసిందే. 2012లో చిన్న సిరీస్ ఆడినా ప్రస్తుతం దానికీ తావులేని పరిస్థితులు ఉన్నాయి. 'దాయాది దేశాల మధ్య జరిగే హోరాహోరీ క్రికెట్ సమ రాలను ఆటగాళ్లు ఆస్వాదించ లేకపోతున్నం దుకు బాధగా ఉంది. యాషెస్‌తో పాటు భారత్×పాక్ సిరీస్‌లు సైతం అతిపెద్దవి. సిరీస్‌లు జరగకపోవడం వల్ల రాత్రికిరాత్రే క్రికెటర్లు హీరో లుగా మారలేక పోతున్నారు. పాక్ ఆట గాళ్లకు భారత్‌లో ఎంతో అభి మానం లభించేది. భారతీ యులు నన్నెంతో ప్రేమిం చారు. ప్రతిభను ప్రదర్శించి ప్రస్తుత పాక్ క్రీడాకారులు అదే ప్రేమను పొందాలని నేను కోరుకుంటున్నాను' అని అక్తర్ పేర్కొన్నాడు. 'భారత్, పాక్ మధ్య మ్యాచ్‌లు జరగాలి. ఇది జరగకపోతే అనవసరమైన ప్రకటనలు చేయడం మానుకోవాలి. ప్రస్తుతం రెండు జట్లు ఐసీసీ టోర్నీల్లో మాత్రమే తలపడుతున్నాయి. రెండు దేశాల మధ్య దౌత్యపరమైన చర్చలు జరిగే వరకు ద్వైపాక్షిక సిరీస్‌లు జరిగే అవకాశమే లేదు. క్రీడలను రాజకీ యాలకు దూరంగా ఉంచాలని తరచూ చెబుతున్నా. ఇప్పుడు దౌత్య చర్యల వరకు పోవడం బాధాకరం. దీంట్లో రెండు బోర్డుల తప్పేమీ లేదు' అని అక్తర్ వెల్లడించారు.

'ఓటమిపై వివరణ ఇవ్వండి'



ముంబై: సఫారీ పర్యటనలో కోహ్లిసేన వరుస వైఫల్యాలపై వివరణ ఇవ్వాలని బీసీసీఐ పాలకుల కమిటీ ఆదేశించింది. ఈ మేరకు టీమ్ మేనేజర్‌కు లేఖ రాసింది. ముంబైలో బుధవారం బీసీసీఐ పాలకుల కమిటీ సమావేశమైంది. సొంతగడ్డపై విజయాలతో దూసుకుపోయిన కోహ్లిసేన దక్షిణాఫ్రికా గడ్డపై చతికిలపడిన దానిపైనే ప్రధానంగా వీరి సమావేశంలో చర్చ జరిగినట్టు సమాచారం. అంతేకాదు పలువురు మాజీ క్రికెటర్లు ప్రాక్టీస్ మ్యాచ్ ఆడకుండా సిరీస్ ఆడటంపై, సఫారీ పర్యటనకు ముందు శ్రీలంకతో సిరీస్‌లు నిర్వహించడం వల్ల లాభం చేకూరలేదని వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో బీసీసీఐ అధికారులు, పాలకుల కమిటీ సభ్యులు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. బీసీసీఐ సీఈవో రాహుల్ జోహ్రీ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలోనే ఓటములకు గల కారణాలను వివరణా త్మకంగా తెలియజేయాలని పాలకుల కమిటీ దక్షిణాఫ్రికా పర్యటనలో టీమిండియా మేనేజర్‌కు లేఖ రాసింది. 'ఈ సమావేశంలో టీమిండియా ఓటముల గురించే ప్రధానంగా చర్చించాం. ఓటమికి గల కారణాల గురించి ఇప్పుడే స్పష్టంగా చెప్పలేం. టీమ్ మేనేజర్ నుంచి సమాధానం అందుకున్న అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తాం' అని సమావేశానికి హాజరైన ఓ బీసీసీఐ అధికారి తెలిపారు.

భారత్ విలవిల



- చుక్కలు చూపించిన ప్రొటీస్ పేసర్లు
- 187 పరుగులకు ముగిసిన ఇన్నింగ్స్
- రెండెంకల స్కోరు చేసిన కోహ్లి, పుజారా, భువీ
- మిగతావారంతా ఒక డిజిట్‌కే పరిమితం
- మారని టీమిండియా కథ

జొహనెస్‌బర్గ్: వాండరర్స్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరుగుతున్న మూడో టెస్ట్‌లో సౌతాఫ్రికా పేసర్ల ధాటికి భారత ఆటగాళు విలవిలలాడిపోయారు. తొలి రెండు టెస్ట్‌ల ఓటమి తర్వాత తప్పనిసరిగా గెలవాల్సిన ఈ మ్యాచ్‌లో ఊహించనంతగా రాణించలేకపోయారు. కెప్టెన్ విరాట్ కోహ్లి, పుజారా, మినహా మిగితా ఆటగాళ్లందరూ స్వల్ప స్కోర్ చేసి పెవిలియన్ చేరారు. ఆఖర్లో భువనేశ్వర్ వచ్చి మెరుపులు మెరిపించడంతో తొలి ఇన్నింగ్స్‌లో టీం ఇండియా 187 పరుగులు చేసి ఆలౌట్ అయింది. మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. 13 పరుగులు వద్దే ఓపెనర్లు కేఎల్ రాహుల్(0), మురళీ విజయ్(8) ఔట్ అయ్యారు. ఈ దశలో కెప్టెన్ విరాట్ కోహ్లి, పుజారాతో కలిసి జట్టును ఆదుకున్నారు. ఓవైపు పుజారా వికెట్‌ను కాపాడుతుంటే.. మరోవైపు కోహ్లి స్కోర్ బోర్డును పరుగులు పెట్టించేందుకు కృషి చేశాడు. ఈ నేపథ్యంలో తన టెస్ట్ కెరీర్‌లో 16వ హాఫ్ సెంచరీ చేసిన కోహ్లి ఆ వెంటనే డివిలియర్స్‌కి క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. ఈ దశలో మూడో టెస్ట్‌లో ఎన్నో ఆశలతో చోటు దక్కించుకున్న రహానే కూడా 9 పరుగులు మాత్రమే చేసి ఔట్ అయ్యాడు. అప్పటివరకూ మందకోడిగా ఆడిన పుజారా ఆ తర్వాత మాత్రం వేగం పెంచాడు. బౌండరీలు బాదుతూ.. 178 బంతుల్లో 50 పరుగులు చేసి వెంటనే ఔట్ అయ్యాడు. పుజారా వికెట్ తర్వాత వచ్చిన బ్యాట్స్‌మెన్లు పార్థీవ్ పటేల్(2), పాండ్యా(0), షమీ(8), ఇషాంత్(0) చెత్తషాట్లకు ప్రయత్నించి ఔట్ అయ్యారు. ఆఖర్లో భువనేశ్వర్ వచ్చి దూకుడుగా ఆడాడు. 49 బంతుల్లో 30 పరుగులు చేసిన భువీ రబదా బౌలింగ్‌లో ఔట్ అయ్యాడు. దీంతో భారత్ 76.4 ఓవర్లలో 10 వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసింది. దక్షిణాఫ్రికా బౌలింగ్‌లో రబదా 3, పెహ్లుక్‌వాయో, మోర్కెల్, ఫిలాండర్ చెరి రెండు, లుంగి 1 వికెట్ తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సఫారీలకు భువనేశ్వర్ ప్రారంభంలోనే షాక్ ఇచ్చాడు. మూడో ఓవర్ 3వ బంతికి ఓపెనర్ మార్క్‌రంను పెవిలియన్ బాటపట్టించాడు. దీంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి దక్షిణాఫ్రికా 6 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 6 పరుగులు చేసి భారత్ కంటే 181 పరుగుల వెనుకంజలో ఉంది. క్రీజ్‌లో ఎల్గర్(4), రబదా(0) ఉన్నారు.

స్కోరు బోర్డు :

మురళీ విజయ్ (సి) డికాక్ (బి) రబద 8, లోకేష్ రాహుల్ (సి) డికాక్ (బి) ఫిలండర్ 0, ఛెతేశ్వర్ పుజారా (సి) డికాక్ (బి) పెహ్లుక్‌వాయో 50, విరాట్ కోహ్లి (సి)డివిలియర్స్ (బి) లుంగి ఎంగిడి 54, అజింక్యా రహానె (ఎల్‌బీడబ్ల్యూ) (బి) మోర్కెల్ 9, పార్థీవ్ పటేల్ (సి) డికాక్ (బి) మోర్కెల్ 2, హార్దిక్ పాండ్య (సి) డికాక్ (బి) పెహ్లుక్‌వాయో 0, భువనేశ్వర్ కుమార్ (సి) పెహ్లుక్‌వాయో (బి) రబద 30, షమీ (సి) రబద (బి) ఫిలాండర్ 9, ఇషాంత్ శర్మ (సి) డుప్లిసిస్ (బి) రబద 0, జస్ప్రీత్ బూమ్రా నాటౌట్ 0,

మొత్తం : 10 వికెట్లకు 187

గొట్టిపాడులో విభేదాలు తొలగినట్లేనే..?

పోలీసు పహారాలోనే గ్రామం

విశాలాంధ్రబ్యూరో - గుంటూరు/ ప్రత్తిపాడు: గుంటూరు జిల్లాలో ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడులో ఇరువర్గాల మధ్య రాజీ కుదిర్చినప్పటికీ విభేదాలు తొలగినట్లు కనిపించడం లేదు. ఈ వివాదంలో ప్రధాన పాత్రధారులైన మరో ముగ్గురు అగ్రవర్ణాలకు చెందిన వారి పై కేసులు నమోదు చేయాలని దళితులు డిమాండు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం గ్రామంలోకి ప్రవేశిస్తున్న వామ పక్షాల నాయకులను పోలీసులు అరెస్ట్ చేయడంతో గ్రామంలో ఉన్న దళితులు రోడ్డు ఎక్కి పెద్దఎత్తున నిరసన తెలిపారు. తమను పరామర్శించేందుకు వస్తున్న నాయకులను ఎందుకు అడ్డుకుని అరెస్టు చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో కొంత ఉద్రిక్తత నెలకొంది. వివాదం జరిగి దాదాపు 25 రోజులు అవుతున్నప్పటికీ గ్రామంలో పరిస్థితి అం తంతమాత్రంగానే ఉంది. గతంలో ఇరు వర్గాలు కలిసి మెలిసి వ్యవసాయం పనులు చేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి కనిపిం చడం లేదు. ప్రధా నంగా వివాదంలో ఉన్న వారిని ఇప్పటి వరకు ఎందుకు అరెస్ట్ చేయ లేదని దళితులు ప్రశ్నిస్తున్నారు. దీనికితోడు గ్రామంలో 144 సెక్షన్ కొనసాగుతోంది.

ఏషియన్ పీసాపోలో చాంప్ భారత్

విశాలాంధ్ర - విజయవాడ స్పోర్ట్స్: ఈనెల 17 నుంచి 21 వరకు నేపాల్‌లోని ఖాట్మండులో జరిగిన మొదటి పీసాపోలో చాంపియన్‌షిప్‌లో భారతజట్టు బంగారు పతకం సాధించింది. ఈ పోటీల్లో ఇండియా, పాకిస్థాన్, భూటాన్, నేపాల్, శ్రీలంక టీమ్‌లు పాల్గొన్నాయి. విజేతగా నిలిచి బంగారు పతకం సాధించి నగరానికి చేరుకున్న భారతజట్టుకు విజయవాడ రైల్వేస్టేషన్‌లో క్రీడాసంఘాలు, కాకార్ల స్పోర్ట్స్ అకాడమీ క్రీడాకారులు, కృష్ణదేవరాయ ఇన్‌స్టిట్యూట్, సెయింట్‌జోసఫ్ స్కూల్ నున్న విద్యార్థులు ఘనస్వాగతం పలికారు. క్రీడాకారులను రైల్వేస్టేషన్ నుంచి ఇందిరాగాంధి మున్సిపల్ స్టేడియం వరకు ఊరేగించి భారత ఖ్యాతిని కొనియాడారు. భారత జట్టుకు చీఫ్ కోచ్‌గా వ్యవహరించిన సరళా శ్రీనివాస్ మాట్లాడుతూ విజయం సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కాకర్ల స్పోర్ట్స్ అకాడమీ సెక్రటరీ కాకర్ల శ్రీనివాసరావు, ఓఏఐ సొల్యూషన్ ఎండి శ్రీరామరాజు, కృష్ణదేవరాయ ఇన్‌స్టిట్యూట్ అధినేత మేరుగు వరుణ్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.



• విద్యుత్ కాంతుల్లో సచివాలయం

గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా వెలగపూడిలోని సచివాలయానికి బుధవారం విద్యుత్ అలంకరణ చేశారు. దీంతో సచివాలయం విద్యుత్ కాంతుల వెలుగుల్లో ధగధగలాడుతోంది. (విశాలాంధ్ర- అమరావతి)



రాజీనామా చేస్తానన్నది నిజమే

సీపీఎం ప్రధాన కార్యదర్శి ఏచూరి

న్యూఢిల్లీ: పార్టీ సెంట్రల్ కమిటీ సమావేశంలో తాను రాజీనామా చేస్తానన్నది నిజమేననీ గతంలో కూడా ఈమాట చెప్పాననీ సీపీఎం ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి స్పష్టం చేశారు. ఈ అంశంపై వేరుగా చెప్పడం ఒట్టిఅబద్ధం. కోల్‌కతాలో జరిగిన సెంట్రల్‌కమిటీ సమావేశంలోనేగాక అంతకుముందు ఢిల్లీలో జరిగిన పొలిట్‌బ్యూరో సమావేశంలోకూడా రాజీనామా చేస్తానని చెప్పాను. అయితే రెండు సమావేశాల్లోనూ కొనసాగమని కోరారు. సెంట్రల్‌కమిటీ సమావేశంలో సీతారాం ఏచూరి ప్రతిపాదించిన ముసాయిదాను తిరస్కరించిన తరువాత రాజీనామా చేయడానికి సిద్ధపడినట్లు చెప్పడం నిజంకాదని పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్‌కారత్ చెప్పినట్లు వచ్చిన వార్తలపై ప్రశ్నించగా పైవిధంగా స్పందించారు. న్యూస్‌వెబ్ పోర్టల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో కారత్, ఏచూరి రాజీనామాపై పైవిధంగా చెప్పారు. 'సెంట్రల్ కమిటీ సమావేశం తరువాత జరిగిన విలేకరుల సమావేశంలోనూ రాజీనామా అంశాన్ని స్పష్టంగా చెప్పారు. నేను కొనసాగడం సమంజసం కాదనికూడా చెప్పాను. అయితే పొలిట్‌బ్యూరో తిరస్కరించింది. పార్టీలో విభజన ఏర్పడిందనే భావన కలుగుతుందనీ ప్రత్యేకించి త్రిపుర ఎన్నికల సందర్భంగా ఇది సరైందికాదనీ భావించారు. అందువల్ల నన్ను కొనసాగమని అందరూకలిసి చెప్పారు. సెంట్రల్‌కమిటీలో ఈ విషయాన్ని పలుమార్లు చెప్పినా, కొనసాగమనే అన్నారు. ప్రధాన కార్యదర్శిగా నేను విలేకరుల సమావేశానికి వచ్చాను. మా సెంట్రల్‌కమిటీ, పొలిట్‌బ్యూరో నన్ను కొనసాగమని కోరింది. అంటే నేను చెప్పింది స్పష్టమైంది' అని ఏచూరి పీటీఐకి తెలిపారు. తాను వాస్తవాలే చెప్పాననీ, ఈ సమావేశంలో పాల్గొన్న మరే ఇతర నాయకుడినైనా అడిగి తెలుసుకోవచ్చునని ఏచూరి వివరించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.